ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

బుధవారం 11 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 145 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

చైనా వ్లాగర్ల తీరుపై
కేంద్రం సీరియస్
భారత్‌పై విష ప్రచారం వివాదాస్పదం



2



హసీనాకు మరణశిక్షే దిక్కు!
పాస్‌పోర్టు జారీకి చట్టంలో అవకాశం లేదు: బంగ్లా ట్రైబ్యునల్ ప్రాసిక్యూటర్

2



శ్రీశైలం, సాగర్ అసలు అనుమతులపై
కేఆర్ఎంబీ ఆరా!
ప్రాజెక్టుల తొలి రూపకల్పన వివరాలు ఇవ్వాలని ఏపీ, తెలంగాణకు లేఖలు

నీటి వినియోగం, కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలపై ఆరా

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి అసలు అనుమతుల వివరాలు సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖలు రాసింది. ప్రాజెక్టుల అసలు రూపకల్పన, నీటి వినియోగం, కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలతో పాటు ఆ తర్వాత చేపట్టిన మార్పులు, అదనపు నీటి అవసరాల వివరాలు ఇవ్వాలని కోరింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల మేరకు మొదట ఆమోదించిన ప్రాజెక్టు వివరాలనే ప్రామాణికంగా తీసుకొని తదుపరి మార్పులను పరిశీలించనున్నట్లు పేర్కొంది.

-న్యూఢిల్లీ, నవంబర్ 10 (సింగిడి)

ప్రజల విశ్వాసమే పోలీసుల
అసలైన బలం!
కొత్తగా నియమితులైన 112 మంది డీఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు వాడొద్దు.. ప్రజాసేవకే అంకితం చేయాలి

అవసరమైతే విదేశాల్లో ప్రత్యేక శిక్షణ



112 మంది డీఎస్పీ ల నియామకం చాలా పెద్ద విషయమని.. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే పోలీసులది పెద్ద హోదా అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏ ఉద్దేశంతో పోలీస్ శాఖలో చేరారో దాన్ని మరవొద్దన్నారు. మన నేపథ్యాన్ని మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమని నొక్కి చెప్పారు. టీచర్లను పంపిస్తున్నట్టే డీఎస్పీలనూ విదేశాలకు పంపిస్తామని చెప్పారు.

హైదరాబాద్, నవంబర్ 10 (సింగిడి)

యూపీఎస్సీని అధ్యయనం చేసి ఆ తరహాలో టీజీపీఎస్సీని రూపొందించామన్నారు. పోలీసు నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటించామని వెల్లడించారు. ఎంసీఆర్ హెచ్ ఆర్డీలో ప్రొబేషనరీ డీఎస్పీల ముఖాముఖి కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. డీఎస్పీలు తమ ఫిట్‌నెస్‌పై మరింత ఫోకస్ పెట్టాలన్నారు. సంక్లిష్టమైన పరిస్థితుల్లో డీఎస్పీల నియామకం చేపట్టాం. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు ఈ ప్రభుత్వమే పూర్తి చేసింది. 2011లో గ్రూప్-1 నియామకాలు చేపట్టారు. ఆ తర్వాత 2025 వరకు దాదాపు 13 ఏళ్లు తెలంగాణలో గ్రూప్-1 నియామకాలు చేపట్టలేదు. కొన్ని నెలలు ఆలస్యమైతేనే ఏళ్లు కోల్పోయామన్న బాధ అనిపిస్తుంది. టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చినా ప్రశ్నాపత్రాలు, ఇతర అంశాల్లో జరిగిన గందరగోళం అందరికీ తెలుసు. మీరు ఆ రోజు బాధితులు.. ఆనాటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, నిర్లక్ష్యం చాలా మందికి కష్టనష్టాలు మిగిల్చింది. నేను ముఖ్యమంత్రిగా కాగానే టీజీపీఎస్సీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించాను. టీజీపీఎస్సీలో గతంలో సభ్యులుగా పని చేసిన వారిలో ఆర్ఎంపీ డాక్టర్లు లాంటి వాళ్లు ఉన్నారు. ఉన్నత స్థాయిలో నియామకాలు చేపట్టే టీజీపీఎస్సీ బోర్డులో అంతకంటే కింది స్థాయి వాళ్లను, అవగాహన లేని వాళ్లను సభ్యులుగా నియమించడమే ప్రభుత్వ తప్పు. రాజకీయ పునరావాసానికి కేంద్రంగా టీజీపీఎస్సీ తయారైంది. యూపీఎస్సీ తీసుకుంటున్న విధానాలను అధ్యయనం చేసి టీజీపీఎస్సీని ఆ తరహాలో రూపొందించాం. యూపీఎస్సీకి స్వయంగా వెళ్లి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నాం. టీజీపీఎస్సీ మొదటి చైర్మన్‌గా రిటైర్డ్ డీజీ మహేందర్ రెడ్డిని నియమించాం. పోటీ పరీక్షలు నిర్వహించడంలో అనుభవం కలిగిన వాళ్లను, చిత్తశుద్ధి ఉన్నవాళ్లను బోర్డు సభ్యులుగా నియమించాం. భవిష్యత్తు నిర్ణయించే వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లితే నియామకాల పట్ల అపనమ్మకం ఏర్పడుతుంది. ప్రస్తుతం సీనియర్ ఐఏఎస్ అధికారి

...మిగతా 2లో

రాహుల్ వ్యాఖ్యలకు
బీజేపీ కౌంటర్
సాయుధ దళాలను గౌరవించడంలో

కాంగ్రెస్, రాహుల్ వరుసగా విఫలమవుతున్నారన్న రాంచందర్ రావు



నక్సల్స్ హింసను గానీ, పుల్వామా దాడిని గానీ ఖండించే ధైర్యం రాహుల్‌కు లేదని విమర్శ

విదేశాలకు పారిపోకుండా పార్లమెంట్ చర్చలో పాల్గొనాలని సూచన

2

డిజిటల్ అరెస్ట్ మోసాలపై కఠిన చర్యలు

పూనుకున్న సుప్రీంకోర్టు

సైబర్ నేరాల నియంత్రణకు ప్రణాళికలు సమర్పించాలని ఆయా సంస్థలకు ఆదేశం

ఈ ప్రతిపాదనలను భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు కూడా అందించాలని స్పష్టీకరణ

బ్యాంకుల నిర్లక్ష్యంతో మోసం జరిగితే బాధితులకు పరిహారం చెల్లించాల్సిందేనన్న ధర్మాసనం

కేసుల దర్యాప్తు వివరాలతో సమగ్ర నివేదికలు ఇవ్వాలని రాష్ట్రాల డీజీపీలకు ఆదేశాలు

2

18న కరీంనగర్‌కు
నితిన్ నబీన్ రాక
లక్ష మందితో మహా పాదయాత్రకు బీజేపీ ఏర్పాట్లు

బండి సంజయ్ నేతృత్వంలో కార్యక్రమ నిర్వహణ

గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు యాత్ర

పాదయాత్రలో పాల్గొననున్న రాంచందర్‌రావు

2



తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'సర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది.

హైదరాబాద్, నవంబర్ 10 (సింగిడి)

సమగ్ర భూ రీసర్వే కీలక మైలురాయి
వెయ్యి గ్రామాలు దాటిన ప్రక్రియ

భూ యజమానుల హక్కులు, హద్దులకే పెద్దపీట..

చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు

రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే చేపట్టాలి..

అనంతరం నోటీసులిచ్చి అభ్యంతరాలు స్వీకరించాలి

రైతులకు అవగాహన కల్పించాలి..

భూదార్ కేటాయింపులు వేగవంతం చేయాలి

అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు

2



రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే కీలక మైలురాయిని అధిగమించింది. ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో సర్వే ప్రక్రియ ప్రారంభం కాగా.. 416 గ్రామాల్లో పూర్తయింది. తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వేలో భూ యజమానుల ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యతగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించేలా పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించాలని సూచించారు.

125 ఏళ్ల తర్వాత సమగ్ర సర్వే

సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,720 గ్రామాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

హైదరాబాద్, నవంబర్ 10 (సింగిడి)



పవన్ కల్యాణ్ – అన్నా లెజినోవా
విడాకులు!

పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయం.. సంయుక్త ప్రకటన విడుదల

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవా తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. ఈ మేరకు ఇరువురు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

హైదరాబాద్, నవంబర్ 10 (సింగిడి)

ఉస్మానియాలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా

సిబ్బంది ఆందోళనకు మద్దతు తెలిపిన కవిత

వర్సిటీకి ఇస్తానన్న రూ.1,000 కోట్ల నిధులు ఎక్కడంటూ ప్రభుత్వాన్ని నిలదీసిన వైనం





అండాల సేకరణ అక్రమాలపై ఉక్కుపాదం
7 ఐవీఎఫ్ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు

రాష్ట్రంలో అండాల సేకరణ ముసుగులో సాగుతున్న అక్రమ దందాలపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు తూట్లు పొడుస్తున్న సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్, నవంబర్ 10 (సింగిడి)

విశాఖలో నవంబర్ 12, 13 తేదీల్లో
సీఐఐ సమ్మిట్
సదస్సును ప్రారంభించనున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హాజరుకానున్న విదేశీ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు

కేంద్ర మంత్రులు, సీఈవోలతో సీఎం చంద్రబాబు భేటీలు

ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న స్పేస్ స్టార్టప్‌లు

2

ఏపీలో గ్రూప్-2
ఉద్యోగాల భర్తీ

పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల

గతంలో ప్రకటించిన 686 పోస్టులను 720కి పైగా పెంచిన ఏపీపీఎస్సీ

డిసెంబర్ 11 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

2027 ఫిబ్రవరి 21న గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ





సమగ్ర భూ రీసర్వే
కీలక మైలురాయి

ఇందులో నక్షాలు అందుబాటులో లేని గ్రామాలనూ చేర్చారు. ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో రీసర్వే మైలురాయిని దాటగా.. 416 గ్రామాల్లో ప్రక్రియ పూర్తయిందని వివరించారు. సర్వే ప్రారంభించే ముందు సంబంధిత గ్రామాల రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. భూముల విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, సరిహద్దులకు సంబంధించిన వివరాలను నిర్ధారించుకున్న తర్వాతే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలన్నారు. సర్వే పూర్తయ్యాక భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. అభ్యంతరాలు ఉంటే స్వీకరించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు.

చిన్న చిన్న తప్పులతోనే భూ వివాదాలు..

సర్వేలో జరిగే చిన్న తప్పిదం కూడా భవిష్యత్తులో పెద్ద భూ వివాదానికి కారణమయ్యే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దాలని, కచ్చితత్వం విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. సర్వే విధానం, నోటీసుల జారీ, అభ్యంతరాల సమోదు, పరిష్కార ప్రక్రియపై గ్రామస్థాయిలో రైతులు, భూ యజమానులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వారి అభిప్రాయాలు, సూచనలకు ప్రాధాన్యతనిస్తూ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపునిచ్చే భూదార్ నంబర్ల కేటాయింపును వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. భూముల హక్కులు, విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన కచ్చితమైన రికార్డులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో కొత్తగా భూ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కలెక్టర్లతో సమీక్ష

భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. జిల్లా వారీగా పురోగతిని సమీక్షించి తదుపరి కార్యాచరణపై ఆదేశాలు ఇవ్వనున్నారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి క్షేత్రస్థాయి సిబ్బందితోనూ ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

శ్రీశైలం, సాగర్ అసలు అనుమతులపై
కేఆర్ఎంబీ ఆరా!

ప్రాజెక్టుల తొలి రూపకల్పన వివరాలు ఇవ్వాలని ఏపీ, తెలంగాణకు లేఖలు

నీటి వినియోగం, కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలపై ఆరా

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సింగిడి)

శ్రీశైలం ప్రాజెక్టులో 11, నాగార్జునసాగర్‌లో రెండు అనుమతి లేని భాగాలు ఉన్నట్లు 2021 నాటి నోటిఫికేషన్‌లో కేంద్రం ప్రస్తావించిందని గుర్తు చేసింది. ఈ మార్పులకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, కేంద్ర సంస్థల క్లియరెన్స్ వివరాలను కూడా సమర్పించాలని నవంబర్ 6న జారీ చేసిన లేఖలో రెండు రాష్ట్రాలను కోరింది. గతంలో సెప్టెంబర్ 21, అక్టోబర్ 1, అక్టోబర్ 16, అక్టోబర్ 30 తేదీల్లో రాసిన లేఖలకు సంబంధించిన వివరాలు కూడా ఇంకా అందలేదని లేఖలో కేఆర్ఎంబీ పేర్కొంది. 2016 కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ కేటాయింపులు, మొదట ఆమోదించిన ప్రాజెక్టు రూపకల్పనలే ప్రాథమిక ప్రాతిపదికగా కొనసాగుతాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అక్టోబర్ 15న స్పష్టం చేసినట్లు బోర్డు తెలిపింది. ప్రాజెక్టుల పరిధిలో ఆ తర్వాత చేసిన మార్పులు, అదనంగా చేర్చిన పథకాలు, నీటి అవసరాల పెంపు వంటి అంశాలను పరిశీలించేందుకు అసలు అనుమతుల వివరాలు అవసరమని తెలిపింది. అందుకోసం రెండు ప్రాజెక్టులకు సంబంధించి మొదట అనుమతి పొందిన పరిధి, భాగాలు... ఎడమ, కుడి కాల్వల ద్వారా నీటి మళ్లింపు వివరాలు... నీటి వినియోగం, డిజైన్ అవసరాలు... ఆయకట్టు పరిధి, సాంకేతిక అనుమతుల పత్రాలు ఇవ్వాలని సూచించింది. రాష్ట్రాల హక్కులు, వాదనలకు భంగం కలగకుండా ఈ వివరాలు సేకరిస్తున్నట్లు కృష్ణా బోర్డు స్పష్టం చేసింది.

రాహుల్ వ్యాఖ్యలకు
బీజేపీ కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 10 (సింగిడి)

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పర్యటనలో ప్రధానమంత్రి మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, సైన్యాన్ని గౌరవించడంలో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ వరుసగా విఫలమవుతూనే ఉన్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బస్తర్ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి వేడుకలు జరుపుకుని వారిలో నైతిక స్థైర్యాన్ని నింపారని రాంచందర్ రావు పేర్కొన్నారు. అయితే గతంలో బస్తర్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులైనప్పుడు ఆ ఘటనలను కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ఖండించలేదని దుయ్యబట్టారు. బస్తర్‌లో నక్సలైట్ల హింసను గానీ, పుల్వామాలో జవాన్ల వీరమరణాన్ని గానీ, ఉగ్రవాద దాడులను గానీ ఖండించే ధైర్యం రాహుల్ గాంధీకి ఎన్నడూ లేదని, కనీసం బాధితులకు సానుభూతి కూడా తెలపలేదని ఆరోపించారు. ఇటీవల బస్తర్ పర్యటనలో మోదీ మాట్లాడుతూ... ఆయుధాలు పట్టిన నక్సలిజం అంతమవుతున్నప్పటికీ, వివిధ సంస్థల్లో చొరబడిన "మేధో నక్సల్స్" రూపంలో ఇంకా ముప్పు పొంచి ఉందని వ్యాఖ్యానించారు. దీనిపై రాహుల్ గాంధీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ... విపక్షాలను ప్రధాని నక్సల్స్‌గా ముద్రవేస్తున్నారని ఆరోపిస్తూ, దేశద్రోహి ఎవరో చర్చించేందుకు రావాలని బహిరంగ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై రామచందర్ రావు స్పందిస్తూ... రాహుల్ గాంధీ వియత్నాం, రష్యా, అమెరికా వంటి దేశాలకు పారిపోకుండా, నేరుగా పార్లమెంట్‌కు వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలో పాల్గొనాలని హితవు పలికారు.

చైనా వ్లాగర్ల తీరుపై కేంద్రం సీరియస్

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సింగిడి)

భారత్‌కు వ్యతిరేకంగా కొంతమంది చైనీస్ వ్లాగర్లు సామాజిక మాధ్యమాల వేదికగా విష ప్రచారం చేయడం ఇటీవల తీవ్ర వివాదాస్పదమైంది. బంగ్లాదేశ్‌లోని మురికివాడలను దిల్లీకి చెందినవి అని పేర్కొంటూ వారు చేసిన లైవ్‌స్ట్రీమింగ్‌పై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. అది దురదృష్టకర ఘటన అని పేర్కొంది. అసలేం జరిగిందంటే.. ఇటీవల కొంతమంది చైనీస్ వ్లాగర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో భారత్‌లోని జీవన స్థితిగతులపై వీడియోలు పోస్ట్ చేశారు. ఢాకాలోని మురికివాడల దృశ్యాలను చూపిస్తూ.. అవన్నీ దిల్లీ ప్రాంతాలని అసత్య ప్రచారం చేశారు. దాదాపు 150 మంది చైనీస్ జాతీయులు ఈ వీడియోలను రికార్డు చేసినట్లు సమాచారం. వీటిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో స్పందించారు. <

ప్రజల విశ్వాసమే పోలీసుల అసలైన బలం!



వెంకటేశంను టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించాం. ఈ ప్రాంతం, విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉన్న అధికారి ఛైర్మన్‌గా ఉంటే భవిష్యత్తు బాగుంటుంది. 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది జాయిన్ అయ్యారు. 112 మంది డీఎస్పీల నియామకం చాలా పెద్ద విషయం. నియామకాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో పారదర్శకతను పాటించింది.

మీ అంకితభావమే ఇక్కడ కూర్చోబెట్టింది

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారి పిల్లలు కూడా ఈ నియామకాల్లో ఉన్నారంటే మా పారదర్శకత అర్థమవుతుంది. ఈ నియామకాల పట్ల కొందరు పని గట్టుకుని ఎన్నో ఆరోపణలు చేశారు. అవినీతి జరిగిందని, కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. రాజకీయ ఆరోపణలు మాకు కొత్త కాదు.. కానీ మీకు చాలా ఆందోళన కలిగించాయి. ఈ అవకాశం కూడా జారిపోతుందేమోనని ఆందోళన చెందారు. డీఎస్పీల తరపున సుప్రీంకోర్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లింది. నిష్ణాతులైన న్యాయవాదులతో వాదించి డీఎస్పీల నియామకాన్ని సాధించాం. నాలెడ్జ్, చిత్తశుద్ధి, అంకితభావం మీ అందరినీ ఇక్కడ కూర్చోబెట్టింది. మీ నేపథ్యాన్ని మరిచిపోవద్దు.

నిజాయితీగా డ్యూటీ చేయాలి

మన నేపథ్యాన్ని మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేం. మీరు ఏ ఉద్దేశంతో పోలీస్ శాఖలో చేరారో దాన్ని మరిచిపోవద్దు. లక్ష్యం పెట్టుకుని ప్రయత్నం చేస్తే అసాధ్యం ఏదీ ఉండదు. చరిత్రలో చాలా మంది ఉన్నారు. లక్ష్యం పెట్టుకుని కష్టపడ్డారు కాబట్టే ఈ హోదాకు చేరుకున్నారు. ఇక ముందు రెండో అధ్యాయం ప్రారంభం కాబోతుంది. ఇది మీ జీవితాల్లో చాలా ముఖ్యం. వచ్చే ముప్పై ఏళ్లు తెలంగాణ భవిష్యత్తును ఏ దిశగా నడిపించాలో అది మీ చేతుల్లోనే ఉంది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే పెద్ద హోదా మీది. మీ ఫీడ్‌బ్యాక్, నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతుంది. మీరు నిటారుగా నిలబడి డ్యూటీ చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. నిజాయితీగా డ్యూటీ చేయాలి, బాధ్యతను గుర్తించి పనిచేయాలని ప్రభుత్వం కోరుకుంటోంది.

ప్రజల కోసం హోదాను వాడండి

ప్రజలకు ఏ సమస్య వచ్చినా మొదట గుర్తుకు వచ్చేది పోలీసు వ్యవస్థ. తల్లిదండ్రుల కంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసు వ్యవస్థ. సర్వం ఒడ్డి శాంతిభద్రతలను కాపాడారు కాబట్టే ప్రజలు పోలీసు వ్యవస్థను విశ్వసిస్తున్నారు. అనేక మంది సీనియర్ పోలీసు అధికారులు నిక్కచ్చిగా పని చేయడం వల్లనే సమాజంలో పోలీసు వ్యవస్థకు గుర్తింపు వచ్చింది. దాన్ని మీరు కాపాడాలి. మీ హోదాను ఎంత జాగ్రత్తగా ప్రజల కోసం వాడితే అంత బాగుంటుంది. అతిగా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడితే దీర్ఘకాలికంగా ఉండదు. సమస్యను పరిష్కరించాలంటే ఆ సమస్యను ముందుగా అర్థం చేసుకోవాలి. సమస్యను వినాలి, అర్థం చేసుకోవాలి. అప్పుడే పరిష్కారం పెద్ద విషయం కాదు. సమస్య పరిష్కారంలో సమయం, రిసోర్సెస్, టెక్నికల్ సపోర్ట్ అత్యంత ముఖ్యం. బాధితులు వచ్చినప్పుడు కూర్చోబెట్టి వాళ్లతో ప్రేమపూర్వకంగా మాట్లాడాలి. అప్పుడే సమస్య అర్థం చేసుకోగలుగుతారు. రాజ్యాంగం రాసే సమయంలో దేశంలో అత్యాచారాలు, హత్యలు, ఆహార కొరత అనే మూడు సమస్యలు అధికంగా ఉన్నాయి.

పీవీ నరసింహారావు ఓపెన్ ఎకానమీ తీసుకువచ్చిన తర్వాత ప్రపంచంలోని అన్ని సమస్యలు మన దగ్గరకు వచ్చాయి. అందులో ముఖ్యమైనవి సైబర్ క్రైమ్. వ్యక్తుల మధ్య పరిచయం లేకుండా, కనీసం చూడకుండా సర్వం దోచుకునే పరిస్థితి సైబర్ క్రైమ్‌లో ఉంది. ఇప్పుడు నేరాలు, వాటి ప్రవృత్తి మారిపోయింది. డ్రగ్స్ సరఫరాను నియంత్రించడంలో యుద్ధవీరులను ఇచ్చిన పంజాబ్ కూడా విఫలమైంది. సిక్కిం రెజిమెంట్‌లో ఇప్పుడు సిక్కులు లేరు. బ్రిటీషర్లు కూడా భయపడిన సిక్కు జాతి డ్రగ్స్ విషయంలో నిర్వీర్యమైంది.

డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్‌ను తీసుకువచ్చి అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్, డ్రగ్స్ కంట్రోల్, సైబర్ క్రైమ్‌ల కోసం సరికొత్త వ్యవస్థలను తీసుకువచ్చాం. అవసరమైతే నూతన డీఎస్పీలను అధ్యయనం కోసం విదేశాలకు పంపిస్తాం. విద్యా ప్రమాణాల అధ్యయనం కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తున్నాం. గరం, నరం, బేషరమ్ పరిస్థితి మీకు ఎదురుకావొద్దని నేను కోరుకుంటున్నా అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రొబేషనరీ డీఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా క్రైమ్ సీన్స్ ఫోరెన్సిక్ హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు.

విశాఖలో నవంబర్ 12, 13 తేదీల్లో సీఐఐ సమ్మిట్

అమరావతి, నవంబర్ 10 (సింగిడి)

ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్–2026 కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకరోజు ముందుగానే విశాఖకు చేరుకుంటున్నారు. నవంబర్ 12, 13వ తేదీల్లో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక సదస్సు ప్రారంభానికి ముందే అంతర్జాతీయ ప్రతినిధులు, వివిధ దేశాల మంత్రులు, పారిశ్రామిక దిగ్గజాలతో సీఎం వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. పెట్టుబడుల సమీకరణలో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, రాష్ట్రంలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామిక విధానాలను అంతర్జాతీయ వేదికపై బలంగా వినిపించేందుకు ముఖ్యమంత్రి ముందస్తుగానే రంగంలోకి దిగుతున్నారు.

ముఖ్యమంత్రి తన షెడ్యూల్‌లో భాగంగా బుధవారం ఉదయం అమరావతిలో సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్‌తో సమావేశమవుతారు. అనంతరం నేరుగా విశాఖపట్నం చేరుకుని వరుస భేటీల్లో పాల్గొంటారు. ప్రపంచ మేధోసంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీవో) డైరెక్టర్ జనరల్ డాక్టర్ డారెన్ టాంగ్, జపాన్ రాయబారి కీచి ఒనో, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీలతో పాటు రెన్యూ పవర్ సంస్థ సీఈవో సుమంత్ సిన్హాతో సీఎం ప్రత్యేకంగా చర్చలు జరుపుతారు. బుధవారం సాయంత్రం పలు బహుళజాతి సంస్థల సీఈవోలతో భేటీ అయ్యాక, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్వాగత విందులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో నవంబర్ 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ 31వ భాగస్వామ్య సదస్సును అధికారికంగా ప్రారంభించనున్నారు. గతంలో నిర్వహించిన సదస్సులకు భిన్నంగా ఈసారి సదస్సు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఐదు ప్రాంతీయ సదస్సుల ద్వారా సుమారు రూ.86 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగా, ఈ ప్రధాన సమ్మిట్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఐఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు సింగపూర్, యూఏఈ, జపాన్, రష్యా, స్లోవేకియా, గ్వాటెమాల తదితర దేశాల మంత్రులు, రాయబారులు, దౌత్యవేత్తలు తరలివస్తున్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ సదస్సులో కియా మోటార్స్, రెన్యూ, మాండెలెజ్ ఇండియా, సెయింట్ గోబెయిన్, నాల్కో, లెవిస్టా వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆటోమొబైల్, పునరుత్పాదక ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, నిర్మాణ రంగం, తయారీ, సాంకేతిక రంగాలలో పెట్టుబడులపై విస్తృత చర్చలు జరగనున్నాయి. ముఖ్యంగా అంతరిక్ష సాంకేతికత, తయారీ రంగాల్లో రాష్ట్రాన్ని ముందంజలో ఉంచేందుకు హాథోర్ రాకెట్స్, అగ్నికుల్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, స్కైరూట్ వంటి ప్రముఖ భారతీయ స్పేస్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. జపాన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన అంతర్జాతీయ వ్యూహాత్మక విభాగం చైర్మన్‌తోనూ సీఎం చర్చలు జరపనున్నారు. సదస్సులో భాగంగా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు విశాఖ నోవోటెల్ వేదికగా 'ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్–2026' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సీఎం హాజరై మహిళల ఆర్థిక సాధికారత, వ్యాపార రంగంలో మహిళలకు అందించే తోడ్పాటుపై మాట్లాడనున్నారు. మరోవైపు, సదస్సుకు విచ్చేస్తున్న కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, సర్బానంద సోనోవాల్‌లతో ముఖ్యమంత్రి వేర్వేరుగా సమావేశమవుతారు. రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక వసతుల విస్తరణకు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ఉత్పత్తులకు కల్పించాల్సిన వెసులుబాట్లపై కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు.

ఏపీలో గ్రూప్-2 ఉద్యోగాల భర్తీ

అమరావతి, నవంబర్ 10 (సింగిడి)

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్రంలో ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య పెరగడం విశేషం. గతంలో వెలువడిన సంక్షిప్త ప్రకటనలో 686 పోస్టులను పేర్కొనగా, తాజా నివేదికల ప్రకారం ఈ ఖాళీల సంఖ్య 720కి చేరింది. వీటిలో 471 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 249 నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి. ఈ నోటిఫికేషన్‌లో కీలకమైన పలు కీలక శాఖల్లోని ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వీటిలో ప్రధానంగా 203 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు, 176 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. అలాగే 91 సీనియర్ అకౌంటెంట్, 80 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులతో పాటు జూనియర్ అకౌంటెంట్, జీఎస్టీ ఆఫీసర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి ఇతర ముఖ్యమైన పోస్టులు కూడా ఉన్నాయి.

విద్యార్హతలు మరియు ఎంపిక విధానం:

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ (గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే కొన్ని నిర్దిష్ట పోస్టులకు ప్రత్యేక విద్యార్హతలు లేదా నిబంధనలు వర్తిస్తాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమ్స్) నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించిన వారికి మెయిన్స్ పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత పోస్టుల స్వభావాన్ని బట్టి కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ చివరగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా తుది ఎంపిక పూర్తి చేస్తారు.

ముఖ్యమైన తేదీలు:

ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీగా 2026 డిసెంబర్ 11 రాత్రి 11:59 గంటల వరకు గడువు నిర్ణయించారు. అనంతరం అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను 2027 ఫిబ్రవరి 21న ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు సమాచారం. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. పోస్టుల వారీగా ఖాళీల వివరాలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, పే–స్కేల్స్, పరీక్షా సిలబస్ మరియు ఇతర పూర్తి మార్గదర్శకాల కోసం ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ (psc.ap.gov.in) లోని సమగ్ర నోటిఫికేషన్‌ను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉస్మానియాలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా

హైదరాబాద్, నవంబర్ 10 (సింగిడి)

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మిని స్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

డిజిటల్ అరెస్ట్ మోసాలపై కఠిన చర్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సింగిడి)

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న 'డిజిటల్ అరెస్ట్' సైబర్ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రోజురోజుకూ పెరిగిపోతున్న ఈ తరహా అత్యాధునిక సైబర్ నేరాలను అరికట్టేందుకు తక్షణమే పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని ప్రముఖ మెసేజింగ్ వేదిక వాట్సాప్‌తో పాటు ఇతర టెక్ మీడియేషన్ సంస్థలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మోసాల నివారణకు తాము తీసుకుంటున్న, భవిష్యత్తులో తీసుకోబోయే ముందస్తు రక్షణ చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. నకిలీ పత్రాలు, నకిలీ నోటీసుల ఆధారంగా జరుగుతున్న డిజిటల్ అరెస్టుల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జస్టిస్‌ల ధర్మాసనం స్పందిస్తూ.. వినియోగదారులను మోసాల బారిన పడకుండా కాపాడేందుకు రూపొందించే ప్రణాళికలను ఒకవైపు కోర్టుకు, మరోవైపు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C)కు ఏకకాలంలో సమర్పించాలని టెక్



సంస్థలను ఆదేశించింది. ఈ విచారణ సందర్భంగా వాట్సాప్ తరఫు న్యాయవాది తమ వాదనలను వినిపించారు. మోసపూరిత వ్యవహారాలను అడ్డుకునేందుకు ఇప్పటికే వేలాది అనుమానాస్పద ఖాతాలపై వేటు వేశామని కోర్టుకు తెలిపారు. నేరగాళ్ల ఖాతాలను గుర్తించడంతో పాటు, వినియోగదారులను ముందస్తుగా హెచ్చరించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఫీచర్లను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. మరోవైపు, టెక్ సంస్థలతో పాటు ఆర్థిక లావాదేవీలు నిర్వహించే బ్యాంకుల జవాబుదారీతనంపైనా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిబంధనల ప్రకారం ఖాతాదారుల వివరాలు, లావాదేవీల విషయంలో తగిన ముందస్తు జాగ్రత్తలు (డ్యూ డిలిజెన్స్) పాటించడంలో బ్యాంకులు విఫలమైతే, వాటిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. బ్యాంకుల నిర్లక్ష్యం కారణంగా ఖాతాదారులు డిజిటల్ మోసాల బారిన పడి సొమ్ము కోల్పోతే, ఆ మొత్తాన్ని బ్యాంకులే పరిహారంగా చెల్లించాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ తరహా నేరాలను సమర్థవంతంగా అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న దర్యాప్తు సంస్థల సమన్వయం అవసరమని కోర్టు పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్ల



బోయినపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)

జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు,నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను నిరంతరం పర్యవేక్షించే క్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే బోయినపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. ప్రతి కేసులో నిబంధనల ప్రకారం సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, వివిధ రిజిస్టర్లను తనిఖీ చేశారు.ఈసందర్భంగా. ఎస్పీ మాట్లాడుతూ.వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సమస్యలపై తక్షణమే స్పందించి చట్టపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో నేర నియంత్రణే లక్ష్యంగా పెట్రోలింగ్, రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని, రౌడీషీటర్లు, పాత నేరస్తులు, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా గ్రామాల్లో, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ మోసాలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహన వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఎస్పీ సిఐ శ్రీనివాస్, ఎస్.ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

వరి సాగు చేయవద్దు
ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పు ధాన్యాలు వేయాలి
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
పలువురు ఉత్తమ రైతులకు సన్మానం

ప్రత్యామ్నాయ పంటల వైపు ముందుకు వెళ్లాలి





రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)

జిల్లాలో గంభీరావుపేటలో ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు వైపు ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.గంభీరావుపేట మండలం రాజేశ్వర్ రావు నగర్ లో కేతు బచావో అభియాన్ ఎల్ నినో ప్రభావం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఇటీవల ఆయిల్ పామ్ మొక్కలు నాటిన పలువురు రైతులను సన్మానించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సూపర్ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు. వరి సాగు చేస్తే నీరు భారీగా అవసరమని వెల్లడించారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పొడి ఎండ వాతావరణంతో రాను రాను భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని వివరించారు. గంభీరావుపేట మండలంలో గత ఏడాది భూగర్భ జలాలు 5.96 మీటర్ల లోతులో ఉండేవని, ఈ ఏడాది 8.39 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయని తెలిపారు. దీంతో గత నెలలో విద్యుత్ వినియోగం 25 శాతం పెరిగిందని వెల్లడించారు. రైతులు మంచి ఆదాయం వచ్చే.. నీటిని తక్కువగా వినియోగించే పంటలు సాగు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ లో మొదటి మూడు ఏండ్లు అంతర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్, మొక్కలు ఇస్తామని తెలిపారు. వీటి సాగు కోసం డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు వాడి నీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ కు టన్ను ధర ప్రస్తుతం 22 వేల 658 ఉందని వెల్లడించారు. అలాగే జిల్లాకు దగ్గర్లోనే సిద్దిపేటలో జిల్లాలో ఆయిల్ ప్లాన్ ఫ్యాక్టరీ ఉందని వివరించారు. ఆయిల్ ఫామ్ ఉత్పత్తులు సేకరించే కేంద్రం మండలంలోనే ఉందని గుర్తు చేశారు.జిల్లాలో గత సీజన్లో అవగాహన సదస్సులు, కార్యక్రమాలతో 40 వేల ఎకరాల వరకు వరి సాగు తగ్గిందని, 700కు పైగా ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులోకి వచ్చిందని తెలిపారు. పంటల మార్పిడితో నేలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇల్లు, వ్యవసాయ క్షేత్రాల వద్ద నీటి, విద్యుత్ వృథాను అరికట్టాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ జలసిరి పనులువీబీజీరామ్ జీ కింద జిల్లాలో తెలంగాణ జలసిరి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పామ్ పాండ్ లు నిర్మించుకోవాలని పేర్కొన్నారు.దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, పంటల సాగుకు ఉపయోగపడతాయని తెలిపారు. కొందరు రైతులు వాటిలో చేపలు పెంచుతూ ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత సూపర్ ఎల్ నినో ప్రభావంతో రైతులు నువ్వులు, వేరుశనగ, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ ఫామ్ చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ

విభిన్నంగా సాగు చేస్తూ..
ఆదాయం పొందుతూ..

ఎల్లారెడ్డిపేట తీరొక్క ఆకుకూరలు.. కూరగాయలు సాగు చేస్తూ ముందుకు సాగుతున్నారు రైతు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్యారెడ్డి. ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో దాదాపు పది రకాలు పండిస్తూ.. వార వారం ఆదాయం పొందుతున్నారు. ఆ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించి.. రైతును అభినందించారు.ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్యారెడ్డి ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో తోట కూర, పాలకూర, చుక్క కూర, కొత్తిమీర, పూదీన, ఉలిగడ్డలు, వంకాయలు, సొరకాయ, పచ్చిమిర్చి, బీట్ రూట్, కంది సాగు చేస్తున్నారు. కోతులు, ఇతర జంతువుల నుంచి రక్షణ కోసం సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆకు కూరలు, కూరగాయల ఉత్పత్తులు వారవారం చేతికి వస్తున్నాయి. ప్రతి నెల రూ. 50 వేల వరకు ఆదాయం వస్తుందని రైతు సత్యారెడ్డి చెప్పారు.

పరిశీలించి..అభినందించి..

ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్యారెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. అన్ని రకాల ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించి.. యాజమాన్య పద్ధతులు.. ఉత్పత్తి.. విక్రయం.. ఆదాయం పై ఆరా తీశారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్న రైతును అభినందించారు. మిగతా రైతులు ఆయనను ఆదర్శంగా తీసుకొని సాగు చేయాలని పిలుపు నిచ్చారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి):

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్ట చర్యలు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీతో కలిసి రోడ్డు భద్రతా ప్రమాణాల అమలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెద్దపల్లి పట్టణంలోని జంక్షన్ల వద్ద ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రహదారులపై పశువులను వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, నిబంధనల ప్రకారం రూ.10 వేల జరిమానా విధించి పశువులను గోశాలకు తరలించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు మరియు హెచ్‌కేఆర్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన రోడ్డు విస్తరణ, యూ-టర్న్‌ల సమీక్ష చేపట్టాలని సూచించారు. అలాగే రామగుండం నగరంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.జిల్లాలోని ప్రతి పాఠశాల వద్ద తప్పనిసరిగా స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. భారీ వాహనాలు, కార్లకు ముందు, వెనుక భాగాల్లో రేడియం స్టిక్కరింగ్ ఉండేలా చూడాలని, పట్టణ ప్రాంతాల్లో రోడ్డు స్టిప్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్లో ఫోన్ మాట్లాడటం మరియు త్రిబుల్ రైడింగ్ వంటి డేంజర్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. హిట్ అండ్ రన్ బాధితులకు త్వరగా పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు పంపాలని పోలీస్ అధికారులను కోరారు. ఈ సమీక్షా సమావేశంలో పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి, ఆర్అండ్బి ఈఈ భావ్ సింగ్ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రైతులు ఆందోళన చెందొద్దు..
కొనుగోళ్లకు సిద్ధం
అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

సిద్ధిపేట ప్రతినిధి, నవంబరు 10, (సింగిడి):

జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2026–27కు సంబంధించి ఏర్పాటు చేసిన 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభమయ్యాయి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. లక్ష్మీకిరణ్ తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించినట్లు వెల్లడించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంచుల్లో నింపి, కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.రైతులు అధైర్యపడకుండా తమ ధాన్యాన్ని సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ కోరారు...



పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డులో కేటీఆర్‌కు స్వాగతం పలకనున్న మాజీ ఎమ్మెల్యే

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 10 సింగిడి



నిర్మల్‌లో నవంబర్ 11న బుధవారం నిర్వహించనున్న రైతు గర్జన సభకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కేటీఆర్‌కు స్వాగతం పలకాలని ఆయన పిలుపునిచ్చారు.నవంబర్ 11వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2:30 గంటలకు పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు వద్ద పార్టీ శ్రేణులు సమకూడాలని సూచించారు. అక్కడ కేటీఆర్‌కు స్వాగతం పలికిన అనంతరం ఆయన వెంట నిర్మల్‌లో జరిగే రైతు గర్జన సభకు తరలివెళ్లాలని పార్టీ వర్గాలు కోరాయి.స్థలం: పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డున మయం: మధ్యాహ్నం 2:30 గంటలకుతేదీ: 11-11-2026, బుధవారం

జనాభాలో మేమెంతో రాజకీయాల్లో మా వాటంత

భువనగిరి సభలో ముదిరాజుల డిమాండ్
భువనగిరి ముదిరాజుల జెండా ఎగరవేద్దాం

ఉమ్మడి నల్గొండ బ్యూరో
నవంబర్ 10 (సింగిడి)

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మా ముదిరాజుల వాటా చట్టసభల్లో ఏ పార్టీలు కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, భువనగిరి పట్టణ ముదిరాజు సమన్వయ కమిటీ చైర్మన్ దిడికాడి నర్సింగరావు తన ఆవేదనని వ్యక్తం చేశారు. ఈరోజు బోనగిరి పట్టణంలో వందలాది ముదిరాజులతో బైక్ ర్యాలీ నిర్వహించి తదనంతరం.. జ్యోతిరావు పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, అమరవీరుల, స్థూపాలకు .నివాళులర్పించి. ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించి. వైఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో భారీ బహిరంగ సభను నిర్వహించారు ఈ కార్యక్రమంలో భువనగిరి పట్టణ ముదిరాజుల సమన్వయ కమిటీ చైర్మన్ ముఖ్యఅతిథిగా దిడికాడి నర్సింగరావు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు మా ముదిరాజులను ఓటు బ్యాంకు గాని చూస్తున్నాయి తప్ప అధికారం వరకు చట్టసభల వరకు వెళ్ళనివ్వడం లేదని ఇక భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీని కూడా మేము క్షమించబోమని, రాబోయే రోజుల్లో బోనగిరి నియోజకవర్గంలో ముదిరాజ్ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించి తీరుతామని రాష్ట్రంలో మా వాటా మాకు ఇచ్చేంతవరకు ఏ రాజకీయ పార్టీల జోలికి మా ముదిరాజ్ బిడ్డలు పనిచేయరని ముందు మా వాటను ప్రకటిస్తేనే తప్ప మేము రాజకీయ పార్టీల జెండాలు మోయమని ఆయన ఘాటుగా స్పందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొలుపుల కమలాకర్ రాజ్, మంద యాదగిరి ముదిరాజ్, నాయన పూర్ణచందర్ ముదిరాజ్, సుదర్శన్ ముదిరాజ్, కూర వెంకటేష్ ముదిరాజ్ గీసా ఆనంద్ ముదిరాజ్, గుర్రాల శ్రీనివాస ముదిరాజ్ తదితర ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు





నేటి నుంచి ఇస్కాన్ మందిరంలో భాగవత ప్రవచనాలు

కరీంనగర్, నవంబర్10(సింగిడి)

నగరంలోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధాగోవింద మందిరంలో నవంబర్ 11 నుంచి 17 వరకు ఏడు రోజుల పాటు 'శ్రీమద్ భాగవత కథామృతం' పేరుతో ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మందిర నిర్వాహకులు నరహరి ప్రభుజీ మంగళవారం వెల్లడించారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి భాగవత ప్రవచనాలు, దీపారాధనలు ఉంటాయని తెలిపారు.వారోత్సవాల్లో భాగంగా గోవర్ధన పూజ, గోపాష్టమి, గోమాత పూజ, భజనలు, సంకీర్తనలు, మహాప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.మంగళవారం నిర్వహించిన సమావేశంలో మందిర నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కన్న కృష్ణ, ముఖ్య సలహాదారు డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి, కో-చైర్మన్లు తుమ్మల రమేష్ రెడ్డి, డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, రాళ్లబండి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరవధిక సమ్మెకు ఏఐఎస్టీయున్యూ మద్దతు



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్నటువంటి నిరసన దీక్షకు ఏఐఎఫ్టియున్యూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ వారి యొక్క 29వ రోజు నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించినటువంటి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ భారతదేశంలో మరియు కొట్లాడి తెగించి తెచ్చుకున్న స్వరాష్ట్రం తెలంగాణలో అవుట్సోర్సింగ్ కాంట్రాక్టు విధానం ఉండకూడదని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని దేశంలో రాష్ట్రంలో సమాన పనికి సమాన వేతనం ఉండాలని రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే స్కీం లన్ని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగులకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య మధ్య దళారీ వ్యవస్థ అయిన ఏజెన్సీలను రద్దు చేయాలని వెంటనే సమ్మె చేస్తున్న వారితో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసినారు లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వారితో కలిసి వారితో పాటు ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ప్రభుత్వంతో పోరాటం చేస్తామని హెచ్చరించారు ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ టి యు యూనియన్ నాయకులు కామ్రేడ్ కొండ శ్యామ్ మరియు ఇతరులు పాల్గొని ఉన్నారు

సన్న బియ్యం విక్రయాలపై అధికారుల కొరడా

రాజ మల్లికార్జున రైస్ డిపోలో తూకంలో తేడాలు.. కేసు నమోదు

సిద్ధిపేట ప్రతినిధి, నవంబరు 10, (సింగిడి):

సన్న బియ్యం విక్రయాల్లో అక్రమాలకు తావులేకుండా అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అనుగుణంగా విక్రయాలు జరగుతున్నాయా? తూకాల్లో తేడాలు ఉన్నాయా? అనే అంశాలపై మంగళవారం సిద్ధిపేట పట్టణంలోని పలు సూపర్ మార్కెట్లు, బియ్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వ హించారు. రత్నదీప్, మోర్, నేషనల్ సూపర్ మార్కెట్లతో పాటు శ్రీ రాజ మల్లికార్జున, శేషాద్రి రైస్ డిపోలను అధికారులు తనిఖీ చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శివరంజని, సహాయ పౌరసరఫరాల అధికారి సాయి రవి ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ రాజ మల్లికార్జున రైస్ డిపోలో తూకంలో వ్యత్యాసాలు గుర్తించారు. దీంతో సంబంధిత దుకాణంపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వినియోగదారులకు నష్టం కలగకుండా వ్యాపారులు నిర్ణీత ధరలకు సరుకులు విక్రయించాలని, తూనికలు, కొలతల్లో నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రైతులు దళారులను నమ్మొద్దు

ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ..
ప్రభుత్వ విప్ విజయరమణ రావు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి):

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండలం నరసయ్యపల్లి, బొంతకుంటపల్లి, గర్రెపల్లి, భూపతిపూర్, నారాయణపూర్ మరియు ఎలిగేడు మండలం బుర్హన్మియా పేట, సుల్తాన్ పూర్, నారాయణపల్లి, నర్సాపూర్, ర్యాకల్దేవుపల్లి, రాములపల్లి గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు.

24 గంటల్లోనే ఖాతాల్లోకి డబ్బులు

విజయరమణ రావు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన సొమ్మును 24 గంటల్లోనే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం. అంతేకాకుండా సన్న వడ్లకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ అందిస్తున్నాం" అని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు, కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.



ఆరుతడి పంటల సాగే శ్రేయస్కరం..

సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయని, కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వచ్చే యాసంగి సీజన్లలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే మొక్కజొన్న (మక్కలు), శెనగ వంటి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుగ్యాల సంతోష్ రావు, సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, పొట్యాల రమేష్, వైస్ చైర్మన్ వెంకట్రావు డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు సిద్ధి తిరుపతి, మద్దెల రమాదేవి సంపత్, కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సమితి (డెమొక్రటిక్)లో కీలక నియమకాలు

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)





తెలంగాణ రక్షణ సమితి(డెమొక్రటిక్) పార్టీలో సంస్థాగత బలోపేతంలో భాగంగా నూతన నియామకాలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడిగా ఎండీ అహ్మద్ పాషాను, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జిగా శంకర్ సాధును నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సరాల సత్యనారాయణ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నూతనంగా నియమితులైన నాయకులకు రాష్ట్ర అధ్యక్షుడు సరాల సత్యనారాయణ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ సాధు, ఎండీ అహ్మద్ పాషా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

ఎడిటోరియల్

Editorial

దేశ తలరాతను మార్చేది నైపుణ్య విద్య మాత్రమే!

(11 నవంబర్ "జాతీయ విద్యా దినోత్సవం" సందర్భంగా)

దేశ ఘన చరిత్రను మార్చి రాయగలిగేది విద్యావేత్తలు మాత్రమే. దేశ, ప్రపంచ దశ దిశలకు మార్చగలిగే సామర్థ్యం విద్యావేత్తలతో ఉంటుంది. రేపటి సమాజ స్థితిగతులను నిర్ణయించే శక్తియుక్తులు నేటి విద్యావేత్తలు, శాస్త్రజ్ఞులకు మాత్రమే ఉంటుందని గత చరిత్ర ఏకరువు పెడుతున్నది. ప్రతి విద్యావంతుడు ఓ మహత్తర శక్తి అవుతాడు. మేధావి ఒక వ్యాప్తి కాదు, మేధో వ్యవస్థ. సమాజ గతిని మార్చగలిగే ధీరుడు విద్యావేత్త. విద్య లేని వాడు వింత పశువు అన్నారు పెద్దలు. కత్తి కన్న కలం గొప్పది దిగని కూజా విన్నాం. దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యతో ప్రమాణీకరించడం పరిపాటి అయ్యింది. వ్యక్తి, కుటుంబ, దేశ ప్రగతికి బాటలు వేయగలిగేది విద్య మాత్రమే. విద్యతో వివేకం తోడైతే ప్రపంచం మనకు సలాం కొడుతుంది. బుద్ధిలేని నిరక్షరాస్యుడి కన్న అనైతిక విద్యావంతుడు అతి ప్రమాదకరం.

మౌలానా అబుల్ కలాం ఆజాద్? జన్మదినం – జాతీయ విద్యా దినోత్సవం :

స్వతంత్ర భారత తొలి విద్యాశాఖామంత్రి(1947–58), విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, జర్నలిస్టు, దార్శనికుడు, సమైక్యతావాధి మేధావి, రచయిత, పరిపాలనాదక్షుడు, భారత రత్న అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్? జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏట 11 నవంబర్‌న దేశవ్యాప్తంగా "జాతీయ విద్యా దినోత్సవ వేడుక"లను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ విద్యా దినోత్సవం ఇతివృత్తంగా "విద్యను సహ–సృష్టి చేయడంలో యువశక్తి" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. నేటి భారత విద్యా విధానానికి గట్టి బీజాలు వేసిన మహాయోధుడు అబుల్ కలాం. ఆయన నేతృత్వంలోనే భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఏఐసిటిఈ, ఐఐఎస్‌సి యూజిసి, వయోజన విద్య లాంటివి నెలకొల్పి దేశ యువతను అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి చక్కటి మార్గాన్ని వేశారు. ఒక బాలిక లేదా యువతి ఒక తరగతి ఎక్కువగా చదివితే ఆవిడ భవిష్యత్తు ఆదాయం 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొనబడింది. మహిళ/బాలికల నిర్భంధ ఉచిత విద్యకు పెద్ద పీట వేసిన కలాం దార్శనికత కొనియాడదగింది. చదువు, నైపుణ్యాల ద్వారానే దేశ సంస్కృతి వారసత్వాలు వెలుగొందుతాయి నమ్మిన మేధావి మన కలాం.

విద్య మహోన్నత ప్రయోజనాలు అనేకం:

విద్య ప్రయోజనాలలో వ్యక్తిత్వం వికాసం, ఆకర్షణీయ ఉద్యోగం, సమాజాన్ని జాగృత పరచడం, పేదరికాణి తరిమేయడం, అసమానతలను తొలగించడం, నాణ్యమైన జీవితాన్ని గడపడం, మానవీయ విలువలను జీర్ణించుకోవడం, సమాజంలో గౌరవాన్ని పొందడం, కుటుంబ అభివృద్ధికి దోహదపడడం, చక్కటి జీవనశైలిని పాటించడం, ఆలోచనల్లో విస్తృతి కలగడం, సంభాషనాచాతుర్యం, నాయకత్వ లక్షణాలు అలవడడం, శారీరక మానసిక సమతుల్యత సాధించడం, సన్మార్గంలో నడుస్తూ ప్రజలకు దిశ నిర్దేశనం చేయడం, సద్గుణాలను ఆకలింపు చేసుకోవడం, నైపుణ్యాలను వంటపట్టించుకోవడం, సరైన ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇవ్వగలగడం, తార్కిక విశ్లేషణలు చేయగలగడం, ఆర్థిక ప్రగతి, సామాజిక చైతన్యం, సాంకేతిక విప్లవం, దేశాభివృద్ధిని కాంక్షించడం లాంటివి అనేకం ఉన్నాయి.

విద్యార్థి కేంద్రిత విద్య (స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్):

విద్యార్థి కేంద్రిత విద్య లేదా స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యతను ప్రచారం చేయడం, సృజనశీలతను ఆహ్వానించడం, విలక్షణ ఆలోచనలకు ఊతం ఇవ్వడం, సమ్మిళిత విద్యా విధానానికి పునాదులు వేయడం, నైపుణ్యాల పెంపుకు పట్టం కట్టడం, వ్యక్తిని మహత్తర శక్తిగా మార్చగలగడం నేటి విద్యా విధానానికి ఊపిరి కావాలి. విషయ పరిజ్ఞానానికి నైపుణ్యం తోడైతేనే వ్యక్తి ప్రతిభ దేశానికి దోహదపడుతుంది. నైపుణ్యం లేని విద్య సువాసన లేని పువ్వులాంటిదే అని గమనించి నేటి యువత విద్య, నైపుణ్యాలను సమాంతరంగా ఒట్టపట్టించుకోవాలి. జాతీయ విద్యా దినోత్సవ వేదికగా విద్య ప్రాధాన్యాన్ని వివరించే సదస్సులు/కార్యశాలలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, రీడింగ్ హాబిట్‌ను పెంచడం, విద్యావేత్తలను గుర్తించడం, విద్యలో రాణించిన యువతను సన్మానించడం, విద్యార్థులకు విద్య ప్రాధాన్య అంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

భారత్‌లో విద్యా వ్యవస్థ కొంత వరకు గాడి తప్పినట్లు, నాణ్యతలకు తిలోదకాలిస్తూ, నైపుణ్య విద్యను గంగలో కలుపుతూ యువభారతం నిరుద్యోగంతో అసహనాన్ని వ్యక్తం చేస్తున్నది. గుణాత్మక విద్యను త్యాగం చేస్తూ పరిమాణాత్మక మెరుపులకే మురిసి పోతున్న భారతీయ విద్యా వ్యవస్థను పట్టాలపైకి తీసుకురావలసిన సమయం ఆసన్నమైంది. యువ భారతానికి డిజిటల్ మెరుగులు దిద్ది, నైపుణ్య బుద్ధులు నేర్పి అంతర్జాతీయ స్థాయి టెక్నోక్రిట్స్, సైంటిస్టులు, అధ్యాపకులు, పలురంగాల్లో శాసించగల మేధావులను తయారు చేసే నూతన గుణాత్మక విద్య విధానం కావాలని, ప్రభుత్వాలు ఆ దిశలో పటిష్ట అడుగులు వేయాలని కోరుకుందాం. అందరికీ జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

మాసాల్లోకెల్లా పరమ పవిత్రం కార్తీకం

(10 నవంబర్ – 08 డిసెంబర్ 2026 "కార్తీక మాసం" శుభ సందర్భంగా)

బతుకమ్మ పండుగ తర్వాత దసరా సరదాలు కూడా అనుభవించాం. దీపావళి వెలుగుల్లో మన ఇంటికి సంతోష తోరణాలు కట్టాం. నవంబర్ 09, 2026న ఆశ్వయుజ మాసం ముగుస్తూ 10 నవంబర్ 2026 రోజున పరమ పవిత్ర కార్తీక మాసం మెదలు అవుతున్నది. పురాణాల ప్రకారం, 12 మాసాల్లో కార్తీక మాసం అత్యంత పవిత్రమైనది. శివకేశవులకు ఇష్టమైన కార్తీక మాసంలో పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే మోక్షం కలుగుతుందని విశ్వాసం. "కార్తీక మాసం కన్న పరమ పవిత్ర మాసం లేదని, మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడని, వేదానికి సమానమైన శాస్త్రం ఏదీ లేదని, గంగతో సమానమైన తీర్థం లేదని" స్కంద పురాణం పేర్కొంటున్నది. శివారాధన విశిష్టమైన కార్తీక మాసం 10 నవంబర్ నుంచి 08 డిసెంబర్ 2026 వరకు కొనసాగుతుంది. మహిమాన్వితమైన కార్తీక మాసంలో పరమేశ్వరుడిని విశేష భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తాం. దామోదర మాసంగా పిలుచుకునే పండుగగా అశేష భక్తకోటి పారవశ్యంలో మునిగి పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వన భోజనాలతో భక్తి వరదలతో గుడుస్తుంది. కార్తీక మాసంలో సత్యనారాయణ వ్రతాలు, విష్ణుసహస్రనామ పారాయణాలు, లలిత సహస్రనామ పారాయణాలు ఆచరిస్తారు.





శివారాధనల శుభ గడియలు:

ఏడాదిలో తొమ్మిదవ నెలలో వచ్చే కార్తీక మాసంలో శివాలయాల్లో రుద్రాభిషేకాలు, రుద్రపూజలు, లక్ష బిల్వదళ పూజలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు లాంటివని విశేషంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్నది. శివున్ని పూజించడంతో మరుజన్మ ఉండదని భక్తులు విశ్వసిస్తారు. అశుతోషుడైన పరమ సదాశివుడు కోరిన కోర్కెలను తీర్చి సకల సౌఖ్యాలను కలిగిస్తున్నాడు. కార్తీక మాసంలో పవిత్ర నదిలో స్నానాలు చేయడంతో పాటు 365 ఒత్తులతో దీపారాధనలు చేస్తారు. పరమ పవిత్రంగా భావించే ఉసిరి చెట్టు కింద ఆవు నెయ్యితో దీపం పడతారు. ఈ మాసం దీప దానం చేస్తే చీకట్లు తొలగుతాయని, లక్ష్మీదేవి అనుగ్రహం కలిగి ఆ ఇల్లు సిరి సంపదలతో నిండిపోతుందని ప్రగాఢ విశ్వాసం. తులసి కోటకు పూజలు నిర్వహిస్తారు. పున్నమి వెలుగుల్లో కార్తీక దీపాలను వెలిగించి నదుల్లో, పారే నీటిలో వదులుతారు. సోమవారం కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. కార్తీక పూజలతో ఈతని బాధలు తొలిగి జన్మజన్మ పాపాలు తొలగి పోతాయని నమ్మకం. దాన ధర్మాలు చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని నమ్ముతారు.

కార్తీక మాస విశిష్ట రోజులు:

10 నవంబర్ 2026 రోజున అన్న కూట్, గోవర్ధన పూజ, బలి ప్రతిపద పండుగ జరుపుకుంటాం. నవంబర్ 11న భాయ్ దూజ్, తమ ద్వితీయ, చిత్రగుప్త పూజ, నవంబర్ 13న నాగుల చవితి, మానసిక వినాయక చతుర్థి వ్రతం, 15న స్కంద పుష్టి, 16న తొలి కార్తీక సోమవారం, 17న గోపాష్టమి, 20న ఉత్థాన ఏకాదశి, 21న క్షీరాబ్ధి ద్వాదశి, 23న రెండవ కార్తీక సోమవారం, వైకుంఠ చతుర్దశి, 24న కార్తీక పౌర్ణమి, 30న కార్తీక మూడవ సోమవారం, 04 డిసెంబర్‌న ఉత్పన్న ఏకాదశి, 07 డిసెంబర్‌న కార్తీక నాలుగవ సోమవారం మాస శివరాత్రి, 08న అమావాస్యతో కార్తీక మాసం ముగుస్తుంది. 09 డిసెంబర్‌న పోలి స్వర్గం పూజలు చేస్తారు. ఈ పవిత్ర మాసంలో నాగ పంచమి, చత్ పూజ, అష్టమి వ్రతం, కార్తీక వీర్య జయంతి, గోపాష్టమి, మాసిక్ దుర్గాష్టమి, యజ్ఞావల్క్య జయంతి, అక్షయ వ్రతం, జగద్ధాతి పూజ, ప్రభోధిని ఏకాదశి, కౌసి వధ, భీష్మపంచకం, తులసీ వివాహం, వైష్ణవ దేవుత్థాన ఏకాదశి, యోగేశ్వర ద్వాదశి, విశ్వేశ్వరయ్య వ్రతం, ప్రదోష వ్రతం, మణికర్ణికా స్నానం, జ్వాలా తోరణం కార్తీక పూర్ణిమ, కార్తీక బహుళ ఏకాదశి, వృశ్చిక సంక్రాంతి, పోలి స్వర్గం లాంటి పలు పుణ్య గడియలను పాటిస్తూ 08 డిసెంబర్ రోజున కార్తీక మాసం ముగుస్తుంది.

కార్తీక మాసంలో భక్తులు సక్రమంగా పూజలు చేసి ఆధ్యాత్మిక ప్రయోజనాలను పొంది జీవితంలో శాంతి, సంతోషాలు, శ్రేయస్సు పొందాలని కోరుకుందాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

విద్యా హక్కు పరి రక్షణ అందరి బాధ్యత

ప్రతి సంవత్సరం నవంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని



జరుపు కుంటున్నాం. దీన్నే రాష్ట్రీయ శిక్షా దివస్ అని కూడా పిలుస్తారు. దేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా పాటిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మన దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ పనిచేశారు. 1947 నుంచి 1958 వరకు తన బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. భారతదేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా కూడా ఆయన సేవలందించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని 2008 నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భంగావిద్యా హక్కు పరి రక్షణ గురించి ఆలోచించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. విద్యా హక్కు చట్టం హామీ ఇచ్చినవిధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగిన తరగతిలో చేర్పించి విద్యనందించడమూ ఒక సవాలే.

యునిసెఫ్ ప్రకారం దాదాపు సగంమంది; ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడి మాని వేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55% షెడ్యూల్డ్ తెగల్లో 63% దాకా ఉందని అంచనా. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యాయులను అధికంగా తయారు చేయలేక పోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యా యుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసు కుంటారు, ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23. 8 కోట్ల మంది మనదేశం లోనే ఉన్నట్లు వెల్లడైంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతి ఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించ గలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది.

న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వామిత్రుడు, సాందీపుడు, పరశు రాముడు, ఆదిశంకరాచార్యులు, ద్రోణా చార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా పదవీకాలం ముగియ గానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. శ్రీరాముడు–విశ్వామిత్రుడు, శ్రీకృష్ణుడు– సాందీపుడు, శివాజీ– సమర్థ రామదాసు, వివేకానంద–రామకృష్ణ పరమ హంసలను పేర్కొనవచ్చు. మాతృదేవోభవ– పితృదేవోభవ– ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావి పౌరులను తీర్చిదిద్దు తున్నామనే భావన ఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారం గురువు. ఉపాధ్యాయులు తమ మేధో సంపత్తిని పెంపొందించు కోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహించాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 'మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు' అనేవారు. ఉపాధ్యాయ లోకం కానీ రిమోట్ లెర్నింగ్ అందించడానికి, వెనక బడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య యొక్కభవిష్యత్తును మరియు బోధనా వృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం. ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునఃసమీక్షించుకొని తదనుగు ణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యాలక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారి పోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

మాడపాటి జీవితమే ఆంధ్ర ఉద్యమ చరిత్ర

నేడు ఆంధ్ర పితామహుని వర్ధంతి

మాడపాటి హనుమంతరావు ఒక వ్యక్తి కాదు. ఒక మహాసంస్థ. ఆయన జీవిత చరిత్రమే తెలంగాణ ఆంధ్రోద్యమ చరిత్ర. అందుకే ఆంధ్ర పితామహుడని పేరుపొందిన ప్రజానాయకుడు ఆయన. నాటి నిజాం రాజ్యంలోని తెలుగు వారిలో జాగృతిని కలిగించి, సామాజిక, సాంస్కృతిక రాజకీయ వికాసానికై నిరంతర కృషిచేసిన ప్రముఖుడు, బహుభాషా పండితుడు మాడ పాటి. తెలంగాణలో చైతన్యాన్ని తెచ్చిన తొలి తెలుగు నాయకునిగా ఆయన సుపరిచితుడు. ఆయన ఒక విజ్ఞాన సర్వస్వము. ఆయన బ్రిటీష్, నిజాం రాజ్యాల సరిహద్దు లలో ఉన్న ఎర్రుపాలెం వాస్తవ్యుడు కనుక నిజాం ఆంధ్రులందరిలో ముందు మేల్కొన్నాడు. తన దేశీయుల్ని మేల్కొలిపినాడు. 1904లో హనుమకొండలో శ్రీరాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయంలో సన్నని జాలుగా బయలుదేరిన ఆయన ఆంధ్రో ద్యమం గోల్కొండ పత్రికలో పరిపుష్టినందుకుని, ఆంధ్రమహా సభలలో వాహినిగా ప్రవహించింది. హనుమంతరావు 20వ శతాబ్ది తొలిదశకంలో హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో (నేటి తెలంగాణ) ఆంధ్రోద్యమం వ్యాప్తి చేసేందుకు కృషిచేశారు. న్యాయవాద వృత్తిని చేపట్టిన మాడపాటి, విజయవంతమైన లాయరుగా పేరుపొందారు. తీరిక సమయాలన్నిటా ఆంధ్రోద్యమానికి, తెలంగాణలో గ్రంథాలయాల అభివృద్ధికి కేటాయించేవారు. ఆంధ్ర జన సంఘం, ఆంధ్ర మహాసభ వంటి ప్రజాసంఘాల స్థాపనలోనూ, వాటి నిర్వహణలోనూ కీలకపాత్ర వహించారు. 1885 జనవరి 22 (తారణ సంవత్సర మాఖ శుద్ధ షష్ఠి) న కృష్ణా జిల్లా, నందిగామ తాలూకా పొక్కునూరులో వెంకటప్పయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. ఆయన తండ్రి గ్రామాధికారిగా పనిచేసేవాడు. ఐదు సంవత్సరాల వయసులోనే తండ్రి చనిపోగా, సూర్యాపేటలో ఉద్యోగం చేస్తున్న మేనమామ దగ్గర పెరిగారు. హన్మకొండలోని ఉన్నత పాఠశాలలో చేరి మద్రాసు యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులు అయినారు. వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నెలకు 40 రూపాయల వేతనంపై మీర్‌మున్షీ (హెడ్‌క్లర్క్) ఉద్యోగంలో చేశారు. ఎనిమిది సంవత్సరాలు ఆ ఉద్యోగంలో ఉండి హైదరాబాద్ కొచ్చి 'లా' పరీక్ష పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టారు. వకాలత్ విడిచి పెట్టేనాటికి ఆయనకు నెలకు ఆరువందల ఆదాయం వచ్చేది. పంతులు సేవ రాజకీయ పార్టీల ద్వారా జరగ లేదు. నిర్మాణాత్మకమైన సంస్థలద్వారా జరిగింది.

ఒకానొక పరాభవాగ్నిలోంచి పుట్టింది నిజాం ఆంధ్రోద్యమం. 1921 సంవత్సరం నవంబరు 12వ తేది వివేక వర్ధని ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ హిందూ సంస్కార సభ జరుగగా, ఆ సభలో అనేక మంది ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో మాట్లాడు తున్నారు. ఆంధ్ర ప్రతినిధులు మాడపాటి హనుమంతరావు, ఆలంపల్లి వెంకటరామారావు, ఇద్దరూ హైకోర్టు న్యాయవాదులు. మహారాష్ట్ర బాహుళ్యమైన సభలో తెలుగులో మాట్లాడినారు. సభలోని వారు విసుక్కున్నారు. నిరసన ప్రకటించారు. అల్లరి చేసారు. తమ వీపులు సభావేదిక వైపు తిప్పి వినమన్నారు. ఈ దుశ్చర్య, అవమానం ఆంధ్రులు భరించలేక పోయారు. ఆ రాత్రికి రాత్రే టేకుమల రంగారావు ఇంట్లో సమావేశమై కర్తవ్యం ఆలోచిం చారు. ఆంధ్రుల అభిమాన సంరక్షణ కోసం, ఆంధ్రుల వ్యక్తిత్వ నిరూపణ కోసం ఒక సంఘం స్థాపించు కోవాలని నిర్ణయించు కున్నారు. ఆ సంఘం పేరు నిజాం రాష్ట్ర ఆంధ్రజన సంఘం. అధ్యక్షుడు రావు బహదుర్ సామల వెంకటరెడ్డి, కార్యదర్శి మాడపాటి హనుమంతరావు. తరువాత మహారాష్ట్ర కన్నడ పరిషత్తులు కూడా ఏర్పాడ్డాయి. నాటి వరకు ఏ ఉద్యమమైనా నగరానికే పరిమితమై ఉండేది. ఆంధ్రులుగా గ్రామ సీమలకు వెళ్లారు. ఆంధ్రులలో ఐకమత్యం, చైతన్యం, విద్య, స్త్రీల వికాసం మొదలైన వాటికి కారకులయ్యారు. తాము మేల్కొని ఇతరులను మేల్కొలి పారు. ఆంధ్రసంఘం పెద్ద ఆశయాలతో బయల్దేరింది. గ్రామీణుల విజ్ఞానం వృద్ధి చేసి, వాళ్ళ కళ్ళు



తెరిపించడానికి గ్రంథాలయాలు, రైతుల ఇక్కట్లు పోగొట్టడానికి రైతు సంఘాలు, వ్యాపార పరిస్థితులు బాగు పరచ డానికి వర్తక సంఘాలను స్థాపించింది. పటేల్– పట్వారీల జులంతో, భూస్వాముల వెట్టి చాకిరితో, అధికారుల దౌర్జన్యంతో బాధపడుతున్న నిర్భాగ్యపు ప్రజల శ్రేయస్సుకోసం పనిచేసింది. ఆంధ్ర జన సంఘం నాయకులు జిల్లాలు తిరిగి కర్తవ్య ప్రబోధం చేశారు. మాడపాటి గ్రంథాలయోద్యమం లోనూ చెప్పుకోదగ్గ కృషి సాగించారు. ఆయన తనకు సన్మానం ద్వారా లభించిన సొమ్మును కూడా గ్రంథాలయాల అభివృద్ధికే అంద జేశారు. హైదరాబాద్ లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, హనుమకొండ లోని రాజరాజ నరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం కూడా ఆయన అభివృద్ధి చేసినవే. వీటిలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం నిజాం పాలిత తెలుగు ప్రాంతంలోని తొలి తెలుగు గ్రంథాలయంగా చారిత్రిక ప్రశస్తి పొందింది. ఆ రోజుల్లో గ్రంథాలయాలు నడ పడం అంత సులభమైన పనికాదు. నాటి ప్రభుత్వ దృష్టిలో గ్రంథాలయా లంటే విప్లవ కేంద్రాలే. అయినా పాలకులతో ఉత్తరాల ద్వారా అనుమతులు పొందారు. 4వ ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో 1935 సంవత్సరం జనవరి 26, 27, 28 తేదీలలో జరిగింది. గద్దె నెక్కించడమేకానీ తాను ఎక్కే స్వభావం హనుమంతరావులో లేదు. సభ్యులు పట్టపట్టాక, పంతులు అధ్యక్ష పీఠం వహించక తప్పలేదు. అప్పుడే అక్కడే జరిగిన మహిళా సభకు పంతులు అర్ధాంగి అధ్యక్షత వహించారు. భర్త, మరొక వైపు భార్య ఒకేసారి ఒక స్థలంలో జంటగా సాగుతున్న ఆంధ్ర మహా సభకు, ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించడం అపూర్వం, అపురూపం. మాడపాటి షష్టిపూర్తి ఉత్సవం 1946 ఫిబ్రవరిలో రెడ్డి హాస్టల్ ఆవరణలో మహావైభవోపేతంగా జరిగింది. దీనికి రాజ్ బహదూర్ వెంకట్రామి రెడ్డి ఆహ్వాన సంఘాధ్యక్షులు కొండా వెంకటరంగారెడ్డి కార్యదర్శి. ఇందులో పంతులుకు తులాభారం జరుపగా, సంబంధిత రూ. 6400 డబ్బును ఆయన మహిళా కళాశాలకు విరాళంగా ఇచ్చారు. హనుంతరావు బాలికల కోసం నారాయణ గూడలో స్థాపించిన పాఠశాల ఆయన స్మారక కళాశాలగా నడుస్తున్నది.

బూర్గుల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంతులు ఉస్మానియాకు శాశ్వత సెనెటు సభ్యులుగా నియమితులైనారు. తరువాత నాలుగేళ్ళు సిండికేటు సభ్యులుగా ఉన్నారు. భారత దేశములో ప్రప్రథమ బాలికల పాఠశాలలో ఒకటైన మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాల హైదరాబాదులో నారాయణ గూడలో స్థాపించాడు. బాలికల కోసం ఆయన ఎన్నో పాఠశాలలను నెలకొల్పారు. ఆయన విద్యారంగానికి చేసిన సేవలను పురస్కరించుకొని ఉస్మానియా విశ్వ విద్యాలయం 1956లో డాక్టరేటు బిరుదు నిచ్చి సత్కరించింది. 1955లో కేంద్ర ప్రభుత్వం 'పద్మ భూషణ' బిరుదు ప్రసాదించింది. ఆ బిరుదు పొందిన తెలుగు వారిలో ఆయనే ప్రథములు. అనారోగ్య కారణాలతో ఢిల్లీ వెళ్ళలేక పోగా, మరుసటి సంవత్సరం రాష్ట్రపతి డా.బాబు రాజేంద్రప్రసాద్ హైదరాబాద్ విచ్చేసినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో స్వహస్తాలతో మాడపాటికి 'పద్మ భూషణ్' బహూకరించారు. మాడపాటి మంచి కవి, రచయిత. మొత్తం పదమూడు కథలు రాశారు. వీటిలో హృదయశల్యం, రాణీసారందా, ముసలిదాని ఉసురు, నేనే, అగ్ని గుండం, నాదు నీ పంతం, నేడు నా పంతం, ఆత్మార్పణం, తప్పు, ఎవరికి, విధి ప్రేరణం అనే కథలు 'మల్లికాగుచ్ఛం' పేరుతో 1911 లో పుస్తక రూపం దాల్చాయి. మాడపాటికి రచయితగా శాశ్వత కీర్తిని అందించిన గ్రంథం 'తెలంగాణ ఆంధ్రోద్యమం'.

రాష్ట్రానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత 1951లో హైదరాబాద్ నగర పాలక సంఘానికి పంతులుగ తొలి మేయరుగా ఎన్నికయ్యారు. ఆ పదవికి మూడు సార్లు ఎన్నికవుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ అధ్యక్షునిగా ఆయన ఆరేళ్ళు పదవిలో ఉండి, ఉన్నత ఆదర్శాలతో సభ్యులందరికి మన్ననలు పొందారు. మాడపాటి దూరదృష్టి, స్వార్థ రాహిత్యం, క్రమశిక్షణ, నిర్వహణలో దక్షత వంటివి కలిగిన వ్యక్తి. అందరినీ కలుపుకు పోయే లక్షణం, ఉద్వేగం లేని స్వభావం వల్ల ఆయన అజాత శత్రువుగా నిలిచారు.రాజకీయాల్లో ఆయన మితవాది, అయినా ఆయన రాజకీయాదర్శాలను వ్యతిరేకించే కమ్యూనిస్టులు కూడా ఎంతగానో గౌరవించేవారు.
శాసన మండలి అధ్యక్ష పదవీ విరమణ అనంతరం విశ్రాంతి జీవితాన్ని గడుపుతూ 1970 నవంబరు 11వ తేదీన తమ 86వ ఏటా మరణించారు.

–రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

పెద్దపల్లిలో బియ్యం ప్రత్యేక విక్రయ కేంద్రం

కిలో రూ.66 నుంచే నాణ్యమైన రైస్ లభ్యం

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి):
తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు సామాన్య వినియోగదారులకు ఊరటనిస్తూ, తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యాన్ని అందించడానికి పెద్దపల్లి పట్టణంలో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక కనకదుర్గ ట్రేడర్స్‌లో సిద్ధం చేసిన ఈ విక్రయ కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ... పెరిగిన నిత్యావసర ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ఈ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. మార్కెట్ ధరలతో పోలిస్తే విక్రయ కేంద్రంలో తక్కువ రేట్లకే నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

రకాల వారీగా విక్రయ ధరల వివరాలు
బీపీటీ, కేఎన్ఎం, ఎంఆర్పీ రకాలు కిలో రూ. 66/-, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాలు కిలో రూ. 74/-, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాలు కిలో రూ. 79/- ప్రజలందరూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్దేశించిన ధరలకే నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేయాలని



అదనపు కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కే. శ్రీనాథ్‌తో పాటు పలువురు సంబంధిత అధికారులు, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి
నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి అభివృద్ధి పనులను వేగం పెంచాలి

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 10(సింగిడి)
ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే మదన్ మోహన్, నియోజకవర్గంలోని 8 మండలాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ఈఈ, డీఈ, ఏఈలతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం, మరమ్మతులు, స్వయం సహాయక సంఘాల (SHG) భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల నిర్మాణ పనుల పురోగతిని ఎమ్మెల్యే సమీక్షించారు.పెండింగ్‌లో ఉన్న రహదారి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఎస్‌హెచ్‌జీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనా ప్రతిపాదనలను ఎలాంటి జాప్యం లేకుండా సిద్ధం చేసి సమర్పించాలని స్పష్టం చేశారు.అలాగే కొత్త అభివృద్ధి పనులకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, నిధుల మంజూరు ప్రక్రియ వేగవంతం అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ముఖ్యంగా గత మూడు, నాలుగు సంవత్సరాలుగా పనులు దక్కించుకున్నప్పటికీ ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని కాంట్రాక్టర్ల తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం అలాంటి కాంట్రాక్టర్ల ఒప్పందాలను రద్దు చేసి, పనులు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న ఇతర కాంట్రాక్టర్లకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు!నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం, జాప్యాన్ని ఎంతమాత్రం సహించబోమని ఎమ్మెల్యే మదన్ మోహన్ స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరితగతిన అందించడమే లక్ష్యంగా అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రతి అభివృద్ధి పనిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



మంథని రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి):
రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మంథని పట్టణంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ, విస్తరణ పనులను వేగవంతం చేసి, ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మంథని మున్సిపల్ పరిధిలోని మంథని–గోదావరిఖని ప్రధాన రహదారి, పుష్కర ఘాట్ సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణం, అలాగే మహాలక్ష్మి ఆలయ రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పనుల పురోగతి గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఇలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలి
పరిశీలన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకూడదని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో



పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు పుష్కర ఘాట్, మహాలక్ష్మి ఆలయ రోడ్డు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నిర్మాణ పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు రవాణా పరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్లను త్వరగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్.ఈ. గంగాధర్, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌తో పాటు పలువురు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మేయర్ దంపతులకు 'బండి' శుభాకాంక్షలు

కరీంనగర్, నవంబర్10(సింగిడి)
నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ స్వర్ణలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులను శాలువాతో సత్కరించి, మొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం మేయర్ దంపతులు బండి సంజయ్‌ను శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

వేములవాడ దేవస్థాన అధికారుల సమావేశం



2027 పండుగల తేదీల ఖరారుపై ప్రజాభవన్లో స్థానాచార్యులు, అర్చకుల భేటీ
ప్రిన్సిపల్ సెక్రటరీ , కమిషనర్ , దేవాదాయ అడ్వైజర్ రాజరాజేశ్వర స్వామి వారి ప్రసాదాలు అందజేత ఆలయ వీటీడీఏ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)
జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన పలు కీలక సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు.హైదరాబాదులోని ప్రజాభవన్‌లో తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల స్థానాచార్యులు, ముఖ్య అర్చకులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాబోయే 2027 సంవత్సరానికి సంబంధించిన వివిధ పండుగల తేదీలను అధికారికంగా నిర్ణయించడంపై చర్చించారు. ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్య , దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతు రావు , దేవాదాయ ధార్మిక అడ్వైజర్ గోవింద హరి వేములవాడ ఆలయ అర్చకులు, వేద పండితులు కలిసి స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూ



ప్రసాదం నూతన 2027 క్యాలెండర్‌ను అందజేశారు. వీటిడిఏ అధికారులతో అభివృద్ధి పనుల సమీక్ష అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి ఈవో ఎల్. రమాదేవి , వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ వీటిడిఏ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ముఖ్య అర్చకులు, స్థానాచార్యులు, వేద పండితులు ఆలయ అధికారులు పాల్గొన్నారు

19న సిద్దిపేటలో సీఎం భారీ బహిరంగ సభ
ఇందిరమ్మ కుటుంబ బీమా, చీరల పంపిణీ ప్రారంభం.. సభా స్థలాలను పరిశీలించిన మంత్రులు పొన్నం, వివేక్

సిద్దిపేట ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)
ఈ నెల 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పలు ప్రాంతాలను పరిశీలించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో సభా స్థలం, పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా ప్రారంభం
ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబరు 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ వర్తించే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారని వెల్లడించారు. మహిళలకు చిలకపచ్చ రంగు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తారని చెప్పారు.సంక్షేమ పథకాలపై వివరాలుఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సభలో వివరిస్తారని మంత్రి పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు బోనస్, రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలు వివరాలను ప్రజలకు తెలియజేస్తారన్నారు.మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన అంశంతో పాటు ఉద్యోగ నియామకాలు, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి తదితర కార్యక్రమాలపై కూడా వివరించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వం సాధించిన ప్రగతితో పాటు ఇంకా అమలు చేయాల్సిన కార్యక్రమాల గురించి కూడా ప్రజలకు వివరిస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు.భారీగా తరలిరావాలని పిలుపునిద్దిపేటతో పాటు దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల తదితర నియోజకవర్గాల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, నూతన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే సభ ప్రధాన ఉద్దేశమన్నారు. నవంబరు 19న సిద్దిపేట సభ వేదికగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరా బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు.సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు.రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంరాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని మంత్రి వెల్లడించారు. అలాగే 20 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.నవంబరు 19న జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభకు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.
మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన అంశంతో పాటు ఉద్యోగ నియామకాలు, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి తదితర కార్యక్రమాలపై కూడా వివరించనున్నట్లు పేర్కొన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు అమలు చేసిన కార్యక్రమాలతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న పనులను కూడా సభ ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు.భారీగా తరలిరావాలని పిలుపునిద్దిపేటతో పాటు దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల తదితర నియోజకవర్గాల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.



సీఎం సభను సక్సెస్ చేయాలి

కరువుకు కారణం బీఆర్ఎస్సే...

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కేటీఆర్
దమ్ముంటే పిల్లర్ వద్ద నిలబడి మోటార్ ఆన్ చేయాలి
పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి):
రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులకు ఎల్‌నినో ప్రభావం కారణం కాదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యాలే అసలు కారణమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. మంగళవారం పెద్దపల్లి ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

కేటీఆర్‌కు బహిరంగ సవాల్
మేడిగడ్డ బ్యారేజీ విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎంపీ విమర్శించారు. పంపులు ఆన్ చేయాలంటూ ప్రజలను రెచ్చగొట్టడం సరికాదన్నారు. "కేటీఆర్ గారూ.. మీకు మేడిగడ్డ బ్యారేజీపై అంత నమ్మకం ఉంటే, మీరే అక్కడికి వచ్చి, కుంగిపోయిన బ్యారేజీ కింద నిలబడి పంపులు ఆన్ చేయించండి. బ్యారేజీకి ఎలాంటి ప్రమాదం లేదని మీరు ధైర్యంగా చెబుతున్నప్పుడు ఆ ధైర్యాన్ని చేతల్లో చూపించండి" అని సూటిగా సవాల్ విసిరారు.

కేసీఆర్ తెచ్చిన కరువే ఇది
"ఇది ఎల్‌నినో ప్రభావంతో వచ్చిన కరువు కాదు.. కేసీఆర్ తెచ్చిన కరువు" అని ఎంపీ వంశీకృష్ణ వ్యాఖ్యానించారు. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణలో జరిగిన వైఫల్యాల వల్లనే నేడు మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని, ప్రాజెక్టు పరిస్థితి దయనీయంగా మారిందని విమర్శించారు.

భద్రతా ధ్రువీకరణ లేకుండా పంపులు ఆన్ చేస్తే ప్రమాదం
మేడిగడ్డ బ్యారేజీ భద్రతపై జాతీయ డ్యామ్ సేఫ్టీ (NDSA) నిపుణులు, అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి స్పష్టమైన ధ్రువీకరణ ఇచ్చే వరకు పంపులు ఆన్ చేయడం సాధ్యం కాదని, నిపుణుల అనుమతి లేకుండా పంపులు ఆన్ చేస్తే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశముందని ఆయన హెచ్చరించారు. ప్రాజెక్టుల విషయంలో రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల ప్రాణ భద్రతకే తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, నిపుణుల నివేదిక వచ్చిన తర్వాతే ముందడుగు వేస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు వైఫల్యాలకు బాధ్యత వహించాల్సిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని హితవు పలికారు.

సీఎం సభ విజయవంతం అయ్యేలా సమన్వయంతో పని చేయాలని

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి)
ముఖ్యమంత్రి సభ విజయవంతం అయ్యేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ కే.హైమావతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దిపేట జిల్లా కేంద్రంలో పర్యటించి ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభిస్తారని, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సభ నిర్వహణ కోసం గతంలో ముఖ్యమంత్రి సభ జరిగిన నాగ దేవత గుడి సమీపంలోని ప్రాంతాన్ని మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ లు పరిశీలించడం జరిగిందన్నారు. సభా నిర్వహణకు భారీ సంఖ్యలో హాజరయ్యే ప్రజలకు విఐపి లకు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సభా ప్రాంగణం తీర్చిదిద్దాలని, వాహనాల పార్కింగ్, ఎలిప్యాడ్ , దయాస్, తాగునీరు, విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టం, సౌకర్య వంతంగా కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలన్నారు. రేపు బుధవారం ఉదయం నుండి సభ ప్రాంగణం క్లీనింగ్, లెవలింగ్ పనులు చేపట్టాలని, డయాస్ ఏర్పాటు సభ ప్రాంగణం ఏర్పాటు, విద్యుత్ తదితర ఏర్పాట్ల కోసం రేపు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా చేసేందుకు వివిధ శాఖలకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన వివరాలను అందచేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి మీడియా పాయింట్ నూతన కార్య వర్గ ఏకగ్రీవ ఎన్నిక

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)
హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల మీడియా పాయింట్ నూతన అధ్యక్షుడిగా జక్కుల విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎర్ర గట్టుగుట్ట కళ్యాణ మండపంలో మంగళవారం మండల జర్నలిస్టులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా జక్కుల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సందెల సాగర్, ఉపాధ్యక్షులుగా, కోప్పుల రాజేందర్, దాడి భిక్షపతి, సందెల రాజు, కోశాధికారిగా దాడి చిరంజీవి, సహాయ కోశాధికారిగా మండ రాజేష్, కార్యదర్శులుగా బొక్క రాజు, వాజిద్, సహాయ కార్యదర్శులుగా రామంచ మధుకర్, చెన్నూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.అదే విధంగా సలహాదారులుగా సయ్యద్ అహ్మద్, దండుగూడెం రాజకుమార్, కార్యవర్గ సభ్యులు గా రేణికుంట్ల దుర్గాప్రసాద్, రాజారపు భిక్ష పతి,ఎర్ర కుమార స్వామి,పెసరు సూర్య ప్రకాష్,చెంగేల్లి నరేష్ చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యతకు పెద్దపీట వేస్తానని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా పాయింట్ సభ్యులు.. కే కార్తీక్, బండారి సుమన్, పత్తిపాక విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల గుర్తింపు

హనుమకొండ జిల్లా క్రైమ్ ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)
పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఐఆర్ (CEIR) పోర్టల్ ద్వారా గుర్తించిన హనుమకొండ పోలీసులు, 5 సెల్‌ఫోన్లను వాటి యజమానులకు తిరిగి అప్పగించారు.హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే సీఐఐఆర్ (CEIR) పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ నరసింహారావు, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్, సీఐఐఆర్ పోర్టల్ నిర్వాహకుడు కానిస్టేబుల్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.





విత్తనాల కోసం చెప్పుల క్యూ..!

పొద్దుతిరుగుడు విత్తనాల కోసం రైతుల పడిగాపులు

పొద్దుతిరుగుడు విత్తనాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెజ్జంకి మండల కేంద్రంలో విత్తనాల పంపిణీ వద్ద రైతులు చెప్పులను వరుసలో పెట్టి తమ వంతు కోసం నిరీక్షించడం కనిపించింది. గంటల తరబడి వేచి చూసినా విత్తనాలు లభిస్తాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.వ్యవసాయ సీజన్‌లో అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాల్సి ఉండగా, రైతులు ఇలా నిరీక్షించాల్సి రావడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.విత్తనాల కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా తగిన నిల్వలు ఏర్పాటు చేయాలని, ప్రతి రైతుకూ సకాలంలో విత్తనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు.

సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, (సింగిడి):



రక్తదానం చేసి.. ప్రాణం నిలిపిన సింగిడి ప్రతినిధి

మానవత్వం చాటుకున్న జర్నలిస్టు.. సమయానికి రక్తం అందించడంతో బాధిత కుటుంబంలో ఆనందం

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)

కామారెడ్డి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తికి అత్యవసరంగా రక్తం అవసరమని వైద్యులు సూచించడంతో స్పందించిన సింగిడి పత్రిక కామారెడ్డి ప్రతినిధి రవీందర్ మానవత్వాన్ని చాటుకున్నారు.బాధితుడికి రక్తం అత్యవసరమని వైద్యుల ద్వారా సమాచారం అందడంతో వెంటనే స్పందించిన రవీందర్ ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు. సమయానికి రక్తం అందడంతో బాధితుడికి చికిత్స అందించేందుకు వైద్యులకు సహకారం లభించింది.తమ కుటుంబ సభ్యుడు ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో సమయానికి రక్తం అందించి ఆదుకున్న రవీందర్‌కు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మా ఆయనకు సమయానికి రక్తం అందించి ప్రాణాలు కాపాడేందుకు సహకరించారని వారు ఆనందం వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి



గురయ్యారు.ఈ విషయం తెలుసుకున్న కామారెడ్డి జిల్లా విలేకరుల బృందం సింగిడి పత్రిక కరస్పాండెంట్ రవీందర్‌ను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపింది.వృత్తి ఏదైనా.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం. రక్తదానం మహాదానం అనే మాటకు నిలువెత్తు నిదర్శనంగా రవీందర్ చేసిన ఈ సేవ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఆయిల్ పామ్ రైతులు అప్రమత్తంగా ఉండాలి

నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి

కామారెడ్డి,ప్రతినిధి నవంబర్ 10 : (సింగిడి)

ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున ఆయిల్ పామ్ రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి సూచించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ తోటల్లో నీటి యాజమాన్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.మద్నూర్ మండలం చిన్న ఎక్లారా గ్రామంలో ఎల్‌నినో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి ఆయిల్ పామ్ సాగు పద్ధతులు, పంట యాజమాన్య మెళకువలు, ప్రభుత్వ రాయితీలపై రైతులకు వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండ తీవ్రత పెరిగే పరిస్థితుల్లో ఆయిల్ పామ్ మొక్కలను సంరక్షించుకోవడం రైతులకు ఎంతో ముఖ్యమన్నారు. తోటల్లో బిందు సేద్యం ద్వారా అవసరమైన మేరకు నీటిని అందించాలని, మొక్కల చుట్టూ తేమ నిల్వ ఉండేందుకు మల్చింగ్ చేపట్టాలని సూచించారు. కలుపు మొక్కలను నియంత్రించడంతో పాటు సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు వినియోగించాలని, మొక్కల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు.ఆయిల్ పామ్ మొక్కల పెరుగుదల, పూత, కాయల అభివృద్ధి, గెలల దిగుబడి పెంపునకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించడం అవసరమని వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు మొక్కల సరఫరా, బిందు సేద్యం పరికరాలపై రాయితీలు, పంట నిర్వహణకు ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ తోటల నిర్వహణకు ఎకరానికి సంవత్సరానికి రూ.4,200 చొప్పున నిర్వహణ రాయితీ అందిస్తున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ జగదీష్ చంద్రబాబు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఉద్యాన శాఖ, కంపెనీ అధికారులు అందించే సాంకేతిక సూచనలను పాటిస్తూ సరైన సమయంలో తోటల నిర్వహణ చేపట్టినప్పుడే నాణ్యమైన దిగుబడులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉద్యాన శాఖ అధికారులు, మద్నూర్ మండల వ్యవసాయ అధికారి, హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సిబ్బంది, ఉద్యాన శాఖ సిబ్బంది, సుమారు 50 మంది రైతులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదంలో మూడు ఇళ్లు దగ్ధం

తుక్కాపూర్లో ఘటన.. సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి

సిద్ధిపేట ప్రతినిధి, నవంబర్ 10, (సింగిడి):

తొగుట: మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మూడు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన చిక్కుడు కనకయ్య, చిక్కుడు నర్సింలు, చిక్కుడు రాజవ్వ కుటుంబాలకు చెందిన ఇళ్లు మంటలకు ఆహుతయ్యాయి.ప్రమాదంలో ఇళ్లలోని సామగ్రి, నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి.సంబంధిత అధికారులు గ్రామానికి చేరుకుని నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వం బాధిత కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఓటర్లకు మరో అవకాశం

ఈ నెల 21లోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలి!
ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులకు తుది జాబితాలో చోటు కల్పించే అవకాశం
బీఎల్ఓలు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలను సంప్రదించాలి
అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, నవంబర్ 10(:సింగిడి)

ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను చేర్చుకునేందుకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని అదనపు జిల్లా ఎన్నికల అధికారి వి. విక్టర్ తెలిపారు. అర్హులైన ఓటర్లు ఈ నెల 21వ తేదీలోగా ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలని సూచించారు.గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫారాలు జారీ చేసినప్పటికీ గైర్హాజరు కావడం, నివాసం మారడం తదితర కారణాలతో కొందరు అర్హులైన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో నమోదు కాలేదన్నారు. అలాంటి వారికి తుది ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని వివరించారు.ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు), ఎన్నికల నమోదు అధికారులను (ఈఆర్ఓలు) సంప్రదించి నిర్దేశించిన విధానంలో ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విక్టర్ కోరారు. నవంబర్ 21, 2026లోగా దరఖాస్తులు సమర్పించి తుది ఓటర్ల జాబితాలో తమ పేర్ల నమోదును నిర్ధారించుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, ఎన్నికల సూపరింటెండెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





వేడుకలు నిర్వహించడం అభినందనీయం

హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి):

హనుమకొండ జిల్లాలో లబ్ధిదారులకు మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో దీపాల వేడుకలు నిర్వహించడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్ మామిళ్ల రాజు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు, దీపావళి వేడుకలు ఒకేసారి రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి, డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు, స్థానిక నాయకులు పాల్గొని వేడుకలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాలను డీసీసీ సభ్యులు మామిళ్ల సురేష్ దగ్గరుండి 31వ డివిజన్‌లో నిర్వహించడం ప్రశంసనీయమన్నారు.

నేడు రాష్ట్ర మంత్రి బట్టి విక్రమార్క నగర పర్యటన

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)

రాష్ట్ర మంత్రి బట్టి విక్రమార్క బుధవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు ఉదయం 11 గంటలకు నక్కలగుట్ట లో అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మైరా క్లినిక్ ఆసుపత్రిని ప్రారంభించనున్నారుమధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ కన్స్ట్రక్షన్ కొత్త భవనాలకు శిలాఫలకాలను శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి నివాసంలో గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు ఒక టిన్నర నుండి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు జిల్లా సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు.

నేడు పీఎస్ఎస్ఎం ఆధ్వర్యంలో పిరమిడ్ ఉత్సవాలు



హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 11 (సింగిడి):

పీఎస్ఎస్ఎం హనుమకొండ ఆధ్వర్యంలో పత్రీజీ జన్మదిన సందర్భంగా భీమవరంలో పిరమిడ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఉషారాణి మాస్టర్ స్వగృహంపై నిర్మించిన శ్రీ గీతామాత పిరమిడ్‌లో మధ్యాహ్నం 11 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయలక్ష్మి మాత సారథ్యంలో ధ్యాన పిరమిడ్ ప్రారంభోత్సవం జరగనుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకులు భీమినేని వంశీ కిరణ్ మాస్టర్ మరియు వారి సతీమణి భీమినేని సుకన్య ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఆనాపానసతి ధ్యానం ద్వారా కలలపై ఎన్నో పరిశోధనలు చేసి 'స్వప్న రహస్యాలు' అనే పుస్తకాన్ని రాశారని, ఎలాంటి సమస్యలనైనా చాలా సులభంగా, పైసా ఖర్చు లేకుండా మనకు మనమే నయం చేసుకునే మార్గాన్ని చూపారని అన్నారు.పిరమిడ్ అనగా విశ్వంలోని విశ్వమయ ప్రాణశక్తిని మూడు రెట్లు అధికంగా అందులో ఉన్నవారికి అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ ధ్యాన సాధన చేసుకుని తమ ఆత్మోద్ధరణకు పాటుపడాలని కోరారు.

అంగన్వాడీల పోషకాహారంతో ఎంతో మేలు

అంగన్వాడీల సేవలు సద్వినియోగం చేసుకోవాలిసామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి)

జిల్లాలో గంగారావుపేట మండలం అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారంతో పిల్లలు, గర్భిణులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.గంభీరావుపేట మండలం గజసింగవరంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పది నిమిషాల పేరిట కార్యక్ర మాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రానికి ఎంత మంది పిల్లలు వస్తున్నారో ఆరా తీసి.. వారి ఎత్తు, బరువు చూసి.. ఆరోగ్య కార్డుల్లో వివరాలు నమోదు చేసిన తీరును పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, మందులు పరిశీలించి.పలు సూచనలు చేశారు. పలువురు గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, బెల్లం, నువ్వులు బాలామృతంతో సిద్ధం చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం పది నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో కొనసాగిస్తున్నామని, కేంద్రాల్లో సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, పిల్లలు



అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నెలా తల్లి దండ్రులు బాధ్యతగా ఆరోళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా తీసుకెళ్లాలని వారి ఎత్తు, బరువు నమోదు చేయించాలని దానికి అనుగుణంగా పోషకాహారం అందించాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని, దీంతో వారి బంగారు భవితకు బాటలు పడతాయని స్పష్టం చేశారు. సామ్, మామ్ పిల్లలపై సర్పంచ్, అంగన్వాడీ కేంద్రం బాధ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ తీవ్ర పోషకాహార లోపం, తీవ్రమైన తక్కువ బరువు, మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తారని వివరించారు.నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వారు తయారు చేసిన బాలామృతం, బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బాలామృతం ప్లస్ తో పిల్లలకు ఇష్టమైన ఆహార పదార్థాలు తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. నీరు వేడి చేసి చల్లారిన తర్వాత ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. పిల్లల ఆరోగ్యం, చదువు భవిష్యత్తు తల్లితండ్రుల ఇద్దరి బాధ్యతని పేర్కొన్నారు. సరైన పోషకాహారం ఇంట్లో సైతం ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలిగర్భిణులు బాలింతలు మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి పోషకాహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎదుగుదల లోపించిన పిల్లలకు వైద్యం అందించాలి5 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలు ఎదుగుదల లోపిస్తే సమీప అంగన్వాడి కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎదుగుదల లోపాలు గల పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపల గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు, సరిగా మాట్లాడలేని పిల్లలు, రక్తహీనత, పోషకాహారం లోపం గల పిల్లలను బాల భరోసా కింద అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని తెలిపారు. ఆర్ బీ ఎస్ కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి ..ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. సేవలను సద్వినియం చేసుకోవాలని సూచించారు. ఉన్నత వైద్య సేవలు కరీంనగర్, హైదరాబాద్ లో అందిస్తారని వెల్లడించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి హనుమంతు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, సర్పంచ్ ఉమ్మాడ్డి విమల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ దుబ్బాక నియోజకవర్గం కమిటీ ఎన్నిక

సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, (సింగిడి):

సిద్ధిపేట జిల్లా మండల కేంద్రమైన మిరుదొడ్డిలో టియుజెఏసి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు దుబ్బాక నియోజకవర్గం మండల కేంద్రంలోని మల్లుపల్లి అల్వాల గ్రామాల కమిటీలు వేయడం జరిగింది అని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ కోల విజయకుమార్ రాష్ట్ర కార్యదర్శి నందిని మాస్టర్ ఆధ్వర్యంలో మిరుదొడ్డిలోని స్థానిక రామాలయ కళ్యాణ మండపం ఆవరణలో జరిగిన సభలో దుబ్బాక నియోజకవర్గం ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తొలిదశ మలిదశ ఉద్యమకారులు పాల్గొన్నారు అనంతరం దుబ్బాక నియోజకవర్గం కమిటీ వేయడం జరిగింది కమిటీ అధ్యక్షుడిగా సూకూరి లింగం ఏకగ్రీవంగా ఉద్యమకారులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పర్ష కృష్ణ సిలివేరి మల్లారెడ్డి ప్రధాన కార్యదర్శిగా హనుమాన్ల రాజిరెడ్డి కార్యదర్శిగా సర్రా రాజేందర్ కోశాధికారిగా వంజర శ్రీనివాసు ప్రచార కార్యదర్శిగా బలిజ రమేష్ ఆశ స్వామిని కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్ కొమ్ము శంకర్ బండి లక్ష్మీపతి ఆకారం స్వామి వడ్డే రవిని తెలంగాణ జాయింట్ యాక్షన్ సమితి ఆధ్వర్యంలో ఉద్యమకారులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షుడు సూకూరి లింగం మాట్లాడుతూ తనపై దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షుడుగా నమ్మకంతో ఉద్యమకారులు ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు అనంతరం మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత ఇచ్చినందుకు తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశాల మేరకు ఉద్యమకారులను ఏకతాటిపై తెస్తానని రాష్ట్ర కమిటీ ఆదేశాల పిలుపుమేరకు పనిచేస్తానని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ఉద్యమకారులందరినీ కలుపుకొని మరో పోరాటమైన చేయడానికి సిద్ధమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ యాదగిరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతు దార మల్లయ్య ధార స్వామి శ్రీనివాస్ భూమ రాజయ్య గుల్ల నర్సింలు నానం రాజయ్య సారా వెంకట్, కొమురయ్య సిద్ధి రమేష్ గౌడ్, ధర్మయ్య బలిజ భాస్కర్ రుద్రారం మల్లేశం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఉద్యమకారులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన సేవలందించాలి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 10: (సింగిడి)

ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధులు, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను సమీక్షించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణపై నిరంతరం అప్రమత్తంగా ఉంటూ రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా కేసులు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులు,రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కేసులకు సంబంధించిన వాహనాలను భద్రపరచాలని ఆదేశించారు.పోలీస్ అధికారులు బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, గ్రామాల్లో రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణయే లక్ష్యంగా ప్రతి రోజు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.



అతివ Athiva Singidi
11-11-2026
బుధవారం

దంతాలలో క్యావిటీస్ ఏర్పడటానికి కేవలం ఎక్కువ తీపి పదార్థాలు తినడం లేదా సరిగా బ్రష్ చేయకపోవడమే కాకుండా, శరీరంలో ముఖ్యమైన పోషకాల లోపం కూడా ఒక ప్రధాన కారణం.

దంతాల రక్షణ కూడా ముఖ్యమే!



దంతాల ఆరోగ్యంలో ఫ్లోరైడ్ అనే ఖనిజం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది దంతాల బయటి పొరను బలోపేతం చేసి, బ్యాక్టీరియా విడుదల చేసే ఆమ్లాల నుంచి రక్షణ కల్పిస్తుంది. శరీరంలో ఫ్లోరైడ్ లోపిస్తే ఇనేమల్ క్రమంగా క్షీణించి, దంతాలలో పుచ్చిపోవడం, నల్లటి మచ్చలు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది.

ఫ్లోరైడ్ లోపమే ప్రధాన కారణం:

నిపుణుల అభిప్రాయం ప్రకారం, దంతాలలో క్యావిటీ సమస్య తలెత్తడానికి శరీరంలో ఫ్లోరైడ్ అనే ఖనిజం లోపించడం కూడా ఒక ముఖ్యమైన కారణం. ఫ్లోరైడ్ అనేది మన దంతాల బయటి గట్టి పొర అయిన ఇనేమల్ ను బలోపేతం చేయడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. మనం తిన్న ఆహారంలోని షుగర్, స్టార్చ్‌ను విచ్ఛిన్నం చేసే సమయంలో బ్యాక్టీరియా విడుదల చేసే హానికరమైన ఆమ్లాల నుంచి ఇది దంతాలను రక్షిస్తుంది.

శరీరానికి తగిన మోతాదులో ఫ్లోరైడ్ అందనప్పుడు, దంతాల ఇనేమల్ క్రమంగా బలహీనపడుతుంది. దీనివల్ల దంతాలలో ఖనిజాల కొరత ఏర్పడి, సులభంగా క్యావిటీస్, నల్లటి మచ్చలు ఏర్పడే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది.

ఇతర కారణాలు, పోషకాలు:

కేవలం ఫ్లోరైడ్ మాత్రమే కాకుండా, దంతాల సంపూర్ణ ఆరోగ్యానికి మరికొన్ని పోషకాలు కూడా అవసరం.

కాల్షియం మరియు భాస్వరం : ఇవి దంతాలకు దృఢత్వాన్ని అందిస్తాయి. వీటి లోపం వల్ల దంతాల నిర్మాణం బలహీనపడుతుంది.

విటమిన్ డి: శరీరం కాల్షియంను సరిగ్గా గ్రహించడంలో విటమిన్ డి సహాయపడుతుంది. దీని లోపం పంటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

నోటి పరిశుభ్రత లోపం: తరచూ తీపి పదార్థాలు తినడం, నీటిని సరిగ్గా తాగకపోవడం మరియు డ్రై మౌత్ వంటి సమస్యలు కూడా క్యావిటీస్‌కు దారితీస్తాయి.

క్యావిటీస్ నుండి రక్షణ పొందడానికి చిట్కాలు:

రోజుకు కనీసం రెండు సార్లు ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్ ఉపయోగించి సరిగ్గా బ్రష్ చేయాలి. ప్రతిసారీ ఆహారం తీసుకున్న తర్వాత నోటిని నీటితో శుభ్రం చేసుకోవాలి. షుగర్ ఉండే పానీయాలు, స్వీట్ల వినియోగాన్ని తగించాలి.

ఫ్లోరైడ్ ఎక్కువగా తీసుకోవడం కూడా దంతాలపై తెల్లటి లేదా గోధుమ రంగు మచ్చలకు దారితీస్తుంది కాబట్టి, సప్లిమెంట్లు వాడే ముందు దంత వైద్యుడిని సంప్రదించడం మంచిది.

ఉలవలతో డబుల్ ఇమ్యూనిటీ



100 గ్రాముల ఉలవల్లో 329 కిలో క్యాలరీల శక్తి లభిస్తుంది. ఇందులో 57 గ్రాముల కార్బోహైడ్రేట్లు, కేవలం 0.6 గ్రాముల కొవ్వు, 22 గ్రాముల అధిక ప్రోటీన్, 8 గ్రాముల ఫైబర్ ఉంటాయి. ఈ ప్రోటీన్ శాతం 100 గ్రాముల మేకమాంసంలో ఉండే ప్రోటీన్‌తో సమానం. ఈ ధాన్యం కేవలం కడుపు నింపడమే కాకుండా, శరీరానికి అవసరమైన స్థూల పోషకాలను అందిస్తుంది. ఉలవల్లో ఉండే ఇనులిన్ అనే రసాయన సమ్మేళనం ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది మనం తిన్న తర్వాత పొట్ట ప్రేగులలోని బ్యాక్టీరియా జీర్ణం అయ్యి, కొన్ని రసాయనాలను విడుదల చేస్తుంది. ఈ రసాయనాలు కణజాలంలో ఉండే మైటోకాండ్రియాను ప్రేరేపిస్తాయి. మైటోకాండ్రియా శరీరానికి శక్తిని ఉత్పత్తి చేసే కేంద్రాలు. ఇవి ఉత్తేజపరచబడటం వల్ల ఎక్కువ శక్తి విడుదల అవుతుంది. ఇది ఆహారం వలన లభించే బలం కంటే ఎక్కువగా, కణ స్థాయిలో విడుదలయ్యే శక్తిని సూచిస్తుంది.

ప్రస్తుత సమాజంలో మధుమేహం ఒక పెద్ద ఆరోగ్య సమస్యగా మారింది, దాదాపు 25-35% మంది ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. మధుమేహాన్ని నివారించడానికి , నియంత్రించడానికి ఉలవలు ఒక అద్భుతమైన పరిష్కారం. ఉలవల్లో ఉండే "పైరోగ్లుటామినిల్ గ్లుటామిన్" అనే రసాయన సమ్మేళనం జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించిన తర్వాత ఇంక్రిటిన్స్‌ను విడుదల చేస్తుంది. ఈ ఇంక్రిటిన్స్ ప్యాంక్రియాస్‌లోని బీటా కణాలను ప్రేరేపించి, ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతాయి.

డోలిచిన్ ఎ, బి అనే సమ్మేళనాలు ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. ఇది రక్తంలో చక్కెర కణజాలంలోకి వేగంగా వెళ్ళడానికి సహాయపడుతుంది, ఇన్సులిన్ సున్నిత త్వాన్ని పెంచుతుంది. ఇది యువతలో పెరుగుతున్న మధుమేహ సమస్యను నిరోధించడానికి చాలా ముఖ్యమైనది. ఉలవల్లోని 57% కార్బోహైడ్రేట్లలో, 43% స్టార్చ్ జీర్ణం కానిది. అంటే, ఈ కార్బోహైడ్రేట్లు రక్తంలోకి గ్లూకోజ్‌ను విడుదల చేయవు, ఆ తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు.

ఈ లక్షణాలన్నింటి వల్ల, మధుమేహం ఉన్నవారికి ఉలవలు ఒక ఆ ఆహారం, లేనివారికి వ్యాధి రాకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. ఉలవల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. బీటా-సిటోస్టిరాల్, స్టిగ్మాస్టిరాల్, క్యాంఫెరాల్, నైట్రిక్ ఆక్సైడ్ వంటి సమ్మేళనాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడతాయి. మొలకలు కట్టి తీసుకోవడం వల్ల ఈ యాంటీఆక్సిడెంట్ల ప్రయోజనాలు మరింత మెరుగుపడతాయి. ఇందులోని ఇనోసిటాల్ అనే సమ్మేళనం మెదడు కణాలను రక్షించి, పార్కిన్సన్స్, అల్జీమర్స్, డిమెన్షియా , మతిమరుపు వంటి నాడీ సంబంధిత సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది.

నోరూరించే పాల ఉప్మా



ఉప్మా రవ్వ - 1 కప్పు, నూనె - 2 టేబుల్‌స్పూన్లు, పల్లీలు - 2-3 టేబుల్‌స్పూన్లు, ఆవాలు - 1 టీస్పూన్, పచ్చిశనగపప్పు - 1 టేబుల్‌స్పూన్, మినపప్పు - 1 టేబుల్‌స్పూన్, అల్లం ముక్కలు (చిన్నగా తరిగినవి) - 1 టీస్పూన్ , పచ్చిమిర్చి - 4-5 (కారాన్ని బట్టి), ఉల్లిపాయ (చిన్నగా తరిగినది), జీడిపప్పు - కొన్ని, కరివేపాకు - 1 రెబ్బ, నీళ్లు - 1 కప్పు, పాలు- 2 కప్పులు , ఉప్పు - రుచికి సరిపడా వేసుకుని చివరిలో కొత్తిమీర కొద్దిగా వేసుకోవాలి. ఇలా చేస్తే.. ఉప్మా ఇష్టం లేని వారు కూడా లొట్టలేసుకుని తింటారు.

పోషకాల మెంతికూర



ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న విషయం తెలిసిందే. అందులోనూ రుచికి కాస్త చేదుగా ఉన్నప్పటికీ, పోషకాల నిధి అయిన మెంతికూర వల్ల శరీరానికి అపారమైన ప్రయోజనాలు చేకూరుతాయి.

నిత్య జీవితంలో మెంతికూరను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఏయే ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చో ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం.. వాస్తవానికి మెంతికూరలో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి..

మెంతి కూర పోషకాలు, ప్రయోజనాలు..

డయాబెటిస్ నియంత్రణ: మధుమేహంతో బాధపడేవారికి మెంతికూర ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. దీనిలో ఉండే ప్రత్యేక పోషకాలు, అమైనో ఆసిడ్లు రక్తంలో చక్కెర (గ్లూకోజ్) స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి టైప్-2 డయాబెటిస్‌ను నియంత్రిస్తుంది.

బరువు నియంత్రణ: అధిక బరువుతో బాధపడేవారు మెంతికూరను క్రమం తప్పకుండా తీసుకోవడం మంచిది. ఇందులో పీచు (ఫైబర్) పదార్థం పుష్కలంగా ఉంటుంది. ఇది త్వరగా ఆకలి కాకుండా నిరోధించి, ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది. దీనివల్ల అనవసరమైన కేలరీలను తగ్గించుకుని ఈజీగా బరువు నియంత్రణలో ఉండవచ్చు.

గుండె ఆరోగ్యం – బీపీ నియంత్రణ: మెంతికూరలో ఉండే 'గెలాక్టోమన్నన్' అనే సమ్మేళనం, పొటాషియం గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్తపోటును (High BP) అదుపులో ఉంచడంలో దోహదపడతాయి.

జీర్ణక్రియ మెరుగుదల: మెంతి ఆకుల్లో లభించే డైటరీ ఫైబర్ పేగులను మృదువుగా ఉంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. మలబద్ధకం, అజీర్తి, గ్యాస్ వంటి కడుపు సంబంధిత సమస్యలను ఇది సమర్థవంతంగా దూరం చేస్తుంది. మెంతి కూరను ఎలాగైనా తినొచ్చు.. కూరగా లేదా పప్పులో వేసుకుని మంచిగా తినవచ్చు.. దీని ద్వారా పోషక విలువలు మరింత పెరుగుతాయి.

స్టాక్ మార్కెట్

Stock Market

ఈ స్టాక్స్ వైపు ఓ లుక్కేయండి!

ప్రముఖ బ్రోకరేజ్ కంపెనీ అయిన మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కి చెందిన టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ అయిన చందన్ తపారియా ఈ వారం మంచి లాభాలని అందించే ఛాన్స్ ఉన్న లార్జ్ క్యాప్ కేటగిరికి చెందిన 2 స్టాక్స్ కి, అలాగే మిడ్ క్యాప్ కేటగిరికి చెందిన 1 స్టాక్ కి బై రేటింగ్ తో పాటు టార్గెట్ ప్రైజ్, స్టాప్ లాస్ ని కూడా ఇస్తున్నట్లు ప్రకటించారు.

యూనియన్ బ్యాంకు నుంచి లారస్ ల్యాబ్స్ వరకు. ఈ వారంలోనే ఇచ్చిన టార్గెట్ ప్రైజ్ ని టచ్ చేసే ఛాన్స్. ఈ వారం మంచి లాభాలని అందించే ఛాన్స్ ఉన్న లార్జ్ క్యాప్ కేటగిరికి చెందిన 2 స్టాక్స్ కి, అలాగే మిడ్ క్యాప్ కేటగిరికి చెందిన 1 స్టాక్ కి బై రేటింగ్ తో పాటు టార్గెట్ ప్రైజ్, స్టాప్ లాస్ ని కూడా ఇస్తున్నట్లు ప్రముఖ బ్రోకరేజ్ కంపెనీ అయిన మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కి చెందిన టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ అయిన చందన్ తపారియా ప్రకటించారు.

ఈ 3 స్టాక్స్ జాబితాలో మొదటిది బ్యాంకింగ్ సెక్టార్ కి చెందిన యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా లిమిటెడ్ కాగా, రెండవది ఎలక్ట్రిక్ వెహికల్స్ సెక్టార్ కి చెందిన ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ లిమిటెడ్, చివరగా ఫార్మా సెక్టార్ కి చెందిన లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ఉన్నాయి.

యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా లిమిటెడ్ :

లార్జ్ క్యాప్ కేటగిరికి చెందిన యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 208 టార్గెట్ ప్రైజ్ ని ఇస్తున్నట్లు చందన్ తపారియా పెట్టుబడిదారులకి సూచించారు. అలాగే ఈ షేరుకు రూ. 191 స్టాప్ లాస్ ని కూడా చందన్ తపారియా అందించడం జరిగింది. చివరి ట్రేడింగ్ సెషన్ లో యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా లిమిటెడ్ షేరు ధర 5.6 శాతం లాభపడి రూ. 197 వద్ద ముగిసింది. ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 205.49 గాను, అలాగే 52 వారాల కనిష్ట ధర రూ. 145.87 లుగా ఉంది. గత ఏడాది కాలంలో ఈ కంపెనీ షేరు 28 శాతం లాభాన్ని తమ వాటాదారులకి అందించింది. ప్రస్తుతం ఈ బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ. 1,54,000 కోట్లుగా ఉంది.

ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ లిమిటెడ్ :

మిడ్ క్యాప్ కేటగిరికి చెందిన ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 1970 టార్గెట్ ప్రైజ్ ని ఇస్తున్నట్లు చందన్ తపారియా పెట్టుబడిదారులకి సూచించారు. అలాగే ఈ షేరుకు రూ. 1800 స్టాప్ లాస్ ని కూడా చందన్ తపారియా అందించడం జరిగింది. చివరి ట్రేడింగ్ సెషన్ లో ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ లిమిటెడ్ షేరు ధర 2 శాతం లాభపడి రూ. 1859.80 వద్ద ముగిసింది. ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 1871.80 గాను, అలాగే 52 వారాల కనిష్ట ధర రూ. 589 లుగా ఉంది. గత ఏడాది కాలంలో ఈ కంపెనీ షేరు 197 శాతం లాభాన్ని తమ వాటాదారులకి అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 73,770 కోట్లుగా ఉంది.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ :

లార్జ్ క్యాప్ కేటగిరికి చెందిన లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 2600 టార్గెట్ ప్రైజ్ ని ఇస్తున్నట్లు చందన్ తపారియా పెట్టుబడిదారులకి సూచించారు. అలాగే ఈ షేరుకు రూ. 2380 స్టాప్ లాస్ ని కూడా చందన్ తపారియా అందించడం జరిగింది. చివరి ట్రేడింగ్ సెషన్ లో లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ షేరు ధర 3.4 శాతం లాభపడి రూ. 2454 వద్ద ముగిసింది. ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 2480 గాను, అలాగే 52 వారాల కనిష్ట ధర రూ. 917.95 లుగా ఉంది. గత ఏడాది కాలంలో ఈ కంపెనీ షేరు 145 శాతం లాభాన్ని తమ వాటాదారులకి అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 1,32,000 కోట్లుగా ఉంది.

పండుగ తరువాత తగ్గిన ధరలు



కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు మధ్యలో ఒక రోజు మాత్రం భారీగా తగ్గి మళ్ళీ ఈరోజు తగ్గడం జరిగింది. దీనిలో భాగంగా ఈరోజు 22 క్యారెట్ల ఒక గ్రాము బంగారం ధర ఏకంగా రూ. 45 తగ్గి రూ. 13,210 వద్ద ట్రేడ్ అవుతూ ఉండగా మరొకవైపు ఒక గ్రాము వెండి ధర కూడా రూ. 5 తగ్గి రూ. 205 వద్ద ట్రేడ్ అవుతుంది. ఇటీవల బంగారం ధర పెరగడంతో దానిని ఇప్పుడు విక్రయించడంతో పసిడికి డిమాండ్ తగ్గి ఈరోజు బంగారం ధరలు తగ్గడం జరిగింది.

10-11-2026న బంగారం ధరలు తగ్గడం జరిగింది. గత కొన్ని రోజుల నుంచి పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు మధ్యలో ఒక రోజు భారీగా తగ్గి మళ్ళీ ఈరోజు తగ్గడం విశేషం. దీనిలో భాగంగా ఈరోజు 1 గ్రాము 22k బంగారం ధర రూ. 45 తగ్గి రూ. 13,210 వద్ద ట్రేడ్ అవుతూ ఉండగా మరొక వైపు ఒక గ్రాము వెండి ధర కూడా రూ. 5 తగ్గి రూ. 205 వద్ద ట్రేడ్ అవుతుంది. దీపావళి పండుగ తరువాత బంగారం ధరలు మళ్ళీ తగ్గడంతో బంగారం కొనాలనుకునే వారికి మంచి వార్త అని చెప్పవచ్చు.

భారత మార్కెట్ల వైపే గ్లోబల్ దిగ్గజాల చూపు!

గ్లోబల్ బ్రోకరేజ్ దిగ్గజాలు సిటీగ్రూప్, హెచ్ఎస్‌బీసీ, జెఫరీస్ భారత మార్కెట్లపై బుల్లిష్‌గా మారాయి. పడిపోతున్న చమురు ధరలు, కార్పొరేట్ లాభాల వృద్ధి నేపథ్యంలో సిటీగ్రూప్ నిఫ్టీ 50 లక్ష్యాన్ని 28,000గా నిర్దేశించింది. హెచ్ఎస్‌బీసీ భారత్‌కు 'ఓవర్‌వెయిట్' రేటింగ్ ఇవ్వగా, జెఫరీస్ తన పోర్ట్‌ఫోలియోలో భారత్ వాటాను 14 శాతానికి పెంచి కొరియా, తైవాన్‌లకు కోత పెట్టింది.



ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి రాజ్యమేలుతున్న వేళ భారత ఈక్విటీ మార్కెట్లకు భారీ ఊరట లభించింది. అంతర్జాతీయ దిగ్గజ బ్రోకరేజ్ సంస్థలైన సిటీగ్రూప్, హెచ్ఎస్‌బీసీ, జెఫరీస్ మన మార్కెట్లపై తమ అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు మెరుగుపడటం, క్రూడ్ ఆయిల్ ధరలు దిగిరావడం, విదేశీ నిధుల ప్రవాహం మళ్లీ పుంజుకోవడమే ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

భారత్‌కు హెచ్ఎస్‌బీసీ 'ఓవర్‌వెయిట్' రేటింగ్

ఇన్నాళ్లూ భారత్‌పై 'న్యూట్రల్' వైఖరితో ఉన్న హెచ్ఎస్‌బీసీ హోల్డింగ్స్, తాజాగా తన రేటింగ్‌ను 'ఓవర్‌వెయిట్' స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది. ఆసియా మార్కెట్లలో కృత్రిమ మేధ (AI) ఆధారిత స్టాక్స్ చుట్టూ తీవ్ర హెచ్చుతగ్గులు నెలకొన్న నేపథ్యంలో భారత్ ఒక సురక్షిత స్వర్గధామంలా మారిందని సంస్థ స్పష్టం చేసింది. తన లేటెస్ట్ నోట్‌లో సంస్థ స్పందిస్తూ.. "ఆసియా మార్కెట్లలో ఏఐ స్టాక్స్ ఆధిపత్యం నడుస్తున్న వేళ, భారత్ అద్భుతమైన దైవ ర్సిఫికేషన్ ఇస్తూ అతి తక్కువ ఒడిదుడుకులను నమోదు చేస్తోంది" అని పేర్కొంది. ముఖ్యంగా బ్యాంకింగ్, పారిశ్రామిక రంగాలు, కన్స్యూమర్ డిస్క్రిషనరీ, ఇన్సూరెన్స్, హాస్పిటల్ రంగాల్లో మంచి వృద్ధి కనిపిస్తుందని సంస్థ అంచనా వేసింది.

నిఫ్టీ లక్ష్యం 28,000: సిటీగ్రూప్ లెక్కలు

సిటీగ్రూప్ అయితే మరో అడుగు ముందుకేసి 2027 నాటికి నిఫ్టీ 50 సూచీ 28,000 మార్కును తాకుతుందని జోస్యం చెప్పింది. ప్రస్తుత స్థాయిల నుంచి చూస్తే ఇది దాదాపు 12 శాతం అప్‌సైడ్ ర్యాలీ. రాబోయే 2026-28 ఆర్థిక సంవత్సరాల్లో నిఫ్టీ కంపెనీల ఈపీఎస్ (EPS) వృద్ధి వార్షికంగా 15 నుంచి 16 శాతంగా నమోదవుతుందని సిటీగ్రూప్ లెక్కగట్టింది. క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 10 డాలర్లు తగ్గితే, మన నిఫ్టీ ఈపీఎస్‌కు సుమారు 2 శాతం మేర అదనపు లాభం సమకూరుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

భారత్‌కు పెరిగిన వాటా.. ఇతరులకు కత్తెర

గ్లోబల్ ఇన్వెస్టుమెంట్ ఫర్మ్ జెఫరీస్ సైతం ఆసియా-పసిఫిక్ (ఎక్స్-జపాన్) పోర్ట్‌ఫోలియోలో భారత్ వెయిటేజీని 12 శాతం నుంచి 14 శాతానికి పెంచేసింది. ఇదే సమయంలో సౌత్ కొరియా, తైవాన్ దేశాల కేటాయింపుల్లో ఒక్కో శాతం కోత విధించి 'అండర్‌వెయిట్' జాబితాలో చేర్చింది. మార్కెట్లు కోలుకుంటున్న తాజా ర్యాలీలో ఇప్పటికే విదేశీ ఇన్వెస్టర్లు (FIIs) దాదాపు 4 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. విదేశీ యాక్టివ్ ఫండ్‌లు భారత్‌కు ఇచ్చే కేటాయింపుల్లో ఒక్క శాతం పెరుగుదల నమోదైనా, మన మార్కెట్లలోకి సుమారు 12 బిలియన్ డాలర్ల తాజా పెట్టుబడులు వెల్లువెత్తే ఆస్కారం ఉందని సిటీగ్రూప్ స్పష్టం చేసింది. అక్టోబర్ 23 నుంచి సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ 10.8 శాతం లాభపడగా, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం 8 శాతం వరకు పురోగమించి ఇన్వెస్టర్లలో నూతనోత్సాహాన్ని నింపాయి.

AI రేసులో భారత్ 3వ ర్యాంక్



ప్రపంచాన్ని శాసిస్తున్న కృత్రిమ మేధ (AI) రేసులో భారత్ తనదైన ముద్ర వేస్తోంది. మన దేశంలో అత్యంత అధునాతన ఏఐ చిప్‌లను తయారు చేయకపోవచ్చు, భారీ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (LLMs) నిర్మాణంలో అగ్రరాజ్యాలతో పోటీ పడకపోవచ్చు. కానీ, గ్లోబల్ టెక్ రంగాన్ని నడిపించే తిరుగులేని వ్యవస్థ మన చేతుల్లో ఉంది. స్టాన్‌ఫోర్డ్ విడుదల చేసిన తాజా గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ ర్యాంకింగ్స్‌లో యూకే, జపాన్, దక్షిణ కొరియా లాంటి సాంకేతిక దిగ్గజ దేశాలను వెనక్కి నెట్టి భారత్ ప్రపంచంలోనే మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంపై ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా వ్యక్తం చేసిన విశ్లేషణ ఇప్పుడు అంతర్జాతీయ ఇన్వెస్టర్ల ఆలోచనలను సైతం మార్చేస్తోంది.

స్మార్ట్‌ఫోన్ విప్లవమే దీనికి ఉదాహరణ

ప్రస్తుత పరిస్థితిని ఆనంద్ మహీంద్రా గతంలో వచ్చిన స్మార్ట్‌ఫోన్ విప్లవంతో పోల్చారు. ఆపిల్ లేదా గూగుల్ వంటి సంస్థలు ఫోన్లను, వాటి ఓఎస్‌లను ఒక ప్లాట్‌ఫామ్‌గా మాత్రమే అందించాయి. కానీ అసలైన వ్యాపార విప్లవాన్ని, విలువను సృష్టించింది మాత్రం వాటిపై వచ్చిన వివిధ అప్లికేషన్లే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనూ రాబోయే రోజుల్లో ఇదే జరగనుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల నాటి ప్రసిద్ధ నినాదాన్ని ప్రస్తావిస్తూ ఆయన "ఇట్స్ ది ఎకోసిస్టమ్, స్టూపిడ్!" అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రాథమిక మోడల్స్ కంటే, వివిధ రంగాల సమస్యలను పరిష్కరించే డొమైన్ అప్లికేషన్లు, వ్యాపార సంస్థల్లో వీటి విస్తృత వినియోగమే అసలైన ఆర్థిక విస్ఫోటనానికి దారితీస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

మనకున్న తిరుగులేని 3 బలాలు

భారతదేశానికి ప్రధానంగా మూడు అంశాలు అదనపు బలాన్ని ఇస్తున్నాయని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దశాబ్దాలుగా గ్లోబల్ సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది సాంకేతిక నిపుణులు మన వద్ద ఉన్నారు. రెండోది, వివిధ సిస్టమ్‌లను ఏకీకృతం చేసే (Systems Integration) విశేష నైపుణ్యం మన ఐటీ పరిశ్రమ సొంతం. వివిధ కంపెనీలు తాము వాడుతున్న పాత సాఫ్ట్‌వేర్‌లలోకి సరికొత్త ఏఐ టూల్స్‌ను అనుసంధానించాలంటే ఈ సామర్థ్యమే అత్యంత కీలకం.

స్టాక్ మార్కెట్లకు దీర్ఘకాలిక బూస్ట్

విదేశీ ఇన్వెస్టర్లు భారత ఈక్విటీ మార్కెట్లను కేవలం ఏఐ హైప్ లేని సురక్షిత ప్రాంతంగా మాత్రమే మూడటం లేదని, భారత్‌కు సొంతంగా బలమైన అవకాశాలు ఉన్నాయని మహీంద్రా స్పష్టం చేశారు. "గ్లోబల్ మార్కెట్లలో చిప్ కొరత లేదా వాల్యుయేషన్ల ఆందోళనలు ఉన్నప్పటికీ, భారతదేశ సర్వీస్ ప్రొవైడర్లకు డొమైన్-స్పెసిఫిక్ ఏఐ డిప్లాయ్‌మెంట్స్ ద్వారా సుదీర్ఘకాలం వ్యాపార వృద్ధి లభించే అవకాశం ఉంది" అని మార్కెట్ రీసెర్చ్ నిపుణులు స్పష్టం చేశారు. భారత ఐటీ సత్తా, అప్లికేషన్ ఎకోసిస్టమ్ కలగలిసి మన ఆర్థిక వ్యవస్థకు మరింత బలమైన ఊపునివ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం
singidinews@gmail.com
బుధవారం 11-11-2026

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయకుమార్



నారాయణపేట, నవంబర్ 10, (సింగిడి):
నారాయణపేట గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో విజయ్ కుమార్ అధ్యక్షతన జరగగా శాఖ గ్రంథాలయాలకు వైట్ వాష్ ఫర్నిచర్ మరమ్మతులు మరియు శాఖ గ్రంథాలయ భవనాలకు మరమ్మత్తులు పలు అభివృద్ధి పనులకు తిర్మానం చేశారు. కోస్గిలో కొత్త గ్రంథాలయ భవనం తొందరలో పూర్తి అవుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జిల్లా కోఆర్డినేషన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

పరీక్షా కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు



ధర్మపురి , నవంబర్ 10 (సింగిడి):
మండల కేంద్రంలోని చైతన్య డిగ్రీ కళాశాల, శ్రీ లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల పరీక్షా కేంద్రాల్లో శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతు న్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో విశ్వవిద్యాలయం షెడ్యూలు మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు లింగమూర్తి, డాక్టర్ జి. ప్రభాకర్ తెలిపారు.ఈ క్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ పి. రాజు, కె. కృష్ణ రెండు పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహిస్తున్నందుకు చీఫ్ సూపరింటెండెంట్లను అభినందించారు.పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు విజిటర్స్ రిజిస్టర్‌లో తమ అభిప్రా యాలను లిఖితపూర్వకంగా నమోదు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు పేర్కొన్నారు.

5,063 ఓట్లపై ఇంటింటి సర్వేకు నిర్ణయం



వైరా నవంబర్ 10 (సింగిడి):
ఓటర్ల జాబితాలోని తప్పులను గుర్తించి, వాస్తవ ఓటర్ల వివరాలను నమోదు చేసేందుకు వైరా మున్సిపాలిటీ పరిధిలో మరోసారి ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. జాబితాలో నమోదైన 5,063 ఓట్లపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టేం వైరా మున్సిపల్కు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.ఈ మేరకు వైరా మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులు సమావేశమై సర్వే నిర్వహణపై చర్చించారు. ఓటర్ల జాబితాలో నమోదై ఉండి మరణించిన వారు ఎంతమంది, ఇతర ప్రాంతాలకు నివాసం లేదా ఓటు బదిలీ చేసుకున్నవారు ఎంతమంది అనే వివ రాలను ఇంటింటికీ వెళ్లి సేకరించాలని నిర్ణయించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్ర మంలో భాగంగా ప్రతి ఓటు వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, తహసీల్దార్ సురేష్, ఎన్నికల డీటీ, మున్సిపల్ అధికారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నియామకాలపై ఫిర్యాదు



చేవెళ్ల, నవంబర్ 10 (సింగిడి):
రేషన్ డీలర్‌షిప్ నియామకంలో అక్రమాలు జరిగాయని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నాలుగు గ్రామాల అభ్యర్థులు కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర ఐఏఎస్ కలిసి వినతిపత్రం అందజే శారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని
గుండాల, కౌకుంట్ల, చిన్న మంగళారం, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన అభ్యర్థులు ఈ వినతి పత్రం అందజేశారు. గత రెండు నెలలుగా చేవెళ్ల ఆర్డీవో కార్యాలయ ప్రజావాణిలో, కలెక్టర్ కార్యాలయ ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని, ఆర్టీఐ ద్వారా సమాచారం కోరామని వారు తెలిపారు. ఇప్పటివరకు ఎక్కడ ఫిర్యాదు చేశారో వాటికి సంబంధించిన పత్రాలను ఆధారాలతో సహా జతపరిచి కమిషనర్ అందజేశారు.ప్రశ్నాపత్రం లీకైందనే అనుమానం ఉందని, పరీక్ష అనంతరం మెరిట్ లిస్టు ప్రకటించలేదని, ఇంటర్వ్యూ మెరిట్ లిస్టు కూడా వేయలేదని, పరీక్ష హాల్లో ప్రశ్నాపత్రాన్ని సీల్డ్ కవర్ లేకుండా ఇచ్చారని వారు కమిషనర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సమస్యను పరిశీలిస్తామని కమిషనర్ గారు తెలిపారు..ఈ కార్యక్రమంలో గుండాల గ్రామానికి చెందిన సౌజన్య, చిన్న మంగళారం గ్రామానికి చెందిన సాయికుమార్, వెంకటాపూర్ గ్రామానికి చెందిన ప్రభులింగం, కౌకుంట్ల గ్రామానికి చెందిన కె. సత్యనారాయణ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు ఉన్నారు..

భారీగా పట్టభద్రుల దరఖాస్తులు

- ★ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6.70 లక్షలు దాటిన ఫారం-18 దరఖాస్తులు
- ★ సూర్యాపేట జిల్లాలో గత ఉప ఎన్నికలతో పోలిస్తే 43.7 శాతం అధికం
- ★ ఇప్పటివరకు 2.52 లక్షలే ఆమోదం.. 4.05 లక్షలు పెండింగ్



సూర్యాపేట ప్రతినిధి (సింగిడి):
వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుకు విశేష స్పందన లభిస్తోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఫారం–18 దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని 12 జిల్లాల నుంచి ఇప్పటివరకు 6,70,407 దరఖాస్తులు అందాయి. ముఖ్యంగా సూర్యాపేట జిల్లాలో గత ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఓటర్ల సంఖ్య కంటే ప్రస్తుతం వచ్చిన దరఖాస్తులు 43.7 శాతం అధికంగా ఉండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. అయితే అందిన దరఖాస్తులన్నీ ఇంకా ఓటర్లుగా నమోదైనట్లు కాదు. అర్హతల పరిశీలన అనంతరమే తుది ఓటరు జాబితాలో చోటు దక్కనుంది.గత ఎన్నికలతో పోలిస్తే పెరిగిన దరఖా స్తులు2024 మేలో జరిగిన వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సమయంలో నియోజకవర్గ పరిధిలో 4,63,839 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,36,013 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంత కుముందు 2021లో జరిగిన ఎన్నికల సమయంలో ఇదే నియోజకవర్గ పరిధిలో 5,05,565 మంది ఓటర్లు నమోదయ్యారు. 2024 ఉప ఎన్నికల నాటికి ఈ సంఖ్య తగ్గింది. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం దరఖాస్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో కొత్తగా నమోదయ్యే పట్టభద్రుల ఓటర్ల సంఖ్యపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.సూర్యాపేటలో 43.7 శాతం అధికంసూర్యాపేట జిల్లాలో 2024 ఉప ఎన్నికల సమయంలో 51,497 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 74,012 ఫారం–18 దరఖాస్తులు అందాయి. గత ఉప ఎన్నికల ఓటర్ల సంఖ్యతో పోలిస్తే 22,515 దరఖాస్తులు అధికంగా వచ్చాయి. అంటే 43.7 శాతం పెరుగుదల నమోదైంది. అయితే వీటిలో ఇప్పటివరకు 25,535 దరఖాస్తులు మాత్రమే ఆమోదం పొందాయి. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. దీంతో వచ్చిన దరఖాస్తుల్లో ఎంతమంది అర్హత సాధించి తుది ఓటరు జాబితాలో చోటు దక్కించుకుంటార న్నది ఆసక్తికరంగా మారింది.4.05 లక్షల దరఖా స్తులు పెండింగ్ఉమ్మడి జిల్లా నియోజకవర్గ పరిధిలో మొత్తం 6,70,407 దరఖాస్తులు అందగా, వీటిలో 6,69,581 ఆన్‌లైన్, 826 ఆఫ్‌లైన్ ద్వారా వచ్చాయి. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 2,51,854, ఆఫ్‌లైన్‌లో 583 కలిపి మొత్తం 2,52,437 దరఖాస్తులు ఆమోదం పొందాయి. ఆన్‌లైన్‌లో 12,772, ఆఫ్‌లైన్‌లో 10 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 4,05,187 దరఖాస్తులు వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తుల పరిశీలన పూర్తి కావాల్సి ఉంది.రాజకీయ పార్టీల్లో పెరిగిన ఆసక్తిపట్టభద్రుల ఓటరు నమోదుకు భారీ స్పందన రావడంతో రాజకీయ పార్టీల నాయకులు ఈ పరిణామాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లాలో గత ఉప ఎన్నికల ఓటర్ల సంఖ్యను మించి దరఖాస్తులు రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే దరఖాస్తుల సంఖ్య పెరగడమే ఎన్నికల ఫలి తాలను నిర్ణయించదు. వాటిలో అర్హులైన పట్టభద్రుల దరఖాస్తులు ఎన్ని? తుది ఓటరు జాబితాలో ఎంత మందికి చోటు దక్కుతుంది? వారిలో ఎంతమంది పోలింగ్‌లో పాల్గొంటారు? అన్న అంశాలే కీలకం కానున్నాయి. తుది ఓటరు జాబితా విడుదలైన తర్వాతే ఎన్నికల సమీకరణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మల్లేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

మీటర్ రీడర్ల టెండర్ లో జీఓ 60 ప్రస్తావన తొలగింపుపై ఉద్యోగుల ఆగ్రహం..
డిమాండ్లు పరిష్కరించకుంటే జలమండలి బోర్డు ముట్టడిస్తాం
తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 10(సింగిడి):
జలమండలిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్య లను పరిష్కరించాల్సిన అధికారులు, హామీలతో కాలయాపన చేస్తూ కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) తీవ్రస్థాయిలో మండిప డింది. అధికారుల నిర్లక్ష్యం, ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థి తుల్లో ఉద్యోగుల ప్రాణాలు కోల్పోయే దుస్థితి నెల కొందని ఆవేదన వ్యక్తం చేసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మరణాలకు కారణమైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసింది. ఇటీవల మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మల్లేష్ కుటుంబానికి తక్షణమే తగిన నష్టపరిహారం చెల్లించడంతో పాటు, ఆయన కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి విషాదకర పరిస్థితులు ఎదురవుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు జలమండ లిలో మీటర్ రీడర్ల కోసం తాజాగా రూపొందించిన టెండర్ నిబంధనల్లో జీఓ నంబర్ 60 ప్రకారం అమలులో ఉన్న ఔట్‌సోర్సింగ్ విధానానికి సంబం ధించిన ప్రస్తావనను తొలగించడంపై జేఏసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జీఓ 60లోని ఔట్‌సో ర్సింగ్ అంశాన్ని టెండర్‌లో స్పష్టంగా పొందుపరచ కుండా ఉద్యోగులను అభద్రతలోకి నెట్టడం ఎంతవ రకు సమంజసమని ప్రశ్నించింది. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న ఉద్యోగులకు కొత్త టెండర్ విధానం మరింత ఇబ్బందికరంగా మారు తోందని పేర్కొంది. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు వాటిని అమలు చేయకపోగా, ఉన్న సమస్యలకు అదనంగా కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని జేఏసీ నాయకులు



విమర్శించారు. ఉద్యోగుల ఉపాధి భద్రత, సంక్షేమం, న్యాయమైన హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, అధ్యక్షుడు పులి లక్ష్మయ్య, రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. మల్లేష్ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, మీటర్ రీడర్ల కొత్త టెండర్‌లో జీఓ 60 ఔట్‌సోర్సింగ్ విధానాన్ని వెంటనే స్పష్టంగా పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే జలమం డలి బోర్డును ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అధికారులను హెచ్చరించారు.

సొంత నిధులతో నీటి కష్టాలు తీర్చిన సర్పంచ్

చేవెళ్ల, నవంబర్ 10 (సింగిడి):
చేవెళ్ల మండలం నాంచెరి గ్రామంలో తాగునీటి కొరతతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ అశోక్, సొంత నిధులతో బోరు వేయించి గ్రామస్తులకు తాగునీటి వసతి కల్పించారు.
గత కొంతకాలంగా గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో మహిళలు, వృద్ధులు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని గమనించిన సర్పంచ్ అశోక్, ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా తన సొంత ఖర్చుతో బోరు వేయించి, గ్రామానికి తాగునీరు అందించారు.బోరు నుంచి నీరు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పట్ల సర్పంచ్ చూపిన చొరవ, సొంత నిధులతో ముందుకు వచ్చి సేవ చేయడం ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలు స్తుందని గ్రామస్తులు కొనియాడారు..ఈ కార్యక్ర మంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సేవా దృక్పథం మరువలేనిది



నారాయణపేట, నవంబర్ 10, (సింగిడి):
ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో అర్నాబ్ తూఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తుఫాను ప్రభావం తో విద్యుత్ పోల్స్ విరిగిపోయి అక్కడి గ్రామాలు చీకటితో ఉన్నందున తెలంగాణ రాష్ట్రం నారాయణపేట సర్కిల్ నుండి వెళ్ళి విద్యుత్ ఏ.ఈ. లు నాగశేఖర్ రెడ్డి (డి.పి.) , కన్స్ట్రక్షన్ ఏ.ఈ. బాసాదయ్ లు వీరి వెంబడి కాంట్రాక్టర్ కృష్ణ మరో 23 మంది కార్మికులు వెళ్ళి పునరుద్ధరణ పనులు చేసి నందున నారాయణపేట సర్కిల్ తరపున సూప రింటెండెంట్ ఇంజనీర్ బి.నవీన్ కుమార్ ఆధ్వర్యంలో శాలువా, సర్టీఫికెట్ తో సన్మాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ. నవీన్ కుమార్ మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రక్క రాష్ట్రం ప్రజలు ఇబ్బందులతో ఉన్నప్పుడు మానవతా దృక్పథంతో పై అధికారుల ఆదేశం మేరకు ఇక్కడి నుండి నారాయణ పేట సర్కిల్ తరపున అక్కడ ప్రజలకు కరెంటు సరఫరా అందించేందుకు వెళ్ళిన సిబ్బందికి అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆపరేషన్ డి.ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రతి రోజు పునరుద్ధరణ పనుల్లో కార్మికులు మంచిగా పని చేసి అక్కడి ప్రజల మన్ననలు పొందటం మన రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. ప్రతి ఉద్యోగి తన విధినిర్వహణలో ప్రకృతి విపత్తులో పాల్గొనటం పూర్వజన్మ సుకృతం అని డి.ఈ.టి. సభావత్ రాజు నాయక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.డి. ప్రదీప్ కుమార్, ఏఈ మహేష్ గౌడ్, రూరల్ ఏఈ సాయినాథ్ రెడ్డి, ఏ.ఈ.టి. వెంకటకృష్ణ రెడ్డి, సతీష్, జె.ఏ.ఓ. గోవర్ధన్ , సర్కిల్, ఈ.ఆర్.ఓ. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డంకి!

*దాతల సాయం కోసం అమీనాబాద్ విద్యార్థి ఎదురుచూపు



సూర్యాపేట ప్రతినిధి(సింగిడి):
ప్రతిభ ఉన్నా పేదరికం వెంటాడుతోంది.. కష్టపడి సాధించిన సీటులో చదువుకోవాలన్న ఆశకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారాయి. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన వెంపటి సాయి ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులో ఉచిత సీటు సాధించాడు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో చదువు కొనసా గించడం కష్టంగా మారింది.సాయి తండ్రి అంజయ్య టాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా.. తల్లి కూలీ పనులకు వెళ్తోంది. రోజువారీ కూలీతోనే కుటుంబం గడుస్తోంది. ఈ పరిస్థితుల్లో చదువుకు అవసరమైన ఫీజులు, పుస్తకాలు, ఇతర ఖర్చులు భరించడం కుటుంబా నికి భారంగా మారింది. ఎంతో కష్టపడి సాధించిన సీటును ఆర్థిక కారణాలతో వదులుకోవాల్సి వస్తుందేమోనని సాయి ఆవేదన చెందుతున్నాడు.ఉన్నత చదువులు పూర్తి చేసి జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతో ఉన్న సాయికి దాతలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రతిభావంతుడైన నిరుపేద విద్యార్థి చదువు ఆగకుండా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు ఎలక్టోరల్ లిటరసీ పోటీలు

వైరా, నవంబర్ 10(సింగిడి):
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 11న వైరాలో నియోజకవర్గ స్థాయి ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ (ఈఎల్‌సీ) పోటీలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సిహెచ్ సురేష్ బాబు మంగళవారం పట్టణంలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఇప్పటికే ఈ నెల 7న వైరా నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో పాఠశాల స్థాయి పోటీలు నిర్వహించారని, వాటిలో ఎంపికైన విద్యార్థులు నియోజ కవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని వివరించారు. ఎన్నికల ప్రక్రియపై విద్యార్థుల్లో అవగాహన పెంపొం దించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడమే ఈ పోటీల ఉద్దేశమని తెలిపారు.

నూతన నియామకం

వలిగొండ, నవంబర్ 10 (సింగిడి):
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ అధికార ప్రతినిధిగా మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ఉద్యమకారుడు వంగాల వెంకన్న గౌడ్ నియమితులయ్యారు. ఆయన కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐలో పనిచేస్తూ ఉస్మానియా విశ్వవి ద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియ మించింది. టీపీసీసీ మీడియా, పబ్లిసిటీ విభాగం ఈ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వంగాల వెంకన్న గౌడ్ టీపీసీసీ నాయకులకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, ఉద్యమకారులు, గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీఓ అధికారులమంటూ బెదిరింపులు!

గద్వాల ప్రతినిధి నవంబర్ 10 (సింగిడి):
జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజక వర్గం అయిజ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామ రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు ఎండిపోతుండటంతో అయిజ పెద్దవాగు నుంచి ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తూ పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఈ క్రమంలో గత సోమవారం ఆర్టీఓ అధికారులమంటూ వచ్చిన కొందరు వ్యక్తులు నీటి ట్యాంకర్లను అడ్డగించి, రూ.1.50 లక్షల జరిమానా విధిస్తామని బెదిరించినట్లు రైతులు ఆరో పిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు కురువ మాణిక్యం, ఈ. ప్రవీణ్ గౌడ్ నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.10 వేల చొప్పున మొత్తం రూ.20 వేలు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. డబ్బులు తీసుకున్న వ్యక్తి నేమ్‌ప్లేట్‌పై శ్రీనివాస్ గౌడ్ అనే పేరు ఉందని పేర్కొన్నారు. డబ్బులు తీసుకున్నప్పటికీ ఎలాంటి రసీదులు ఇవ్వలేదని, ఫొటోలు తీస్తుండగా తమ మొబైల్ ఫోన్లు లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై విలేకరులు ఆర్టీఓ అధికారు లను ఫోన్‌లో వివరణ కోరగా, తాము అక్కడికి వెళ్ల లేదని, మహబూబ్‌నగర్ బృందం కూడా తనిఖీలు నిర్వహిస్తోందని సమాధానమిచ్చినట్లు తెలిపారు. తమ శాఖకు ఈ ఘటనతో సంబంధం లేదని పేర్కొంటూనే, ఆరోపణలకు ఆధారాలు చూపించా లని ప్రశ్నించినట్లు విలేకరులు వెల్లడించారు. అయితే, ఆర్టీఓ అధికారుల పేరుతో రైతులను బెదిరించి డబ్బులు వసూలు చేసింది ఎవరు? అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.
కలెక్టర్ జోక్యం చేసుకోవాలి
TG 09 VT/R 9668 నంబరు గల తెల్లటి బ్రీజా కారులో వచ్చిన వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపిం చాలని డబ్బులు తిరిగి ఇప్పించాలని తుపత్రాల రైతులు కోరుతున్నారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై నిజానిజాలు తేల్చి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశారు.పంటలను కాపాడుకునేందుకు నీటిని తర లించుకుంటున్న రైతులను ఇబ్బందులకు గురిచే యడం ఏమిటని, అసలే వర్షాలు లేక పంటలు ఎండిపోతూ ఇబ్బందులు పడుతున్న మాపై అధికా రుల ప్రతాపం ఏంటని స్థానిక రైతులు ప్రశ్నిస్తు న్నారు. తమకు న్యాయం జరిగేలా అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.



విద్యార్థినికి సన్మానం



చేవెళ్ళ నవంబర్ 10 (సింగిడి):
పట్టుదల, క్రమశిక్షణ ఉంటే గ్రామీణ విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో చేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి మండలం టంగుటూరు గ్రామానికి చెందిన ఆకంగళ్ళ రమణీ నిరూపించారు.శంకర్పల్లి మండలం టంగుటూరు గ్రామానికి చెందిన ఆకంగళ్ళ జంగయ్య కుమార్తె రమణీ దేశంలోనే పేరు గాంచిన ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ వృక్షశాస్త్రం (బోటనీ)లో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణ పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు.ఈ ఘన విజయం సందర్భంగా టంగుటూరులో ఆకంగళ్ళ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. యాదయ్య విచ్చేశారు. బంధువులు, గ్రామస్తులు రమణీని శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎం. యాదయ్య, డాక్టర్ సాయి సింధు, సామాజిక కార్యకర్త మర్వల్లి అశోక్, ఉపాధ్యాయుడు ఏ. నర్సింలు మాట్లాడుతూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని నిరంతర కృషి, పట్టుదల, అంకితభావంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రమణీ విజయం నిరూపిస్తోందన్నారు.రమణీ సాధించిన గోల్డ్ మెడల్ ఆమె వ్యక్తిగత విజయమే కాకుండా తల్లిదండ్రులకు, గురువులకు, కుటుంబ సభ్యులకు, గ్రామానికి, సమాజానికి గర్వకారణమని కొనియాడారు. ముఖ్యంగా విద్యార్థినులకు, యువతకు ఆమె విజయం స్ఫూర్తిదాయకమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధిస్తూ పరిశోధనా రంగంలో కూడా విశేష గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టంగుటూరు మాజీ సర్పంచ్ ఆకంగళ్ళ గోపాల్, ఉప సర్పంచ్ సత్తయ్య, ఎం. శంకరయ్య, ఎం. బాలయ్య, ఎం. హరిశ్రీవస్తవ్, ఏ. జంగయ్య, ఏ. అనితా దేవి తదితరులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



చింతపల్లి, నవంబర్ 10(సింగిడి):
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, తహసీల్దార్ విజయలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవక, బోరుబావులు అడుగంటిపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.40 వేలు, పత్తి పంటకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు కూడా ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరారు.గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, పశువులకు పశుగ్రాసం సరఫరా చేయాలని, రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనిదినాలు పెంచడంతో పాటు కూలి రేట్లు పెంచాలని కోరారు.నల్గొండ జిల్లాలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నందున జిల్లాను సంపూర్ణ కరువు ప్రభావిత జిల్లాగా ప్రకటించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలను రీషెడ్యూల్ చేసి వడ్డీ మాఫీ చేయాలని, నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్రావు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



చింతపల్లి, నవంబర్ 10(సింగిడి):
నల్గొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన 20 కుటుంబాలు బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) పార్టీలో చేరాయి. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నట్ప గిరిధర్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలకు చెందిన సభ్యులు కేటీఆర్‌ను కలుసుకుని బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన 20 కుటుంబాలు ఒకేసారి బీఆర్ఎస్‌లో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో కొలుకులపల్లి కొండల్, ఫయాజ్, చనమోని అంజయ్య, భాస్కరాచారి, నల్ల శంకర్, సిద్దే సాయికుమార్, ఆవుల సుధాకర్, ఊరే భాస్కర్, ఎండీ ఆసిఫ్, గురుకుల మహేష్, నాగరాజు, ముక్కాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ఆర్మూర్, నవంబర్ 10 (సింగిడి) :
విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగి గ్రామానికి, మండలానికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని స్థానిక తిమ్మాపూర్ సర్పంచ్ పుప్పాల నరేష్ కోరారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం రోజున అదే గ్రామంలో గల పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు, గ్రామస్తుల కు, రాజ్యాంగం కల్పించిన హక్కులు – బాధ్యతలు–రాజ్యాంగ విలువలు – పౌరుల సమానత్వం" అనే పలు అంశాలపై స్థానిక సర్పంచ్ పుప్పల నరేష్ అధ్యక్షతన ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి సర్పంచ్ (న్యాయవాది) పుప్పాల నరేష్ మాట్లాడుతూ,మనకు రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఎంతో ముఖ్యమైనవని, ఎట్టి పరిస్థితుల్లోనూ బాధ్యతలను విస్మరించకూడదని స్పష్టం చేస్తూ అవగాహన కల్పించారు. నేటి బాలబాలికలే,రేపటి భావి భారత పౌరులుగా ఉన్నత స్థాయికి ఎదగాలంటే, కేవలం రాజ్యాంగాన్ని అనుసరిస్తూ, క్రమశిక్షణతో మెదులుకోవాలని హిత బోధ చేశారు.మంచి నడవడికతో ఉన్నత చదువులు చదివి, భవిష్యత్తులో గొప్ప వ్యక్తులుగా తయారై తమకూ, తమ తల్లి దండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో దేశభక్తిని, సామాజిక స్పృహను పెంపొందించడంలో, ఎంతగానో దోహదపడుతుందని తెలియజేస్తూ, సదస్సును ముగించారు. సర్పంచ్ పుప్పాల నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుపాకుల సదానంద గౌడ్, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, కారోబార్, మండల విద్యాధికారి సమ్మిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాస నరేందర్, కారోబార్ సుదర్శన్, ఉపాధ్యాయుల బృందం సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోదావరి జలాల వృథాకు అడ్డుకట్ట

* దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో అడ్డుకట్ట



అశ్వాపురం, నవంబర్ 10 (సింగిడి):
గోదావరి జలాలను వృథాగా దిగువకు వెళ్లకుండా నిల్వ చేసుకొని, రాబోయే వేసవిలో తాగునీరు, సాగునీటి అవసరాలకు వినియోగించాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేపట్టిన సంకల్పం కార్యరూపం దాలుస్తోంది. అశ్వాపురం మండల పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా చేపట్టిన ఇసుక బస్తాల అడ్డుకట్ట పనులు వేగంగా కొనసాగుతున్నాయి.ఆనకట్టపై నుంచి గోదావరి జలాలు దిగువకు ప్రవహించకుండా నియంత్రించేందుకు ఇసుక బస్తాలతో తాత్కాలిక అడ్డుకట్ట నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు వరుసల ఇసుక బస్తాలను క్రమపద్ధతిలో పేర్చి నీటి ప్రవాహాన్ని కొంతమేర నియంత్రించేలా చర్యలు చేపట్టారు. పనులు పూర్తయిన కొద్దీ నీటి నిల్వ మరింత పెరిగే అవకాశం ఉంది.

ఏడు వరుసలతో నీటి నిల్వకు చర్యలు..
ప్రస్తుతం మూడు వరుసల ఇసుక బస్తాల ఏర్పాటు పూర్తికాగా, మిగిలిన పనులను కూడా వేగవంతం చేస్తున్నారు. మరో 15 రోజుల్లో మొత్తం ఏడు వరుసల ఇసుక బస్తాల ఏర్పాటు పూర్తి చేస్తామని పనుల్లో పాల్గొంటున్న కూలీలు వెల్లడిస్తున్నారు. ఇందుకోసం కార్మికులు నిరంతరం శ్రమిస్తూ ఇసుక బస్తాలను సిద్ధం చేయడం, వాటిని ఆనకట్టపై నిర్ణీత క్రమంలో పేర్చడం వంటి పనులు చేపడుతున్నారు.

వేసవి అవసరాలకు గోదావరి జలాలు..
ప్రతి సంవత్సరం వేసవిలో నీటి అవసరాలు పెరిగే నేపథ్యంలో గోదావరి జలాలను అందుబాటులో ఉన్న సమయంలోనే సాధ్యమైనంత మేర నిల్వ చేసుకోవడం కీలకంగా మారింది. ముఖ్యంగా తాగునీటి అవసరాలు, సాగునీటి వినియోగం, పరిసర ప్రాంతాల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గోదావరి జలాలను ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాలకు ఉపయోగించాలనే లక్ష్యంతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తీసుకున్న చొరవకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగుతున్నాయి.

స్థానికుల హర్షం
దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో అడ్డుకట్ట నిర్మాణం పూర్తయితే నీటి నిల్వ పెంపునకు మరింత అవకాశం ఏర్పడనుంది. ఇప్పటికే మూడు వరుసల ఏర్పాటు పూర్తవడం, మరో 15 రోజుల్లో ఏడు వరుసల పనులు పూర్తి చేస్తామని కూలీలు వెల్లడించడం ఈ కార్యక్రమం పురోగతిని తెలియజేస్తోంది. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునే దిశగా చేపట్టిన ఈ ప్రయత్నం విజయవంతమై రాబోయే వేసవిలో ప్రజలకు, రైతులకు ఎంతగానో ఉపయోగపడాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



మధిర, నవంబర్ 10(సింగిడి):
ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్లను మంజూరు చేయాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మధిర లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష ఇల్లు నిర్మించామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, మధిర నియోజకవర్గం లో నిజమైన నిరుపేదలకు ఇల్లు అందుతున్నాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కి చెందిన కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన పేదలను పక్కన పెడుతున్నారంటూ ఆరోపించారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలకు రాజకీయ రంగు లేదని, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, కెసిఆర్ కిట్, కల్యాణ లక్ష్మి , రైతుబంధు, రైతు భీమా, దళిత బంధు వంటి పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేశామని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గం లో ఇల్లు లేని నిరుపేదలు, ఒంటరి మహిళలు ఇంకా ఉన్నారని, వారికి ఇల్లు మంజూరు చేయకపోవడం బాధాకరమని అన్నారు. . ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభం



చేవెళ్ళ నవంబర్ 10 (సింగిడి):
చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలే యాదయ్య మాట్లాడుతూ షాబాద్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలనే గొప్ప సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు.
ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదని, ప్రతి పేద కుటుంబానికి అది ఒక భరోసా, ఒక గౌరవం, ఒక భవిష్యత్తు అని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు.ఈ మోడల్ హౌస్ ద్వారా ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల నమూనా, నిర్మాణ నాణ్యత, సౌకర్యాలను ప్రజలకు వివరించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ సర్పంచ్ గుండాల అశోక్, డిప్యూటీ సర్పంచ్, వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదాద్రి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఈశ్వరమ్మ



కొత్తగూడెం, నవంబర్ 10(సింగిడి):
పదవులు అలంకారప్రాయంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతలుగా భావిస్తూ.. నిరుపేదల కన్నీళ్లు తుడుస్తూ, మూగజీవాల సంరక్షణకు తన జీవితంలో ప్రత్యేక స్థానం కల్పిస్తూ ముందుకు సాగుతున్న సేవామూర్తి ఈశ్వరమ్మ యాదవ్. ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తున్న ఆమె సేవా ప్రస్థానానికి మరో కీలక గుర్తింపు లభించింది. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమితుల వడంతో పాటు, గోశాల నిర్వహణ బాధ్యతలు కూడా ఆమెకు అప్పగించారు.నిరుపేదల కుటుంబాల్లో ఒకరిగా.. కష్టాల్లో పెద్ద దిక్కుగా!హైదరాబాద్‌లోని పలు దేవాలయాలకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో తనదైన ముద్ర వేస్తున్న ఈశ్వరమ్మ యాదవ్.. పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నారు. పేద కుటుంబాల్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా, ఆ కుటుంబ సభ్యురాలిగానే భావించి తనవంతు సహాయ సహకారాలు అందించడం ఆమె సేవా గుణానికి నిదర్శనం. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు చేయూతనివ్వడం ద్వారా స్థానిక ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు.మూగజీవాల సంరక్షణే మరో ప్రధాన లక్ష్యం!మనుషుల సేవతో పాటు మూగజీవాల పట్ల కూడా అపారమైన ప్రేమ, బాధ్యత కలిగిన ఈశ్వరమ్మ యాదవ్.. ఎన్నో ఏళ్లుగా వాటి సంరక్షణ కోసం కృషి చేస్తున్నారు. మూగజీవాలకు రక్షణ కల్పించడం, గోసంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి కార్యక్రమాల పట్ల ఆమెకు ఉన్న నిబద్ధత ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ నేపథ్యంలోనే యాదాద్రి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియామకంతో పాటు గోశాల నిర్వహణ బాధ్యతలు లభించడం ఆమె సేవా ప్రస్థానానికి మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.ప్రజల కష్టసుఖాల్లో తోడుగా.. ప్రశంసలు అందుకుంటూ!హైదరాబాద్ ప్రాంత ప్రజలకు పెద్ద దిక్కుగా ఉంటూ, వారి కుటుంబాల్లో జరిగే శుభకార్యాల నుంచి కష్టసమయాల వరకు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తున్న ఈశ్వరమ్మ యాదవ్‌పై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. సేవ చేయాలనే సంకల్పం ఉంటే పదవులతో సంబంధం లేకుండానే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించవచ్చని ఆమె ప్రస్థానం చాటిచెబుతోంది. ఇప్పుడు యాదాద్రి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా, గోశాల నిర్వహణ బాధ్యతలతో ఆమెకు లభించిన అవకాశం మరింత మంది నిరుపేదలకు, మూగజీవాలకు సేవ చేసే వేదికగా నిలవనుంది. ఈ కొత్త బాధ్యతల్లోనూ మరిన్ని సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.ఘనంగా అభినందనలు.. యాదాద్రి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా, గోశాల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఈశ్వరమ్మ యాదవ్ తో పాటు ఆమె కుమారుడు పోచబోయిన కృష్ణ ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు, ఎంపీటీసీల సంఘం మాజీ అధ్యక్షురాలు కొల్లు పద్మ హైదరాబాద్‌లోని ఈశ్వరమ్మ యాదవ్ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొల్లు కొండలరావు, సంపత్ కుమార్, సంతోష్ కుమార్, రోహన్ తదితరులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ, గోసంరక్షణలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.
యాదాద్రి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా, గోశాల నిర్వహణ బాధ్యతలు చేపట్టే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులకు ఈశ్వరమ్మ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, దేవస్థానం అభివృద్ధికి, గోసంరక్షణకు అంకితభావంతో కృషి చేస్తానని ఆమె ఆకాంక్షించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ నిరుపేదలకు సేవ చేయడానికి ఈ పదవిని మరో అవకాశంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎల్ఓసీ అందజేత

కల్వకుర్తి నవంబర్ 11 (సింగిడి)
నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన గుంత శిరీష, ఆంజనేయులు దంపతుల కుమారుడు గుంత సాకేత్ మెరుగైన వైద్య చికిత్స పొందేందుకు రూ.6 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసీని ఎమ్మెల్యే మంజూరు చేయించారు.
హైదరాబాద్‌లోని తన నివాసంలో వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకు 6,00,000 ఆరు లక్షల రూపాయలు విలువైన ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన వైద్యం పొందలేని పేద కుటుంబాలకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు. ఎల్ఓసీ సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.
ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారికి అవసరమైన సమయంలో అండగా నిలవడాన్ని తన బాధ్యతగా భావిస్తానని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని
వెల్లడించారు.ఎల్ఓసీ అందుకున్న గుంత ఆంజనేయులు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచులు నర్సింలు, అజీజ్, నాయకులు ఏ. వెంకట్‌రెడ్డి, ఎం.డి. ఆరిఫ్, వద్దే రాజు, పులిజాల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశదీపోత్సవం



చిట్యాల , నవంబర్ 10 (సింగిడి):
కార్తిక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని మంగళవారం చిట్యాల పట్టణంలోని శివాలయంలో ఆకాశదీపాన్ని భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాత్రలో దీపాన్ని వెలిగించి, ధ్వజస్తంభం చివరి వరకు పైకి పంపి ఆకాశదీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆకాశదీపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరహర మహాదేవ, ఓం నమశ్శివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్తీక మాసం మొత్తం ప్రతిరోజూ సాయంత్రం ఆకాశదీపాన్ని వెలిగిస్తామని పురోహితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురోహితులు గోవింద్ శర్మ, బబ్లు శుక్లా, శ్రీ కనకదుర్గ దేవాలయ కమిటీ డైరెక్టర్ రుద్రారపు లింగయ్య, వేలుపల్లి రవీందర్, అన్నపూర్ణ, భక్తులు పాల్గొన్నారు.

నవంబర్ 21 వరకు ఓటరు నమోదుకు గడువు

చేవెళ్ల, నవంబర్ 10 (సింగిడి):
భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక తీవ్ర సవరణలో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో చోటు పొందని ఓటర్లకు మరో అవకాశం కల్పించింది.తెలంగాణలో అర్హులైన ఓటర్లు తిరిగి తమ ఓటు హక్కును పొందేందుకు వీలుగా గణన పత్రాలను సమర్పించేందుకు నవంబర్ 21 వరకు గడువు పొడిగించింది.
చేవెళ్ల శాసనసభ నియోజకవర్గ పరిధిలోని చేవెళ్ల మండలం. చేవెళ్ల పురపాలక సంఘం హాజరు కానివారు, మారినవారు, మరణించిన వారు, రెండుసార్లు నమోదైనవారి జాబితాలో మొత్తం 12,554 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించి వారిని ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు చేయలేదు. వీరిలో వాస్తవంగా జీవించి ఉండి, సంబంధిత చిరునామాల్లో నివసిస్తున్న ఓటర్లు తమ ఓటు హక్కును పునరుద్ధరించుకునేందుకు అవకాశం కల్పించడం జరిగింది.ఈ ప్రక్రియలో భాగంగా సంబంధిత ఓటర్లు కొత్తగా ఆరవ పత్రం సమర్పించాల్సిన అవసరం లేదు. గతంలో జారీ చేసిన గణన పత్రాన్ని తిరిగి పూర్తి చేసి, గతంలో ఎందుకు సమర్పించలేదో వివరాలు తెలియజేస్తూ ప్రకటనతో పాటు మారలేదని తెలిపే అనుబంధ పత్రం, మారినట్లు తెలిపే అనుబంధ పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాలి.ఓటర్లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్ర స్థాయి అధికారిని సంప్రదించి గణన పత్రాలను పొందవచ్చు. పూర్తి చేసిన పత్రాలను సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారి, సహాయక ఓటరు నమోదు అధికారి లేదా ఓటరు నమోదు అధికారి కార్యాలయంలో సమర్పించవచ్చు. అదే విధంగా నివాసం మారిన ఓటర్లు తమ ప్రస్తుత చిరునామా శాసనసభ నియోజకవర్గ పరిధిలోని పత్రాలలో ఓటరుగా నమోదు కావడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇప్పటికే ప్రత్యేక తీవ్ర సవరణలో ఆరవ పత్రం సమర్పించిన వారు మళ్లీ గణన పత్రం సమర్పించాల్సిన అవసరం లేదు.అర్హులైన ఓటర్లు తమ సమాచారం తెలుసుకునేందుకు పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాల ప్రకటన పలకలపై ప్రదర్శించడంతో పాటు, అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచడం జరిగింది. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని చేవెళ్ల మండలం మరియు చేవెళ్ల పురపాలక సంఘంలోని 12,554 మంది జాబితాలో ఉన్న ఓటర్లలో అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నవంబర్ 21వ తేదీలోగా తమ గణన పత్రాలను సమర్పించి ఓటు హక్కును పునరుద్ధరించుకోవాలని సహాయక ఓటరు నమోదు అధికారి, చేవెళ్ల తహసిల్దార్ మరియు చేవెళ్ల పురపాలక సంఘ కమిషనర్ కోరారు..మరిన్ని వివరాలకు. సహాయం కోసం సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులను సంప్రదించవచ్చని లేదా ఎన్నికల సంఘం సహాయ కేంద్ర సంఖ్య 1950 కు ఫోన్ చేయవచ్చని

ఘనంగా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబురాలు

- ఆకాశాన్ని అంటిన తారాజువ్వలు
- విద్యుత్ కాంతులతో కనువిందు చేసిన దుకాణాల సముదాయాలు
- తీరొక్క పూల సొగసులతో దర్శనమిచ్చిన ముఖాద్వారాలు





వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 10(సింగిడి): ప్రభుత్వం పిలుపుమేరకు ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమాన్ని జిల్లాలో నాయకులు, లబ్ధిదారులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గృహప్రవేశాలు నిర్వహించారు. దీపావళిని జరుపుకోవడంతో ఈ దీపావళిలో కొత్తదనం చోటుచేకుంది. ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులతో ఎమ్మెల్యే లు, మాజీ ఎమ్మెల్యే లు స్థానిక నాయకులు చేరుకుని దీపావళి సంబురాలను జరుపుకున్నారు. పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూర్ లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, డి సీ సీ అధ్యక్షుడు దారసింగ్, స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని దీపావళి సంబురాలు జరుపుకున్నారు. అదేవిధంగా జిల్లా ప్రజలు దీపావళి సంబురాలను అత్యంత నిష్ఠతో జరుపుకున్నారు. దీంతో వెలుగు జిలుగులతో పట్టణాలు, గ్రామాలు మెరిసి పోయాయి. పూల తొరణాలతో మురిసిపోయాయి. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు పండగను ఘనంగా ఆస్వాదించారు. చిన్నారులు కేరింతల మధ్య టపాసులు పేల్చి సంతోషించారు. వ్యాపారస్తులు ఆయా దుకాణాలను శుభ్రంచేసి ప్రత్యేకంగా లక్ష్మీ పూజలు నిర్వహించారు. చీకటిని పారద్రోళి మిరుమిట్లు గొలిపే ప్రమిదలల్లో దీపాల కాంతులు వెలుగును ప్రసరింపచేశాయి. పిండివంటల కమ్మటి వాసనలతో గుమ్మెత్తించాయి. బాణాసంచాలు ఆకాశం వైపు దూసుకుపోయాయి. అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో పండగను జరుపున్నారు. అతి పెద్ద పండగగా అంధకారంపై వెలుగు సాధించిన విజయానికి, చెడుపై మంచి పొందిన గెలుపునకు దీపావళి ప్రతీకగా ఈ దీపావళిని జిల్లా ప్రజలు జరుపుకున్నారు. ఈ పండగ వెనుక ఉన్న పౌరాణిక గాథలు భారతీయ సంస్కృతిలో దీపావళికి సంబంధించిన అనేక చారిత్రక, పౌరాణిక ఆధారాలు ఉన్నాయి. శ్రీరాముని అయోధ్య ప్రవేశం త్రేతాయుగంలో రావణాసురుడిని నరకాసుర వధ ద్వాపర యుగంలో లోకకంటకుడైన నరకాసురుడిని సత్యభామా సమేతంగా శ్రీకృష్ణుడు వధించిన దినం నరక చతుర్దశి దుష్ట శిక్షణకు ప్రతీకగా ఈ పండగను జరుపున్నారు. అదేవిధంగా లక్ష్మీ పూజ సముద్ర మథన సమయంలో క్షీరసాగరం నుంచి సంపదలకు అధిదేవత అయిన లక్ష్మీదేవి ఉద్భవించిన రోజు దీపావళి అని నమ్ముతారు. ఈ నేపథ్యంలో పూజల్లో నగదును ఉంచి లక్ష్మీదేవిని, గణేషుడిని ప్రత్యేకంగా పూజించారు. దీపావళి అనేది కేవలం ఒక రోజుతో ముగిసేది కాదు, ఐదు రోజుల పాటు సాగే మహా పండగగా జిల్లా ప్రజలు జరుపుకున్నారు. ధనతేరస్ మొదటి రోజు బంగారు, వెండి వస్తువులు లేదా కొత్త పాత్రలు కొనుగోలు చేయడం శుభప్రదంగా భావిస్తారు. రెండవ రోజు నరక చతుర్దశి తెల్లవారుజామునే అభ్యంగన స్నానాలు ఆచరించి, కొత్త బట్టలు ధరించి టపాకాయలు కాల్చారు. మూడవ రోజు దీపావళి అమావాస్య ఇళ్లన్నింటినీ దీపాలతో అలంకరించి, లక్ష్మీ పూజలు నిర్వహిస్తారు. ప్రధానమైన ఈ నేపథ్యంలో భావిస్తారు. నాల్గవ రోజు బలి పద్యమి గోవర్ధన పూజ గోవులను పూజించడం, అన్నకూట్ నైవేద్యాలు సమర్పించనున్నారు. ఐదవ రోజు భాయ్ దూజ్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని బలపరిచే పవిత్ర వేడుక. ఆంతర్యం అంతఃకరణ శుద్ధి దీపంలోని జ్యోతి ఎప్పుడూ పైకే చూపిస్తుంది. అది మనలోని ఉన్నతాశయాలను, జ్ఞానాన్ని సూచిస్తుంది. మట్టి ప్రమిదలో నూనె, వత్తి కలిసి వెలుగునిచ్చినట్లే, మనలోని అజ్ఞానమనే చీకటి తొలగిపోయి, జ్ఞానమనే వెలుగు ప్రసరించాలని ఈ పండగను నిర్వహించుకొనున్నారు. కులమతాలకు అతీతంగా అందరి ఇళ్లలోనూ సంతోషాన్ని పంచిన ఈ దీపావళి పండగ అందరి జీవితాల్లోనూ వెలుగులు నింపాలని పూజలు చేశారు.

కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో ఏసీబీ దాడి

- రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఎస్ఐ అరెస్టు..
- ఇటీవలే సీఐ.. తాజాగా ఎస్ఐ..
- ఒకే ఠాణాలో వరుస అవినీతి ఘటనలు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి): మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని కీసర పోలీస్‌స్టేషన్‌లో మరో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు చిక్కింది. రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎస్ఐ శ్రీనివాస్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఓకే పోలీస్ స్టేషన్ లో వరుసగా లంచం కేసులు వెలుగులోకి రావడం పోలీస్ శాఖలో కలకలం రేపుతోంది. వివరాల్లోకెళితే నాగారం పరిధిలోని శిల్పానగర్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ దాడి జరిగినట్లు సమాచారం. చీటింగ్‌తో పాటు వరకట్న వేధింపులకు సంబంధించిన కేసులో అరెస్టు వ్యవహారం, తదనంతరం అభియోగపత్రం దాఖలు చేసే విషయంలో బాధితుల నుంచి ఎస్ఐ శ్రీనివాస్ రూ. 5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. చివరకు రూ. 2 లక్షలు లంచంగా తీసుకునేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో సోమవారం నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి ఆయనను పట్టుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇటీవల ఇదే పోలీస్‌స్టేషన్‌లో సీఐ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఘటన మరువకముందే తాజాగా ఎస్ఐ కూడా పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. ఒకే పోలీస్‌స్టేషన్‌లో వరుసగా అవినీతి నిరోధక శాఖ దాడులు జరగడం పోలీసు శాఖలో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే లంచం ఆరోపణల్లో చిక్కుకోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

- చేవెళ్ళ ఎమ్మెల్యే యాదయ్య



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి): నిరుద్యోగులైన యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలని జీవితాల్లో స్థిరపడాలని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. జిల్లా పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలో శ్రీవేంకటేశ్వర రెస్టారెంట్ ను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, తదితర నాయకులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ యువత స్వయం ఉపాధితో జీవితాల్లో స్థిర పడటమే కాకుండా పలువురికి ఉపాధిని కూడా అందించడం అభినందనీయమని అన్నారు. వ్యాపారంలో మెలుకువలు పాటించాలని వ్యాపారంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నిరుద్యోగులు ప్రభుత్వం ఉద్యోగమే లక్ష్యంగా చేసుకుని దానికోసం ప్రయత్నిస్తూనే చిరు వ్యాపారం చేసుకోవాలని విలువైన సమయాన్ని వృథా చేయడం సముచితం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి, రావుగారి వెంకట్ రెడ్డి, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు బలవంత్ రెడ్డి, కొండల్ యాదవ్, మండల స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన తుమ్మల పాండురంగారెడ్డి

ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్ష



అమీన్‌పూర్, నవంబర్ 10(సింగిడి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరారు. సమాజంలో ద్వేషం, చీకట్లు తొలగిపోయి శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని, రైతాంగం, పేద వర్గాల జీవితాల్లో ఆనందం వెల్లివిరిసేలా పాలన సాగాలని ఆయన అభిలషించారు. ప్రజలంతా ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా, పర్యావరణాన్ని కాపాడుతూ కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని సూచించారు. అనంతరం అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. అమీన్‌పూర్ పురపాలక సంఘం పరిధిలోని ప్రజలందరికీ, అలాగే నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపాల పండుగ ప్రతి ఒక్కరి ఇంట ఆనందాల కాంతులు నింపాలని, కష్టాలన్నీ తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ప్రార్థించారు. అమీన్‌పూర్ పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని, ప్రజ లంతా సుఖసంతోషాలతో, శాంతియుతంగా జీవించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా చిన్నారులు, యువత బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ పరిధిలోని పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



రామచంద్రపురం, నవంబర్ 10(సింగిడి): ఓల్డ్ ఎంఐజీ ప్రాంతంలో రైల్వే విస్తరణ పనుల కారణంగా ఇళ్లు కోల్పోతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం తరపున పూర్తి అండగా ఉంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా ప్రత్యేక చొరవ చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి ఓల్డ్ ఎంఐజీలో దాదాపు 40 ఏళ్లుగా నివాసముంటున్న పేదలు రైల్వే విస్తరణతో గుడిసెలు కోల్పోతున్న వైనంపై పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో బాధితులు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా అక్కడే జీవనం సాగిస్తున్న నిరుపేదలు రైల్వే లైన్ల విస్తరణతో రోడ్డున పడే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వీరికి ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సానుకూలంగా స్పందిస్తూ.. ఏ ఒక్క పేద కుటుంబం నిరాశ్రయులు కాకుండా చూసే బాధ్యత తమపై ఉందని, ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అర్హులైన బాధితులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, సీనియర్ నాయకుడు భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

పండుగలు... ఐకమత్యానికి హేతువులు

చెడుపై మంచి సాధించిన విజయమే దీపావళి

మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



జవహర్‌నగర్, నవంబర్ 10(సింగిడి): పండుగలు ఐకమత్యానికి హేతువులని చెడుపై మంచి సాధించిన సంఘటనే దీపావళి పండుగ అని మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ బిఆర్ఎస్ శ్రేణులు దీపావళి పండుగను పురస్కరించుకొని సోమవారం మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా జవహర్ నగర్ బిఆర్ఎస్ శ్రేణులతో మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ పండుగలు ఐకమత్యానికి హేతువులని చెడుపై సాధించిన విజయానికి గుర్తుగానే దీపావళి పర్వదినాన్ని యావత్ భారత పౌరులు జరుపుకుంటారని తెలిపారు. అనంతరం ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న కల్కి గ్రాండ్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి జవహర్ నగర్ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ మల్లారెడ్డికి ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు ఆలూరి రాజశేఖర్, సింగన బాలరాజు పటేల్, రెడ్డి శెట్టి మహేష్ గుప్తా, మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, విలాసాగర్ రవి, బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి): మూడు రోజులుగా వికారాబాద్ జిల్లాలోని సీ ఎం రేవంత్ రెడ్డి ప్రాతినిద్యం వహిస్తున్న కొడంగల్ లో ఆయా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాళ్లు, శంకుస్థాపణలు నిర్వహించిన నేపథ్యంలో సీ ఎం ను చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య కలిసి పలు విషయాలు చర్చించారు. నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై వారు ముచ్చటించారు.

ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించండి

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రెవెన్యూ అధికారి మాలతి ఆదేశం



మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 10(సింగిడి): ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రెవెన్యూ అధికారి మాలతి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రెవెన్యూ అధికారి మాలతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ,హౌజింగ్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 50 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు డిఆర్ఓ తెలిపారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఎంతో వ్యయ ప్రయాసలతో వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు బాధ్యతాయుతంగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని, సానుకూలంగా వారితో వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలివెళ్ళిన నాయకులు కార్యకర్తలు

- మాజీ ఎమ్మెల్యే నరందర్ రెడ్డి అరెస్ట్‌ను ఖండించిన బిఆర్ఎస్



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 10(సింగిడి): గత మూడు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్న సీ ఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హకింపేట లో సోమవారం నిర్వహించిన బహిరంగ సభకు జిల్లా నలుమూలన నుండి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన బస్సుల్లో తరలి వెళ్ళారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇదివరకు ఏనాడు లేని విధంగా దీపావళి సంబురాలను తలపించే విధంగా సమావేశాలు, శంఖు స్థాపణలు, శిలా ఫాలకాల ఆవిష్కరణ లు, ప్రదర్శనలు జరిగాయి. చివరి రోజు సోమవారం హకింపేటలో నిర్వహించిన సభతో సీ ఎం మూడు రోజుల పర్యటన ముగిసింది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల నుండి, ఆయా మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్ళారు. అయితే దీపావళి పండగ కొనసాగుతున్న తరుణంలో కొన్ని గ్రామాల నుండి ఆశించిన రీతిలో నాయకులు, ప్రజలు సమావేహానికి వెళ్ళలేకపోయారు. ఇదిలా ఉండగానే సీ ఎం రేవంత్ రెడ్డి కొడంగల్లో పర్యటిస్తున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేలు నరేందర్ రెడ్డిని నిర్భందించడాన్ని బి ఆర్ ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్త అంత్యక్రియలకు కూడా వెళ్లానివ్వక పోవడం ఇదెక్కడి ప్రజా పాలనా అంటూ ఆయన అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నాయకుడు మరణించడంతో అంత్యక్రియలకు వెళ్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ, కార్యకర్త చావుకు కూడా వెళ్ళొద్దనడం ఇదెక్కడి ప్రజల పాలనని, అగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లే సమయంలో పోలీసులు అడ్డుకోవకోవడం అప్రజాసౌమ్యమని రాష్ట్ర పరిపాలనలో పూర్తి స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైయిందని అన్నారు. రానున్న రోజుల్లో రేవంత్ రెడ్డి ఓటమి తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం కృషి: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్, నవంబర్ 10(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. అందుకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. దీపావళి పండుగ పర్వదిన సందర్భంగా పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పలు శుభ కార్యక్రమాల్లో, అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలల్లో పాల్గొనాలని పలువు ఆహ్వానించారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

- జిల్లా అదనపు కలెక్టర్లు సంగీత, పాండు
- ప్రజావాణిలో 32 దరఖాస్తులు



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 10(సింగిడి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పాండు ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు, దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ద్వారా సమర్పించే ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 32 దరఖాస్తులు అందాయి. వీటిలో సంగారెడ్డి డివిజన్ 9, నారాయణఖేడ్ 1, జహీరాబాద్ 1, సంగారెడ్డి కలెక్టరేట్‌లో 21 దరఖాస్తులు స్వీకరించారు. అందోల్ డివిజన్ నుండి ఎలాంటి వినతులు అందలేదు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు అఖిలేష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన పలువురు అగ్నికుల మాజీ సైనికులు



మల్కాజ్గిరి, నవంబర్ 10(సింగిడి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు అగ్నికుల క్షత్రియ మాజీ సైనికులు కాంగ్రెస్ పార్టీలో చేరడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. నేరేడ్ మెట్ డివిజన్‌కు చెందిన అగ్నికుల క్షత్రియ మాజీ సైనికుల సంక్షేమ సంఘానికి చెందిన దాదాపు 50 మంది సభ్యులు ఆదివారం నేరేడ్ మెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్ఆర్ ప్రసాద్ ల ఆధ్వర్యంలో మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. మైనంపల్లి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం మల్కాజ్గిరి లో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బెలాల రామారావు, ఏ తాతారావు, టి మోహన్ వర్మ, ఏ ఈశ్వర్ రావు, పి గోపాల్ పట్రావు, జి రామమూర్తి, బి పద్మనాభం, ఎం హేమచందర్ రావు, కె జోగారావు, ఏ కాంతారావు, జి నరసింహులు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు రాఘవన్, మధుసూదన్ రెడ్డి, తరుణ్, మల్లేష్, శ్యామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వేళ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ చేసిన ఉపేంద్ర నాథ్ రెడ్డి



రాజేంద్రనగర్, నవంబర్ 10(సింగిడి): దీపావళి పండుగను పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేసి ఘనంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. పండుగ వేళ వారి కుటుంబాల్లోనూ ఆనందం నింపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్మికులను గౌరవించడం అంటే వారి శ్రమను గౌరవించడమేనని, సమాజం వారి సేవలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ది సిటిజన్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ షేక్ ఆరిఫ్, కాలనీ సభ్యులు సాగర్, సురేంద్ర, సుజాత, రూప, కోటి, జస్వంత్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన కొలను హనుమంత రెడ్డి, రాజశేఖర్ రెడ్డి



కుత్బుల్లాపూర్, నవంబర్ 10(సింగిడి): దీపావళి పండుగ సందర్భంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, నిజాంపేట్ సర్క

ఇందిరమ్మ ఇళ్లలో నవకాంతుల దీపావళి

లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుభాకాంక్షలు



కొల్చారం నవంబర్ 10(సింగిడి): మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో దీపావళి పండగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల కుటుంబాలకు, జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ప ప్రతిమా సింగ్ ఆదివారం కుల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలోని జురు లత,సంతోష్ ఇందిరమ్మ ఇంటిలో దీపావళి సంబరాలు కలెక్టర్ పాల్గొన్నారు. జురు లత,సంతోష్ దంపతులకు దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. దీపావళి పండగసందర్భంగా "మా ఇందిరమ్మఇంట్లో దీపావళి" పేరిట ఈ లబ్ధిదారుల ఇళ్లలో కొత్త వెలుగులు నిండబోతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. నూతన గృహాల్లో అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబాల జీవితాల్లో ఈ దీపావళి కాంతులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని నింపాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఇందిరమ్మ ప్రత్యేక యాప్ ద్వారా సాయంత్రం ప్రతి లబ్ధిదారు తమ సెల్ ఫోన్ లో ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తమ సంతోషాన్ని తెలుపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ.ఈ. సుష్మ, సర్పంచ్ స్వప్న ఊసయ్య, నాగులగారి మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ పేరుతో సైబర్ మోసాలకు తెరలేపిన కేటుగాళ్లు!

ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపితే లైసెన్స్ రెన్యువల్ చేస్తామంటూ ఫేక్ కాల్స్

గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్ పట్ల వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్‌లోనే లైసెన్స్ పొందాలి

మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10(సింగిడి): వనపర్తి పట్టణంలోని ట్రేడ్ లైసెన్స్ పొందిన వ్యాపారస్తులను లక్ష్యంగా చేసుకుని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఫోన్ కాల్స్‌తో మోసాలకు పాల్పడుతున్నట్లు వనపర్తి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపిస్తే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయడంతో పాటు కొత్త లైసెన్స్ కూడా జారీ చేస్తామని నమ్మబలుకుతూ ఫోన్ కాల్స్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారస్తులందరూ అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ఫోన్‌పే నంబర్లకు డబ్బులు పంపవద్దని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ లేదా కొత్త లైసెన్స్ కోసం నేరుగా వనపర్తి మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అధికారుల సూచనల మేరకు అధికారిక ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారస్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండి సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ఉమామహేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ముచ్చింతల్‌లో ఘనంగా 'యతీంద్ర సప్తతి' వేడుకలు





రాజేంద్రనగర్ నవంబర్ 10(సింగిడి): శంషాబాద్ మండలం పరిధిలోని ముచ్చింతల్‌లో శ్రీ చిన్న జీయర్ స్వామి 70వ తిరునక్షత్ర మహోత్సవం 'యతీంద్ర సప్తతి' వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల రెండో రోజు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. బాలకిష్టారెడ్డి కీలక ప్రకటన చేశారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రపంచంలోనే మొట్టమొదటి ప్రత్యేక న్యాయ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన దరఖాస్తును మండలి ఇప్పటికే ఆమోదించిందన్నారు. ?ఇప్పటికే నేత్ర విద్యాలయ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో దృష్టి లోపం ఉన్న విద్యార్థులు స్క్రైబ్ సహాయం లేకుండా లాప్‌టాప్‌లపై పరీక్షలు రాసే విధానం అమలవుతోందని, ప్రపంచంలోనే ఈ గుర్తింపు పొందిన తొలి సంస్థలు అవేనని ఆయన గుర్తుచేశారు.

భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

శ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో సాకేత రామాలయంలో సంపూర్ణ సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఈ వేడుకల్లో వందలాది మంది భక్తులు పాల్గొని హనుమంతునికి లక్ష అరటిపండ్లు, లక్ష కొబ్బరికాయలు, లక్ష వడలు సమర్పించారు. అలాగే 108 కిలోల తేనెతో హనుమాన్ అభిషేకం వైభవంగా జరిపించారు.

సేవా కార్యక్రమాలు

భగవద్రామానుజుల సందేశాన్ని వ్యాప్తి చేసేలా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాస తరంగిణి, జీవా, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ వంటి సంస్థల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ప్రదర్శించారు. గిరిజన విద్యార్థులకు పాఠశాలలు, వేద గురుకులాల ద్వారా ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ, అలాగే బకాస్ ద్వారా భారత్‌తో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లలోనూ ఆధ్యాత్మిక, సామాజిక సేవలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నవంబర్ 10న వేడుకల మూడో రోజు కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

యాదవ సోదరుల ఆధ్వర్యంలో ఘనంగా సదర్ వేడుకల్లో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి



రాజేంద్రనగర్, నవంబర్ 10 (సింగిడి): రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రేమవతీ పేట, శివరాంపల్లి, కోకాపేట్ ప్రాంతాలలో యాదవ సోదరుల ఆధ్వర్యంలో సదర్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన సదర్ వేడుకల్లో పాల్గొని యాదవ సోదరులందరికీ ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు. సదర్ పండుగ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. యాదవ సోదరుల ఐక్యత, ఆత్మగౌరవం,గొప్ప సాంస్కృతిక వైభవాన్ని ఈ వేడుకలు సమాజానికి చాటిచెబుతాయని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఫారెస్ట్ అధికారుల నివాసగృహాలు!

లక్షలు వెచ్చించినా నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

పనిచేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలన్న ఉద్దేశం నీరుగారిందా?

అధికారుల పర్యవేక్షణ కరువైతే విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురయ్యే ప్రమాదం!



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10(సింగిడి): అటవీ ప్రాంతాల పరిరక్షణ, అక్రమ కలప రవాణా నిరోధం, అటవీ భూముల సంరక్షణ వంటి విధులను నిర్వహించే ఫారెస్ట్ సిబ్బంది విధులు నిర్వర్తించే ప్రాంతాల్లోనే నివాసం ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యంతో నిర్మించిన అధికారుల నివాస గృహాలు నేడు నిరుపయోగంగా మారుతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకోవడం అధికారుల పర్యవేక్షణ తీరుపై విమర్శలు వస్తున్నాయి.

-బుద్దారంలో సెక్షన్ ఆఫీసర్ నివాసం..
గోపాల్‌పేటలో బీట్ ఆఫీసర్ భవనం!

బుద్దారం గ్రామంలో నిర్మించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నివాస గృహం, పక్కనే చిన్న పాటి రెండు రూములు ఉన్న గదులు కూడా శిథిలావస్థలో ఉన్నాయి. గోపాల్‌పేట మండల కేంద్రంలోని చాకల్ పల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నివాస గృహం కూడా ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఈ భవనం ఏపుగా పెరిగిన ముళ్ళ పొదల మధ్య ఉంది. ఒకప్పుడు అటవీ సిబ్బంది నివాసం ఉండేందుకు ఉద్దేశించిన ఈ భవనాలు నేడు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల నిర్మాణం వెనుక ఉన్న ప్రభుత్వ ఉద్దేశం నెరవేరకపోగా, ప్రజాధనం వృథా అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

నివాసం ఉండాల్సిన చోట నిర్లక్ష్యం ఎందుకు?

అటవీ సిబ్బంది విధులు నిర్వహించే ప్రాంతాలకు సమీపంలోనే నివాసం ఉంటే అటవీ భూముల పర్యవేక్షణ, అక్రమ తవ్వకాలు, చెట్ల నరికివేత, వన్యప్రాణుల సంరక్షణ వంటి అంశాలపై నిరంతర నిఘా ఉంచే అవకాశం ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది వెంటనే స్పందించేందుకు కూడా ఈ నివాస గృహాలు ఉపయోగపడతాయి. అయితే నిర్మించిన భవనాలనే వినియోగంలోకి తీసుకురాకపోవడం వెనుక కారణాలేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

కబ్జాలకు గురైతే బాధ్యత ఎవరిది?

ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ భవనాలు, వాటికి సంబంధించిన ప్రభుత్వ స్థలాలపై నిరంతర పర్యవేక్షణ లేకపోతే ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన శాఖే తన పరిధిలోని భవనాలను పట్టించుకోకపోతే వాటి భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి

ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి!

బుద్దారం, గోపాల్‌పేటలోని నివాస గృహాల ప్రస్తుత స్థితిగతులను ఉన్నత స్థాయి అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. భవనాలకు మరమ్మతులు చేపట్టి అర్హులైన సిబ్బందికి కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలి. ఒకవేళ వినియోగానికి అనుకూలంగా లేకపోతే పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించకుండా, లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మిగలకుండా అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తాత్కాలికంగా భవనాల చుట్టూ కంచెను ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్తిని రక్షించాలని పలువురు కోరుతున్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి దేవరాజ్ వివరణ:- బుద్దారం గ్రామంలోని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, గోపాల్ పేట లోని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నివాస గృహాలు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమేనని ఖిల్లా ఘణపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి దేవరాజ్ అన్నారు. ఎన్నో ఏండ్ల క్రితం నిర్మించిన ఈ భవనాలు శిథిలావస్థకు చేరాయని, వాటికి మరమ్మతులు చేసేందుకు నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని చెప్పారు.



రాజీవ్ గృహకల్పలో డ్రైనేజీ లీకేజీలు, పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన సిపిఎం పార్టీ రాజీవ్ గృహకల్ప శాఖ



కుత్బుల్లాపూర్, నవంబర్ 10(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట సర్కిల్ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని డ్రైనేజీ లీకేజీలు అరికట్టాలని కోరుతూ సిపిఎం పార్టీ రాజీవ్ గృహకల్ప శాఖ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ బాచుపల్లి మండలం కార్యదర్శి బి.వెంకటరామయ్య, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో డ్రైనేజీ లీకేజీలు ఏర్పడి మురుగునీరు రోడ్లపైకి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో అక్కడక్కడా చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా నెలకొన్నాయి.డ్రైనేజీ లీకేజీల కారణంగా దుర్వాసన, దోమల సమస్యలు ఏర్పడటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా ఇబ్బందులు కలిగే పరిస్థితి నెలకొన్నది. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, డ్రైనేజీ లీకేజీలను మరమ్మతు చేయడంతో పాటు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, కాలనీలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాజీవ్ గృహకల్పలో నెలకొన్న డ్రైనేజీ, చెత్తాచెదారం, పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేశారు. వీధి దీపాలు ఏర్పాటు చేసి రేషన్ షాపు కేటాయించి, సిసి రోడ్లు స్థానిక సమస్యలపై అధికారులతో సమీక్షించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప శాఖ కార్యదర్శి బాల పేరు, సిపిఎం నాయకులు పి.స్వామి,వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలవరంలో ప్రత్యేక విద్యుత్ లైన్.. 18 దీపాల ఏర్పాటు



కోదాడ, నవంబర్ 10(సింగిడి): అనంతగిరి మండల పరిధిలోని పాలవరం గ్రామంలో స్మశాన వాటికతో పాటు కాటమయ్య గుడి వరకు 18 విద్యుత్ స్తంభాలకు 50 వాట్స్ సామర్థ్యం కలిగిన విద్యుత్ దీపాలను సర్పంచ్ మట్టపల్లి నరేష్ గౌడ్ ఏర్పాటు చేయించారు. గతంలో ఈ ప్రాంతంలో సరైన విద్యుత్ వెలుతురు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గతంలో లేని విధంగా ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి దీపాలను అమర్చినట్లు తెలిపారు. స్మశానవాటికకు వెళ్లే ప్రజలకు రాత్రి వేళల్లో ఇబ్బందులు కలగకుండా, కాటమయ్య గుడి పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన చోట్ల విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏర్పాట్లతో స్మశాన వాటిక, కాటమయ్య గుడి పరిసరాల్లో రాత్రి వేళల్లో వెలుతురు అందుబాటులోకి రానుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రామకోటయ్య, ఉపసర్పంచ్ బెల్లంకొండ అంజయ్య ,గౌడ సంఘం అధ్యక్షులు కాసాని వెంకయ్య ,గౌడ సంఘం ఉపసర్పంచ్ మట్టపల్లి పెద్ద వెంకన్న వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభ్యున్నతి

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు
- సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



మల్కాజిగిరి, నవంబర్ 10(సింగిడి): కాంగ్రెస్ పార్టీతోనే సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా మల్కాజిగిరిలోని సాయినగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జన్మదినదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. రానున్న రామన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, ఏకె మురిగేష్, కాంగ్రెస్ మల్కాజిగిరి ఇంచార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, పిట్ల శ్రీనివాస్, ఎస్.ఈర్. ప్రసాద్, ఉపేందర్ రెడ్డి, సత్యమూర్తి, శ్రీరామ్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవం

- ఎక్స్‌రే ఆవిష్కరణతో ఆధునిక వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- విల్హెల్మ్ రాంట్జెన్ సేవలను స్మరించుకున్న వైద్య సిబ్బంది



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10(సింగిడి): వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌రేలను కనుగొన్న శాస్త్రవేత్త విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ..1895లో విల్హెల్మ్ రాంట్జెన్ ఎక్స్‌రేలను ఆవిష్కరించడం ఆధునిక వైద్యరంగంలో రేడియాలజీ విభాగానికి పునాది వేసిందని చెప్పారు. ఈ అద్భుత ఆవిష్కరణకు గుర్తింపుగా 1901లో భౌతిక శాస్త్రంలో తొలి నోబెల్ బహుమతిని రాంట్జెన్ అందుకున్నారని, ఆయన ఎక్స్‌రేలను కనుగొన్న నవంబర్ 8వ తేదీని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రేడియోగ్రఫీ రంగం వైద్యరంగంలో అందిస్తున్న సేవలను స్మరించుకున్నారు. వ్యాధుల నిర్ధారణలో ఎక్స్‌రేలు, రేడియాలజీ సాంకేతికత ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్వామి, రఫీ, మహేష్, భాగ్యలక్ష్మి, సానా బేగం, హారిక, అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదుర్ల మహేష్ కుమార్ జన్మదిన వేడుకలు

మంత్రి దామోదర రాజనర్సింహా, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరు

శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు





వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10 (సింగిడి): తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్, తిరుమల హిల్స్ అధినేత సదుర్ల మహేష్ కుమార్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, టిపిసిసి ఓబీసీ కన్వీనర్ కేతూరి వెంకటేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సదుర్ల మహేష్ కుమార్‌కు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖులు ఆయనతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సదుర్ల మహేష్ కుమార్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రముఖుల సమక్షంలో జన్మదిన వేడుకలు ఆత్మీయంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

ప్రజా నాయకత్వంలో ప్రత్యేక గుర్తింపు చాటుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి

కొడంగల్‌లో ముఖ్యమంత్రికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సదుర్ల మహేష్



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10(సింగిడి): కొడంగల్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్, తిరుమల హిల్స్ అధినేత సదుర్ల మహేష్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సదుర్ల మహేష్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని కొనియాడారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ, పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ రాష్ట్ర ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



మల్కాజిగిరి, నవంబర్ 10 (సింగిడి): వినాయక్ నగర్ డివిజన్ లోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తామని వినాయక్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని లేన్-7లో డ్రైనేజీ పనుల కోసం రూ. 5 లక్షల 30 వేల నిధులను గతంలో కార్పొరేటర్ నిధుల నుంచి కేటాయించిన రూ. 2 కోట్ల నిధుల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని కాంట్రాక్టర్ కు సూచించారు. స్థానికులు రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాలని కోరగా, తప్పకుండా రోడ్డుకు ప్రతిపాదన వెంటనే పెట్టించి, వేయిస్తానని హామీ ఇచ్చారు. బస్తీవాసులు, బోరులో నీరు సరిగ్గా రావడం లేదని, వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి, రేపు బోర్ మెకానిక్ ని పంపి సమస్యను పరిష్కరిస్తాం అని జలమండలి డిజిఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బీజేపీ సీనియర్ నాయకులు ఓం ప్రకాష్, బస్తీవాసులు చందు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



‘దేవోం కే దేవ్ మహాదేవ్’ సీరియల్‌లో పార్వతీ దేవి పాత్రతో నటి సోనారిక భదోరియా గుర్తింపు పొందారు. అయితే, ఈ రోజుల్లో ఆ నటి మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇటీవల, హాటర్‌ఫ్లైతో జరిగిన సంభాషణలో, తాను ఎదుర్కొన్న క్యాస్టింగ్ కౌచ్ గురించి ఆ నటి వెల్లడించింది. సోనారిక మాట్లాడుతూ, “నా నిర్మాతలు నాకు డబ్బులు చెల్లించడం లేదనే కారణంతో, ఛానల్ హెడ్ నాకు మెసేజ్ చేసి ఒక హోటల్‌లో కలవమని అడిగిన సందర్భాలు రెండు మూడు సార్లు ఉన్నాయి” అని చెప్పింది.

ఆ తర్వాత, నేను ఛానల్ హెడ్‌ను బ్లాక్ చేశాను. నాకు ఆ డబ్బు వద్దని అతనికి చెప్పాను. తాను మంచి కుటుంబ నేపథ్యం నుంచే వచ్చానని సోనారిక చెప్పింది. తనను ఏ పనీ చేయమని బలవంతం చేసే పరిస్థితులేవీ లేవని తెలిపింది. సోనారిక ఇంకా ఇలా అన్నారు, “‘మహాదేవ్’ షో తర్వాత నేను సినిమాల్లో నా అదృష్టాన్ని పరీక్షించుకోవడం మొదలుపెట్టాను. నేను పదేపదే ఆడిషన్లకు వెళ్లాను. మేనేజర్లు తరచుగా నన్ను కాస్టింగ్ డైరెక్టర్లకు పరిచయం చేసేవారు.” ఒక ప్రొడక్షన్ హౌస్ సీఈఓ చాలా ఆసక్తి చూపించారు. ‘వచ్చి నన్ను కలవండి’ అని ఆయన అన్నారు. అలాంటి వాళ్ళు ఇద్దరు ముగ్గురు నాకు మెసేజ్‌ల ద్వారా మాట్లాడారు. కానీ నాకెమీ అంత పెద్దగా జరగలేదు. సోనారిక తనకు జరిగిన మరో సంఘటనను కూడా పంచుకున్నారు. మహాదేవ్‌కు ముందు, తాను ఒక షో చేస్తున్నానని, అయితే అది ఎప్పుడూ ప్రసారం కాలేదని ఆమె చెప్పారు. ఆ షోలో అలంకరణ కోసం ప్రత్యేక గదులు లేవని సోనారిక చెప్పింది. ప్రతి ఒక్కరికీ వారి వారి గదులు ఉండేవి. తనకు 24 లేదా 25 ఏళ్లు వచ్చే వరకు, తన తల్లి ప్రతి సెట్‌కు తనతో పాటు వచ్చేదని ఆ నటి తెలిపింది.

సోనారిక చెప్పింది, “నేను గదిలో బట్టలు మార్చుకుంటున్నాను. అప్పుడు ఏదో కింద పడినట్లుగా తలుపు తట్టే శబ్దం విన్నాను. గదిలో చెక్కతో చేసిన ఒక వస్తువు ఉంది, దానికి ఒక చిన్న రంధ్రం ఉంది, దాని లోపల ఒక పెట్టెలాంటిది ఉంది.” అమ్మ దాన్ని చూసినప్పుడు ఏదో తేడాగా ఉందనిపించింది. ఆమె అందరినీ పిలిచి, ‘నాకు సరిగ్గా అనిపించడం లేదు’ అని చెప్పింది. ‘ఇక్కడ ఏదో తేడాగా ఉంది, చూడండి’ అని కూడా చెప్పింది.

అమ్మ ఒప్పుకోలేదు, అందుకే దాన్ని తనే బయటకు తీసింది. అప్పుడు ఆమెకు అక్కడ ఒక ఫోన్ కనిపించింది, అంతా ఆ ఫోన్‌లోనే రికార్డ్ అవుతోంది. ‘అక్కడి క్లీనింగ్ అబ్బాయి లేదా మరెవరో అమ్మాయిల గదులన్నింటిలో ఒక ఫోన్‌ను ఉంచేవారు, తద్వారా అమ్మాయిలు బట్టలు మార్చుకున్నప్పుడల్లా, ప్రతిదీ అందులో రికార్డ్ అయ్యేది.’

సోనారిక చెప్పింది, “మేము ఆ వ్యక్తిని కనుగొని అక్కడికి తీసుకువచ్చినప్పుడు, మిగతావాళ్ళు తర్వాత ఏమైనా అనేవారేమో, కానీ నేను అతన్ని చితకబాదాను. నేను అతన్ని ఎంత గట్టిగా కొట్టానంటే నా గాజులు కూడా పగిలిపోయాయి.”

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

బట్టలు మార్చుకుంటుండగా..

సోనారికా భడోరియా

సిన్మా Cinma Singidi

బుధవారం
11-11-2026

నా విజయాల వెనుక నువ్వే..

డైరెక్టర్ అట్లీ ఎమోషనల్ పోస్ట్ వైరల్



కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ వ్యక్తిగత జీవితం జీవితానికి సంబంధించిన ఆసక్తికర పోస్ట్ ప్రజెంట్ నెటిజన్లను ఆకర్షిస్తుంది. ‘రాజా రాణి’, ‘తేరి’, ‘మెర్సల్’, ‘బిగిల్’, ‘జవాన్’ వంటి సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అట్లీ.. నటి, నిర్మాత ప్రియా కృష్ణను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరికీ దాదాపు ఎనిమిదేళ్ల పరిచయం ఉండగా, ఆ స్నేహం కాస్త ప్రేమగా మారి ఇరు కుటుంబాల అంగీకారంతో 2014 నవంబర్ 9న చెన్నైలో వీరి వివాహం ఘనంగా జరిగింది. వివాహం తర్వాత కూడా ప్రియా అట్లీకి అన్ని విషయా ల్లో అండగా నిలిచారు. మొత్తానికి సుమారు 12 ఏళ్ల వైవాహిక జీవితాన్ని పూర్తి చేసుకున్న అట్లీ.. తాజాగా తన పెళ్లి రోజు స్పెషల్‌గా ఎమోషనల్ పోస్ట్‌ను షేర్ చేశాడు. ‘చిన్నప్పటి నుంచీ, జీవితంలో ఎల్లప్పుడూ తోడుండే ఒక్క నిజమైన స్నేహి తుడు ఉంటే చాలు అని వింటూ పెరిగాను.

నేను దేవుడిని ఒక అందమైన జీవితం కోసం ప్రార్థించాను, కానీ ఆయన నాకు అంతకంటే గొప్ప వరాన్ని ఇచ్చారు... అదే నువ్వు (ప్రియా). జీవితంలోని ప్రతి దశలోనూ నువ్వు నాకు అండగా నిలిచావు. ఒక అబ్బాయిని పురుషుడిగా, ఆ పురుషుడిని ఒక ఉత్తమ వ్యక్తిగా మార్చావు. నన్ను భర్తగా, తండ్రిగా, అన్నింటికంటే ముఖ్యంగా ఒక మంచి మనిషిగా తీర్చిదిద్దావు. ప్రపంచం నా విజయాలను చూసి అభినందించవచ్చు, కానీ నా విజయాల వెనుక ఉన్న అసలు కారణం నీ నిస్వార్థమైన ప్రేమ, దయ, నాపై నీకున్న నమ్మకమేనని నాకు బాగా తెలుసు. మన వివాహ బంధానికి 12 ఏళ్లు, మన స్నేహానికి దాదాపు 18 ఏళ్లు! నా జీవితంలో నేను సాధించిన అతి గొప్ప విజయం ఏదైనా ఉందంటే, అది నువ్వు నా పక్కన ఉండటమే. నువ్వు లేకపోతే నేను లేను. నువ్వు ఉంటే చాలు, నా దగ్గర అన్నీ ఉన్నట్లే. నా ప్రాణ స్నేహితురాలిగా, నా ప్రేమగా, నా బలంగా, నా సర్వస్వంగా ఉన్నందుకు ధన్యవాదాలు. ప్రతిరోజూ నన్నే నీ జీవిత భాగస్వామిగా ఎంచుకుంటున్నందుకు కృతజ్ఞతలు. వివాహ వార్షికోత్సవ శు భాకాంక్షలు నా ‘లడ్డూ’, నా ‘సుజీ’ అంటూ తన పెళ్లినాటి ఫొటోను పంచుకున్నాడు. ప్రజెంట్ ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

నా పాత్ర చంపేయడం వెనుక డైరెక్టర్ ఆలోచన అదే..

వైరల్‌గా కీర్తి సురేష్ కామెంట్స్



మ్యారేజ్ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన కీర్తి సురేష్.. ప్రజెంట్ వరుస ప్రాజెక్టులు చేస్తూ సందడి చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఈ అమ్మడు.. ‘డోరతి చిత్రంలో మిమ్మల్ని ఎవరు చంపారు? ఆ పాత్ర ఎలా మరణించింది.. ఆ సస్పెన్స్ ఏంటీ?’ అనే ప్రశ్నపై స్పందిస్తూ.. ‘నా మనసులో కూడా ఇదే ప్రశ్న మెదిలింది. ఆ పాత్రకు ఏమైందో మనం ఎందుకు చూపించలేదు? అని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్‌ని అడిగాను. ఆయన దీన్ని ఒక ‘ఓపెన్ ఎండెడ్’ (ముగింపును ప్రేక్షకుల ఊహకే వదిలేసేలా) ఉంచాలనుకు న్నారు. సాధారణంగా చాలా సినిమాల్లో ఒక పాత్ర ఎలా మరణించింది, దానికి గల కారణం ఏమిటి అనేది చూపిస్తుంటాం. కాబట్టి సహజంగానే మనకు ఇలాంటి ప్రశ్నలు కలుగుతాయి, కానీ ‘డోరతి’ చిత్రంలో దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఆ పద్ధతిని మార్చాలనుకు న్నారు. ఆ పాత్ర ఎలా మరణించిందో చూపించాల్సిన అవసరం ఏముంది? ఆమె ఎలా మరణించి ఉండవచ్చో మీరే ఊహించుకోవచ్చు కదా!’ అంటూ చెప్పుకొచ్చింది.

ముగిసిన మరో బంధం..

విడాకులు తీసుకున్న పవన్, అన్నా లెజినోవా



జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన భార్య అన్నా లెజినోవాతో వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లుగా ప్రకటించారు. ఈ మేరకు శ్రేయోభిలాషులు, సన్నిహితులు, అభిమానులను ఉద్దేశించి పవన్ కల్యాణ్, అన్నా లెజినోవా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాము జీవితంలో ఎంతోకాలం కలిసి ప్రయాణించిన అనంతరం పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. వివాహ బంధం ముగిసినప్పటికీ మంచి స్నేహితులుగా, పిల్లలకు బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా కొనసాగుతామని తెలిపారు. పిల్లల సంతోషం, సంక్షేమమే తమ ఉమ్మడి ప్రాధాన్యతగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ వ్యక్తిగత మార్పు సమయంలో తమ గోప్యతను గౌరవించాలని, అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. ఇప్పటివరకు తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

వారు మూర్ఖులతో సమానం..

రేణు దేశాయ్ సంచలన పోస్ట్



పవన్ కళ్యాణ్ మాజీ భార్య నటి రేణు దేశాయ్ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తనకు అనిపించిన విషయాలను సూటిగా పంచుకుంటారు. తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక సంచలన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట తీవ్రంగా చర్చ నీయాంశమైంది. దీపావళి వేడుకల పేరుతో అర్ధరాత్రి వేళల్లో కూడా పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాల్చడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక నోట్ విడుదల చేశారు. రాత్రి 11 గంటలు దాటుతున్నా కొందరు ఇంకా పెద్ద శబ్దాలు వచ్చే బాణసంచా కాలుస్తూనే ఉన్నారని ఆమె మండిపడ్డారు. పండుగ రోజే దీని గురించి మాట్లాడితే తనను తప్పుగా అర్థం చేసుకుని హిందూ వ్యతిరేకి అని అంటారనే భయంతోనే ఆ రోజు మౌనంగా ఉండిపోయానని చెప్పారు. అయితే దీపావళి అయిపోయిన తర్వాత కూడా రాత్రి 11 గంటలకు అంత పెద్ద శబ్దాలతో టపాసులు కాల్చడానికి ఏపండుగ? ఉందని ఆమె ప్రశ్నించారు. ఇతరుల ఇబ్బందులను పట్టించుకోకుండా కేవలం తమ సొంత ఆనందమే ముఖ్యం అనుకోవడం నిజంగా మూర్ఖత్వమే అవుతుందని ఫైర్ అయ్యారు. ఎదుటివారి పట్ల కనీస సానుభూతి లేకపోవడమే దీనికి కారణమని రేణు దేశాయ్ అన్నారు. దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవడాన్ని తాను తప్పుపట్టడం లేదని, కానీ పండుగ సంబరాలను శబ్దాల పోటీగా మార్చవద్దని కోరారు. వీల్లైనంత వరకు రాత్రి 10 గంటల లోపే టపాసులు కాల్చడం పూర్తి చేయాలని సూచించారు. ఆ తర్వాత అయినా ప్రజలను ప్రశాంతంగా ఉండనివ్వాలని తెలిపారు. మన ఆనందం కోసం ఇతరులను హింసించకూడదని, తోటి మనుషుల పట్ల దయ చూపించాలని ఆమె కోరారు.

singidinews@gmail.com

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737